నవంబర్ 16-30, 2021

సంపుటి 02, సంచిక 03

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

## విషయ సూచిక




45 **సుంకిరెడ్డి నిర్మాణం**లోని లోతులు విశ్లేషించిన **సంగిశెట్టి**



17 స్త్రీ తనకు తానే నిలదొక్కుకునే వైనం తెలిపిన కథ... **లక్ష్మీ కందిమళ్ళ... దృష్టి**



09 **దళిత మహిళా జీవితం**లోని అనేక కోణాలు తెలిపిన **ఎం. నారాయణ శర్మ** వ్యాసం....



31 వియోగంలో స్నేహాన్ని తెలిపిన **వాసవ దత్త రమణ... సయోధ్య** కథ



29 గంగాధర్ ఈ **ఆనందవర్ధనం** వ్యాసానికి **కటుకోజ్వల** విశ్లేషణ...



25 గూడు కోల్పోయిన పౌరుని విషాదం... **పిన్నింశెట్టి** కథ.. **కాకి ఎత్తుకు పోయింది**



05 పండుగ కూడా పడగ విప్పుతుందని తెలిపిన **బెల్లంకొండ చంద్రమౌళి** నాటి కథ.... **కొత్త పండుగ**



19 వైవిధ్యమైన తెలుగు నాటకాలను **కె.పి.** విశ్లేషణ

**తెలంగాణలోని మరుగుపడ్డ ఆచారాల**ను తెలిపిన వ్యాసం... **సుప్రని...** 43వ పేజీలో

**పొన్నం రవి చందర్** కవిత...**అలసట...** 27వ పేజీలో

**వైరారు కృష్ణ రావే** కవిత... **నిశానీ...** 02వ పేజీలో

**నిదూల రవీంద్రనూరి** కవిత... **తడుస్తున్న పోయెమ్...** 08వ పేజీలో

**డా॥ పెరుగు రామకృష్ణ** కవిత... **దేహాలయం...** 16వ పేజీలో

**రూప్‌కుమార్** కవిత... **పిట్ట గూడుకు వలస వెళ్ళాలి...** 04వ పేజీలో

**కరిపె రాజకుమార్** కవిత... **విత్తనం...** 27వ పేజీలో

ఇంకా... సాహితీ శిఖరం, ముఖాముఖి, సాహితీ సామాచారం, పుస్తక పరిచయం, స్వీకారం మొదలైనవి.

కవిత

# నిశానీ



డా॥ వై.రామకృష్ణారావు,సిడ్నీ(ఆస్ట్రేలియా)
whats app: +91 89857 43964

ఎవరికైనా సరే
చిన్ననాటి ఆటల అల్లరి పారవశ్యం చిత్రించిన
గాయం తాలూకు ఆనవాలు
ఒంటి మీద ఎక్కడో ఓచోట ఉండకపోదు
ఒకటో, రెండో, మరెన్నో...
ఆ గాయాల చిత్రాలకు,
మోకాళ్ళు, మోచేతులే తొలి కాన్వాసులు!

పెద్దయ్యాక తీరిగ్గా తడుముకుంటే
ఒక్కొక్కటీ యుద్ధవీరుడి కిణాంకంలా
సైనికుడి దేహంపై కత్తివేటులా
పౌరుషచిహ్నమై....

ఆ మచ్చ
పరవళ్ళ పసితనపు ఒలింపిక్ పతకమై వెలుగుతుంది
సావకాశంగా స్మరించుకుంటే
ప్రతి లాంఛనం
ఓనమాలు దిద్దని పసివాడి సంతకమవుతుంది

బడికెళ్ళే బాలవీరుడి ఆటవిడుపు కవితవుతుంది
రెక్కలు మొలిచిన బాల్యమవుతుంది
ఒక ఆహ్లాద సన్నివేశమవుతుంది.
ఓ పెద్దాయనా!

పిల్లకాయల్ని ఊరికే సతాయించకు
ఎక్కనీ, దూకనీ, పొర్లనీ, ఈదనీ....
వాడు ఎక్కకపోతే ఆచెట్టుకు వసంతమే లేదు
వాడు పొర్లకపోతే ఆమట్టికి సుగంధమే లేదు
వాడు ఈదకపోతే కాలువకు కాళ్ళు తెగినట్లే
మేనిపై జీవితాంతం తోడుగా మిగిలే ఆ నిశానీ
బ్రతుకుపుస్తకంలో ఓ కమ్మని కహానీ!



తంగేడు
తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-30 నవంబర్, 2021

సంపుటి 02 సంచిక 03



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# కొనసాగాలి...

ప్రతి వ్యక్తి అనంత జీవన ప్రస్థానంలో ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే ఒక నిరాశ మిగులుతుంది. మనిషి ఎంత కీర్తినైనా పొందవచ్చు. డబ్బునైనా సంపాదించవచ్చు. అధికారాలను అనుభవించవచ్చు. అయినా ఎందుకీ అసంతృప్తి? ఏది కోల్పోయానని ఇట్లా కించపడడం? మనిషికి సాధారణంగా కావలసినవి అన్నీ తాను పొందాడు కదా. ఇంకా ఈ లుప్తత ఎందుకు? నిజానికి ఒక వ్యక్తి ఎప్పుడు తృప్తిగా ఉంటాడు? కేవలం తనకొరకు మాత్రమే కాక సమాజం కోసం కొంత జీవించగలిగినపుడు ఇంత అసంతృప్తి పొటమరించే అవకాశం ఉండేది కాదు. ఇట్లాంటి జీవితం పొదగలిగే చైతన్యం మనిషి కావాలంటే అతనికి ఏకైక మార్గం సాహిత్యాధ్యయనమే. నిరాశ నిస్పృహల్ని పారద్రోలి మనిషిని నిటారుగా నిలబెడుతుంది సాహిత్యం. ఎన్నో అస్పష్ట మానసిక చాంచల్యతకు స్పష్ట నిర్దేశం చేస్తుంది.

సాహిత్యం విభిన్న వాదాల కూడలి. విపరీత చర్చలకు దోహదకారి కదా! ఎట్లా దీన్ని స్ఫూర్తివంతం చేసుకోవడం? నిజమే... సాహిత్యం ఎన్ని మార్గాలకు దోహదం అయినా కావచ్చు. ఎన్ని వర్గ దృక్పథాలను ప్రోది చేసినా చేయొచ్చు. మనిషి ఆలోచనలకు కొత్తమార్గం కూర్పుతుందనడం నిస్సందేహం. సాహిత్యం రెండు పాయలుగా ప్రధానంగా నడుస్తుంటుంది. అది ఒకటి జీవితం. రెండు : జీవితానంతర దృశ్యం. మనిషి జీవితం చైతన్యవంతంగా గడిచిపోవాలి. ఎట్లాంటి ఆర్థిక బాధలకు, దోపిడికి, వివక్షణకు, వివక్షకు మనిషి గురికాకూడదు. అందుకు ఏ వ్యవస్థ
ఉండాలి. ఒకరి పెత్తనం మరొకరిమీద ప్రసరించని ఎట్లాంటి నిర్మాణం మనం పొందాలి? ఈ రకమైన అనేక కోణాలతో సాహిత్యం అనేక అస్తిత్వవాదాలుగా విడిపోవడం మనం చూస్తున్నాం.

ఇక సార్వజనీనమైన మానవ దు:ఖం గురించిన గవేషణ మొదటి నుంచీ సాగుతూనే ఉంది. అటు వైజ్ఞానికంగా, ఇటు ఆధ్యాత్మికంగా తుది గమ్యం లేకుండా కొనసాగుతూనే ఉంది. ఈ అన్వేషణలో మనిషి ఆకాశానికి ఎగురుతున్నాడు. నిమ్నోన్నతాలు చవి చూస్తున్నాడు. అనేకానేక కళాత్మక అభివ్యక్తులకు దోహదంగా నిలుస్తున్నాడు. అయినా ఈ రెండు అన్వేషణలకు జవాబు దొరకడం లేదు. అదే విధంగా మనిషి తిరోగతుడూ కావడం లేదు. తన అనంత ప్రస్థానం కొనసాగిస్తూనే
ఉన్నాడు.

మానవ సమాజం ఈ ప్రశ్నలన్నింటికీ ఏనాటికైనా జవాబు పొంద గలుగుతుంది ఆ వరకు మనిషి సాహిత్య సంలీనతతో కొనసాగడమే చేయవలసిన పని....

కవిత
కల్వకుంట్ల

కవిత

# పిట్ట గూడుకు వలస వెళ్ళాలి!



డా॥ రూప్ కుమార్ డబ్బీకార్, 99088 40186



నాకంటూ ఓ గది వుండాలి..
నాకు తెలుసు - గది లోపల సింగిడీలు
మొలకెత్తవు, పచ్చదనాలు పల్లవించవు
గది నిండా ఖాళీతనమే - ఐనా
నా కంటూ ఓ గది వుండాలి కదా..?!

వలయం బిందువుగా కుదించబడినప్పుడు,
శ్వాస మాత్రం ఓ నిట్టూర్పు విడుస్తోంది!
బయట చిన్న అలికిడి - ఒంటరి పిట్ట అరుపు దీనంగా,
తెరలు తెరలుగా ప్రవహిస్తూ దూరమవుతున్నట్లు ఎవరక్కడా !?

గది తలుపులు, కిటికీ తెరవండి, ప్రవహించే గాలిని,
గాయపడిన పాటని లోనికి రానివ్వండి!
తొమ్మిది ద్వారాలున్నా, ఈ గదిలోని
'గాలి' శ్వాస తీసుకోవడంలో ఆయాసపడుతోంది !

నాకంటూ ఓ నీడ వుండాలి
నాకు తెలుసు - నీడకు పునాదులుండవు,
మొగులుకు నిలకడ వుండదు
నీడ నిండా మసకబారిన తనమే -
ఐనా నాకంటూ చిరునామాలా ఓ నీడ వుండాలి కదా..?!

కరువు నిండిన రాతెండి కంచంలోకి
తడారిన మెతుకుల నీడల్ని వార్చుకోవడం
పేగు తెగిన దుఃఖమైంది దేహం పెనుగాయాల సిబ్బి,
దూరాన గుడ్లగూబ అరుపులు ఆగి ఆగి భయం
గొల్పుతూ దగ్గరవుతున్నట్లు ఎవరది!?

చెట్టు నుండి కొమ్మను, కొమ్మ నుండి
ఆకులను వేరు చేయకండి
కొమ్మ అంచున వేళ్ళాడే
పిట్ట గూడుకు వలస వెళ్ళాలి

ఇప్పుడు -
ఎండలో ఆరబెట్టిన మంచులా వుంది నా దేహం -
భవిష్యత్తు, పొరలు పొరలుగా
పొగల తెరను తీసి పరిహాసమాడుతోంది.

# కొత్త పండుగ

పండుగ కూడా ప్రళయమే అని చెప్పే కథ...

బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి

**బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి 1946-61ల మధ్య రాసిన (కథాకళి) కథల సంకలనమిది. ఇది అప్పటి ప్రజాబంధు, ఆంధ్రవారపత్రిక, గోలకొండ, కృష్ణా, స్వతంత్ర మొదలైన పత్రికలలో ప్రచురింపబడ్డాయి. ఆ కాలంనాడు పండుగలు కూడా ఎన్నో కష్టనష్టాలను తెచ్చిన తీరును 'కొత్తపండుగ'లో కథనం చేసిన తీరు విలక్షణంగా ఉంది.**

"భోం... భోం... భోం" శంఖారావం చేశాడు సంక్రాంతి భిక్షకొచ్చిన జంగం శివలింగం.

వాకిలి నిండా లతలూ పూవులూ తీర్చి సంకురుమయ్య రథాలు పరుగత్తిస్తున్న సుందరమ్మ చెంగుపట్టుకుని జీరాడుతున్న పాపాయి కెవ్వున యేడ్చియ పడిపోయాడు. ఆమె చేతిలో ముగ్గుబుట్ట ఆమెకు తెలియకుండానే జారి కింద ఒలికిపోయింది. పాపాయిని అమాంతం ఎత్తి గుండెల కదుముకుని పండుగపూట ఇదేమిట్రా భానూ అంటూ కళ్ళనీళ్ళు కారుతోంటే ఎంతో ఓదార్చింది!

నిద్రపోతోన్న కళ లోపల్నించి హడావిడికి లేచి జీగురోమంటూ కళ్ళు నులుముకుంటూ తల్లి దగ్గరికి వచ్చి "అమ్మా! ఏంతే పాపా యేడుతున్నావేమే!" అంటూ కెక్కురుమని ఏడుపులంకించుకుంది!

శివలింగం అడుగు కదపలేదు.

**పాపాయి ఏడుపిడిగాడు గాని, కళ మాత్రం వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది. తల్లీ పిల్లలూ లోపలికి వచ్చారు. సుందరమ్మ బియ్యం పట్టుకుని వాకిట్లోకి వచ్చేటప్పటికీ జంగం దేవర అదృశ్యమయ్యాడు!**

మొద్దబారి అమ్మగారూ అమ్మగారూ అంటూ అక్కడే నిలబడిపోయాడు! వీధంట పోయే అమ్మా, అక్కా "ఏమమండోయ్ సుందరమ్మ గారూ! ఇవ్వాళ పండుగంతా మీ గుమ్మంలోనే ఒదిగిపోతుందిలాగుందే!" అంటూ వెళ్ళుతూ వస్తూ ఉన్నారు.

పాపాయి ఏడుపిడిగాడు గాని, కళ మాత్రం వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది. తల్లీ పిల్లలూ లోపలికి వచ్చారు. సుందరమ్మ బియ్యం పట్టుకుని వాకిట్లోకి వచ్చేటప్పటికీ జంగం దేవర అదృశ్యమయ్యాడు!

పండుగ తొలి ఉత్సాహంతా పోయి సుందరమ్మ యెలాగో అయింది!

తూరుపు కొన చివళ్ళ నుండి కెంపుల బాణాలు వదుల్తూ వెనుకనుండి ఎవరో వడివడిగా వస్తున్నట్లుగా ఉంది! బంగారు కాగడాల కాంతి నెట్టుకుని వస్తోంది. ఆ వెలుగులో ఎవరున్నదీ తెలియటం లేదు. రంగురంగుల పిట్టలు రాగాలు తీస్తూ ఉరుకులూ, పరుగులూ పెడుతున్నై! చలిలో పెద్ద చెరువులో స్నానాలూ జపాలూ చేసేవాళ్ళ గుండెల్లోని గుబులు వాళ్ళెంత అణచుకున్నా ఆగక శ్లోకాలూ, పాటలూ అనుకోని స్వరాలతో బిగ్గరగా బయటికి వచ్చేస్తున్నాయ్! ఊళ్ళో గజ్జెల మువ్వల గణగణలతో గింయ్, గింయ్- ఢమకఢం తాళాలలతో- బూ అనే మొండి శ్రుతీ, తుతుతూ అంటూ అపస్వరపు సన్నాయి మేళాలతో డూడూ బసవన్నలు బయలుదేరారు! అక్షయపాత్ర స్వాములైతే మేము మీ యింటికి ముష్టికొచ్చామా అన్నట్లుగానే వీధి గుమ్మంలో అచారి పచారి చేస్తూ 'కస్తూరి రంగయ్య' కీర్తనలు దంచేస్తున్నారు.

ఇంకా రకరకాల బిచ్చగాళ్ళు!

ఆహా! ఏమి వైభోగం! కానీ ఖర్చులేకుండా ఇంత సంబరం ఎవరు చేస్తున్నారు!

ఎప్పుడు రాని పాలముంతలు నెత్తిన బెట్టుకుని గొల్లభామలూ, రేగుపండ్ల తట్టలతో లంబాడీ పడుచులూ, వస్తే వాళ్ళ వెంట తగిలి కోడెకారు వాళ్ళ బేరాలూ....

నాటి కథ

ఓహో ఇదా పండుగంటే!!

ఎంత ఉత్సాహం తరగల నురుగులుగా మెరుస్తోందో!

సుందరమ్మ పెద్దబిడ్డ శశిరేఖను అత్తారింటికినుంచి తీసుకరావటానికి వెళ్ళి భర్త రాత్రికే రావాల్సింది! ఇవాళ ఉదయం పదిగంటలైనా రాలేదు. పాపాయి తొట్టెలో నైతే ఏడవకుండా పడుకున్నాడు గానీ ఉలికులికి పడుతున్నాడు! కళ 'కొత్తబత్తలే!' అంటూ పరికిణీ జాకెట్టూ తొడిగించుకు తిరిగింది.

సుందరమ్మకు ఇవాళ పండగలా లేదు. దండగ లాగుంది!

సరిగ్గా రెండు ఝాములకల్లా కరకరలాడుతూ కూతురును తీసుకురాకుండానే విశ్వం ఒక్కడే వచ్చాడు. సుందరమ్మ దిగాలుపోయింది. అన్నింటికంటే విచ్చిత్రం పొయ్యిలో పిల్ల లేవలేదు ఇప్పటిదాకా! ఎంతో అదుర్దాగా గుచ్చిగుచ్చి అడిగింది అమ్మాయిని తీసుకురాలేదేమని!... "అల్లుడికి జబ్బుగా ఉంది. ఇవాళ పండుగాయె. ఇంటి దగ్గర మీరేం కంగారుపడతారో అని వచ్చాగానీ అతనికేమీ బావులేదు!" అన్నాడు కళ్ళద్దాల్లో నీళ్ళు మెరుస్తోండగా!

సుందరమ్మ గుండె - గుండె బాదుకొని ఏడుపు మొదలెట్టింది! విశ్వం ఎంతో సముదాయించాడు. పిల్లలు ఆకలని ఏడుస్తున్నారు!...


**సుందరమ్మ** దిగాలుపోయింది. అన్నింటికంటే విచ్చిత్రం పొయ్యిలో పిల్ల లేవలేదు ఇప్పటిదాకా! ఎంతో అదుర్దాగా గుచ్చిగుచ్చి అడిగింది అమ్మాయిని తీసుకురాలేదేమని!... "అల్లుడికి జబ్బుగా ఉంది. ఇవాళ పండుగాయె. ఇంటి దగ్గర మీరేం కంగారు పడతారో అని వచ్చాగానీ అతనికేమీ బావులేదు!" అన్నాడు కళ్ళద్దాల్లో నీళ్ళు మెరుస్తోండగా! సుందరమ్మ గుండె - గుండె బాదుకొని ఏడుపు మొదలెట్టింది! విశ్వం ఎంతో సముదాయించాడు. పిల్లలు ఆకలని ఏడుస్తున్నారు!...


ఇరుగమ్మా పొరుగమ్మా గుసగుసలూ, "ఏమిటి వారింట్లో ఇవ్వాళ తీరితీరి కజ్జా వేసుకున్నట్టున్నారేం!"

"కాదోయ్ వాళ్ళ శశికి చాలా జబ్బుగా ఉందిట. తండ్రి ఇప్పుడే వచ్చినట్టున్నాడు. చెప్పుకుంటున్నారు. ఆవిడ ఏడుస్తోంది!"

"అలాగా! పాపం! వాళ్ళింట్లో పిల్లలకి ఇవ్వాళ పళ్ళు పొయ్యరు గామాలు!!" ఇలా ఎందరో ఎన్నో చెప్పుకున్నారు.

వీళ్ళు భోంచేశారా లేదా! అని ఎవరెందుకనుకుంటారు. అందులో పండుగనాడు!

ఈ పండుగ మహోత్సాహంలో మండేగుండెల్తో ఎంతోమంది అలమటిస్తున్నారు. దాన్నెవరు కనుక్కుంటున్నారు!

విశ్వమే వంటింట్లోకి వెళ్ళిపోయి రాజేసేసరికి బ్రహ్మ ప్రళయమైంది. పక్కయింటి సరస్వతమ్మగారు తీరుబాటుగా బైలుదేరివచ్చి "ఏం సుందరమ్మా! పెద్దపిల్లకు జబ్బుగా వుందా! మీ ఆయన వచ్చారటగా!"



నాటి కథ

సుందరమ్మకు ఈ మాట మరీ తప్పుగా, బాధగా తోచింది. "కాదు బామ్మ గారూ మా అల్లుడికి వంట్లో బాగులేదట!"

"అట్లాగటోయ్. వాళ్ళ లక్ష్మి చెప్పిందమ్మా నాకేం తెల్సు! సరే గాని ఇంకా భోజనాలు గానట్టున్నయ్యేం!"

సుందరమ్మకు ఈ మాట వినేటప్పటికే ఏడుపు ఉబికివచ్చింది. "ఖులేదు... ఈ పండుగ లెందుకొస్తాయో అమ్మా ప్రజల్ని ఏడిపించుకు తినటానికి" అన్నది సుందరమ్మ.

"అదేమిటి! పండుగలేం జేసినై! ఎవళ్ళ ప్రారబ్ద ఖర్మం వారనుభవిస్తారుగాని!"

వంటింట్లోంచి విశ్వం "వెధవ తుక్కు వేదాంతాలూ" అని బిగ్గరగానే పండ్లు కొరుకుతూ "ఏయ్ వస్తావా!" అన్నాడు.

ఇది గ్రహించి సరస్వతమ్మ గారు పీటం వేసి "పో అమ్మా పో... పండుగనాడు ఉపోషం ఉండరాదు" అంటూ వెళ్ళిపోయింది.

"నా కాకలి లేదు" అన్నది సుందరమ్మ.

"నాకూ ఆకలి లేదు" అనుకుంటూ బైటికి వస్తూ విశ్వం "పిల్లలు మాడి పోతున్నారు, వాళ్ళ మొహాన్నన్నా ఇంతపడేయ్!" అన్నాడు

"వాళ్ళూ సొమ్మసిల్లినట్లు పడుకొన్నారు!" అన్నాడు విశ్వం.

"ఇవాళ్టితోటే ప్రళయమా? నీకేమీ అర్థం గావడం లేదు! నీకు పిచ్చి రోజు రోజుకూ ముదిరిపోతోంది!" అన్నాడు విశ్వం.

"జొన్నచేలో పడ్డదని లేగడావు కాలు విరగ్గొట్టారు!" అని రొజుకుంటూ వచ్చి చెప్పాడు పాలేరు పిల్లాడు అప్పుడే!

"ప్రళయమంటే ఇంకెట్టా ఉంటుంది" అని గోడకు జేరగిల బడ్డది సుందరమ్మ.

"సరేలే!! ఈ పండుగ లేకపోతే ఇంత బాధ ఉండకపోను! ఇది ఎంతమందిని సంతోషపెడ్తుందో! ఎంతో మంది ఈ రోజు యమబాధ ననుభవిస్తారు! మనదాకా వచ్చింది కనుక మనకు ఇవాళ తెల్సింది! ఈ రోజున ఎంత ఆకలి ఈ రోజుకే నోరుంటే ఈ పంటలూ పాడీ గుటకాయిస్వాహా! చాలనే చాలవు!!"

"దేవుడికి దయవుండి అల్లుడికి నిమ్మళించినట్టు ఉత్తరం వస్తే మనం ప్రజల్లో కలిస్తే!... పాపాయి దేముందిలెండి అనుకున్నాడు వెధవ రేపు రక్షరేకు కట్టిస్తే ఒక్క దులుపు దులిపి తిరుగుతాడు.

"రేపు అన్నీ బాగానే ఉంటాయ్! ఇవ్వాళనే!... ఆ కుర్రకుంక కింత కూడు పడేద్దూ చచ్చిపోతారు!!"

"ఏం ఫర్వాలేదు. మనలాటివారు కోటానుకోట్లుంటారు దేశంలో!"

"ఏం దేశమే పాడుదేశం! పిల్లాళ్ళు శోష వచ్చి పడిపోతే!"

బలవంతాన పిల్లల్ని వంటింట్లోకి తీసుకెళ్ళి అన్నం తిన్పించింది సుందరమ్మ.

కాలు విరిగిన ఆవును ప్రొద్దు గ్రుంకుతుండగా మోసుకొచ్చి ఇంటి ముందు పడేశారు పాలేళ్ళు. దాని ఉపచారం కట్టుకట్టడం అయ్యేసరికి చాలా రాత్రయింది.

పండగ పప్పులకు పోటీలు పెట్టుకుని లొట్టలూరుతూ వచ్చిన జీతగాళ్ళు ఈ వాలకమంతా చూసి చప్పగా జారిపోయారు. ఆ రాత్రంతా నీరసం వల్లనేమి, కష్టలు దృష్టికి తెచ్చుకుంటూ నేమి నిద్రపోలేదు. మర్నాడు తేలితేలిపోయే కాళ్ళు చేతులతో తడబడుతూ పెందలాడే కూడూ కూరా జేసింది సుందరమ్మ.

**అల్లుడు బాగా కోలుకొన్నదాకా అక్కడే వున్నారు. నెలరోజుల తర్వాత అల్లుణ్ణి బిడ్డనూ తీసుకవచ్చింద్రు. ఆనాటి సంక్రాంతి ఉపవాసం, అల్లుడి జబ్బు బెంగా, బాధలతో సుందరమ్మ ఇంటికొచ్చి మంచం పట్టింది. చాలా కాలానికి గాని తెరిపి ఇయ్యలేదు. విశ్వంగూడా ఏదో తిరుగుతోన్నా, లంఖణాలవాడి మాదిరే లాగుతున్నాడు సంసారపు బండి!... అల్లుడూ, బిడ్డా రెండుమూడు నెలలున్నారు. గాని ఎన్నాళ్ళకూ వీళ్ళ ముజ్జిడ్డు వదలందే!! వెళ్ళరు!....**

ఆ రోజు కనుము!... ఆ రోజల్లా నిన్నటి పండుగని తిట్టటమే పని. ఎన్ని పండగలో చూశాం గానీ...

తెల్లారగట్టే అల్లుడిగారి ఊరు గాంధీపేట ప్రయాణమై వెళ్ళారు. తల్లీదండ్రిన చూసీ చూడ్డంతోనే శశిరేఖ మీదపడి బావురుమని యేడ్చింది.

ఆ ఘట్టమంతా ఒక శోకసాగరం.

కానీ కమలనాభం జీవించటం అంటే పునర్జన్మ ఎత్తినట్టే అయింది.

అల్లుడు బాగా కోలుకొన్నదాకా అక్కడే వున్నారు. నెలరోజుల తర్వాత అల్లుణ్ణి బిడ్డనూ తీసుకవచ్చింద్రు. ఆనాటి సంక్రాంతి ఉపవాసం, అల్లుడి జబ్బు బెంగా, బాధలతో సుందరమ్మ ఇంటికొచ్చి మంచం పట్టింది. చాలా కాలానికి గాని తెరిపి ఇయ్యలేదు. విశ్వంగూడా ఏదో తిరుగుతోన్నా, లంఖణాలవాడి మాదిరే లాగుతున్నాడు సంసారపు బండి!...

అల్లుడూ, బిడ్డా రెండుమూడు నెలలున్నారు. గాని ఎన్నాళ్ళకూ వీళ్ళ ముజ్జిడ్డు వదలందే!! వెళ్ళరు!....

మళ్ళా సంక్రాంతి వస్తుంది. ఇంకా నెల్లాళ్ళకు కళకు నాలుగేళ్ళు వెళ్లుతయ్. పాపాయికి రెండేళ్ళు దాటుతయ్. వళ్ళు చేసి బాగున్నారు. పది పదిహేను రోజుల ముందుగానే శశిరేఖను, కమలనాభాన్ని తీసుకువచ్చారు!...

శశిరేఖ సంక్రాంతి ముగ్గులూ, కళచేత గొబ్బిని పెట్టించటం చేసేది. మగ పిల్లాడ యిన పాపాయి గూడా గొబ్బిని చేసి అక్కతో పాటలు పాడేవాడు! నిరటి నుంచీ అంటుకున్న బాధలన్నీ విరగడైనయ్ ఈ సంక్రాంతికి.

ఒక్కొక్కసారి పండగ మహా దుర్మార్గంగా వస్తుంది. ఒక్కొక్కసారి వచ్చినట్లే అనిపించదు.

వాళ్ళ దృష్టిలో కష్టాలకు నిరుటి సంకురాత్రే సంకురాత్రి. క్రొత్తకు సరిక్రొత్త పండుగ సుఖప్పర్శే ఈ సంకురాత్రి!... *(కథాకళి సంకలనం)*

కవిత

# తడుస్తున్న పోయెమ్

నామాల రవీంద్రసూరి, 9848321079



ఎన్ని సరళ రేఖలు
పరీక్షించి చూసినా
అందులో వాస్తవికత కన్పించలే..
సరళ రేఖ
సక్కగున్నంత మాత్రాన
అదేమంత అందమయ్యిందేం గాదు
అందమంటే
వక్రరేఖలోనే ఉంటది
అసలైన సౌందర్యమంటే
ఏదైనా మెలికలు తిరిగినప్పుడు
ఇంకేదైనా వంకర్లు పోయినప్పుడే చూడాలె..
నది ఎన్ని ఒంపులు తిరిగితే
అంత సుందరంగా ఉంటది
మది ఎన్ని మలుపులు తిరిగితేనో
ఓ పోయెమ్ తడిసి ముద్దయితది
తెగిన జ్ఞాపకాలను ముడివేయాలంటే
ఆలోచనలు ఎన్ని దారులు తిరగాలో..
సంద్రమనేది సప్పుడుజేయక
సమాంతరంగా బండరాయిలా ఉంటే ఎలా?
అపూర్వ భంగిమల్లో
అలలెత్తిన నురగల్ని చూసినప్పుడే
ఆహా..ఏమందమేమందమంటూ
కళ్ళను కడలికి కట్టేస్తాము
ఏ మెలికలు లేకుండా
ఎదచించుకొని ఒక పుల్లగా
నింగికి ఎగబాకిన
మొక్కని చూసేదెవరు?
మొక్క తన దేహాన్ని కత్తిరించేసుకొని
కొమ్మలు అల్లుకొని
కొండకేసి చూస్తున్నప్పుడు
ఆకాశానికి హారతి పల్లెమల్లె ఉండదు
ఏ అలకలు లేని
అలుమగల సంసారంలో
ఆనందమేముంటది
అలసట మాత్రమే ఉంటది
సమాంతరంగా ఉన్న
నేలను చూసినప్పుడు కాదు
నేలపై మొలిచిన
గిరులను చూసినప్పుడే
నిలువెల్లా మనసు పులకిస్తది
కొత్తదనం కావాలనుకుంటే
ఉన్నది ఉన్నట్లు చూస్తే ఎలా?
లేనిది ఉన్నట్లు ఊహిస్తేనే కదా
ఔరా..! అనిపించే
అతి సుందర దృశ్యాలు పుడ్తాయి..

వ్యాసం

# దళిత మహిళా జీవన సజీవ చిత్రాలు

**దళిత మహిళలోని అనేక కోణాలు చిత్రించిన వ్యాసం...**



ఎం. నారాయణ శర్మ
98483 48502

సుమారుగా 1990 దశకానికి ఈవల తెలుగులో దళిత సాహిత్యపు ప్రభావం కనిపిస్తుంది. పదునెక్కిన పాట, చిక్కనవుతున్న పాటలు కవితా సంకలనాలే అయినప్పటికీ అవి ఇచ్చిన ప్రేరణ సాహిత్య చరిత్రలో లెక్కించ దగింది. నిజానికి అంతకు పూర్వం నుంచే ఈ జీవితాల మీద సాహిత్యం ఉన్నా అవన్నీ సంస్కరణవాద దృష్టితోనో, సానుభూతి దృష్టితోనో నిలబడ్డాయే తప్ప అస్తిత్వ దృష్టితో కాదు. ఈ కాలానికి లేదా ఈ కాలానికి ఈవల దళిత సాహిత్యం ఒక నిర్దిష్ట తాత్త్వికతను ఏర్పరచుకుందన్న విషయాన్ని గమనించాలి. ఈ తాత్త్వికత కుల నిరసనలో భాగంగా కుల సంబంధమైన అణచివేతలపై మాట్లాడడం మొదలుపెట్టింది. ఈ మాట్లాడడంలోని సైద్ధాంతిక అవగాహనను అర్థం చేసుకుని సాహిత్యరూపంలో అనుభవంలోకి తెచ్చుకున్న సమూహాలన్నీ 'దళిత' అనే శీర్షిక కింద కలిసాయి. అందువల్ల వైవిధ్యత ఏర్పడింది. నిజానికి ఈ వైవిధ్యత (diversity)లో సైద్ధాంతిక ఛాయలుగా అనేక అంశాలు కలిసాయి. ఈ పరిణామంలో 'దళిత' అనే శీర్షిక కింద ఉన్న అణగారిణ వర్గాలకు చెందిన సాహిత్యవేత్తలు, లేదా ప్రధాన సైద్ధాంతి కతలో ఛాయ భాగాలుగా ఉన్నసాహిత్య సమూహాలు. తమ వ్యష్టి అస్తిత్వాన్ని నిర్వచించుకునే ప్రయత్నం చేశాయి. చేస్తున్నాయి కూడా. కాని వీటి ఉనికిని చారిత్రకంగా వ్యష్టిగా గమనించి ఆయా సాహిత్య మూలాల అస్తిత్వ వేదనలను విమర్శ పరిశోధన గమనించినట్టుగా కనిపించదు. అలాంటి ఉనికి సంబంధమైన సంవేదనల్లో దళిత స్త్రీవాదం లేదా దళిత స్త్రీల అస్తిత్వ గొంతుక కూడా ఒకటి. దళిత స్త్రీవాదాన్ని నిర్వచనాత్మకంగా అర్థం చేసుకోవాలంటే కుల సంబంధమైన అణచివేతను, లింగ సంబంధమైన అణచివేతనూ రెంటినీ ధిక్కరిస్తూ కదిలిందని చెప్పాలి. కుల సంబంధమైన వివక్షను ప్రశ్నిస్తున్నప్పుడు దళిత సిద్ధాంత ధోరణి కనిపించడం వలన, జెండర్ సమస్యలను గురించి మాట్లాడడం వలన స్త్రీ వాదంలోకి ఈ చర్చలు వెళ్లిపోయాయి. కాని జీవితాల పరంగా చూసినప్పుడు దళిత స్త్రీల సంవేదనలు, ఆకాంక్షలు కట్టుబాట్లు వీటన్నిటి వెనుక ఉన్న సామాజికమైన కుటుంబగతమైన నిర్బంధాలూ ఇవన్నీ కనిపిస్తాయి. పాశ్చాత్య విమర్శ స్త్రీవాదంలో ఉద్ధృతులు (waves) ఉన్నాయని భావించింది. తెలుగులో స్త్రీవాదమే లేదు అన్నవారున్నారు. స్త్రీ గొంతుక అన్న పదం దగ్గరే చాల చర్చ జరిగింది.

వివిధ ఉద్యమాల్లోనూ స్త్రీల భాగస్వా మ్యం ఉన్నప్పటికీ అది సాధారణంగానే లెక్కలోకి రావడం లేదు. పూర్తి స్త్రీల సాహిత్యంపైనే సాహిత్య చర్చలో ఖాళీలులేని చర్చ జరగలేదు. ఈ మధ్య కాలంలో ఈ అన్వేషణ కొంత ప్రారంభమైంది. దళిత స్త్రీవాదాన్ని "బ్లాక్ ఫెమినిజం"గా విమర్శలో ఉపయో గిస్తున్నారు కాని. తెలుగులో ఉన్న దళిత స్త్రీ గొంతుకలను ఉద్దేశిస్తున్నప్పుడు ఈ శీర్షికను ఉపయోగించడం కనిపించదు. తెలుగులో స్త్రీవాదానికి దళిత స్త్రీవాదానికి విభజనరేఖ ఎక్కడ ప్రారంభమౌతుంది అన్న విషయానికి వస్తే దానికి సాహిత్య ముఖంగానే సమాధానం దొరుకుతుంది. పాశ్చాత్య విమర్శలోని ధోరణులను బట్టి ఈ విభాగాలను చేసుకునే అవకాశ ముంది. ప్రతీసాహిత్యానికి ఒక వినిమయ వాతావరణం ఉంటుంది. ఈ వాతవరణానికి పరిమితులుంటాయి. ఆ పరిమితుల వలన ఆ వాతావరణంలోకి రావలసిన మరిన్ని ఉప భాగాలుగా ఉ ంటాయి. ఒక్కోసారి వీటి ప్రాతినిధ్యమూ అందులో కనిపించదు. ప్రతీ ఉద్యమాల వాదాల ధోరణుల సమగ్ర లక్ష్యాలను గురించి చర్చిస్తే ఈ విషయాలు బయటికొస్తాయి. ప్రధాన స్రవంతి స్త్రీవాదం లేదా గొంతుకగా ఉన్న సాహిత్యంలో కేవలం జెండర్ సమస్య దాని చుట్టూ వ్యాపించిన సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక విలువలపై ఈ

వ్యాసం

ధిక్కార విలువలు ఆధారపడ్డాయి. ప్రధానంగా తెలుగులో కనిపించే సాహిత్యంలో రాజకీయ, సామాజిక సామ్యాలు తక్కువ. ప్రధాన స్రవంతి స్త్రీవాద సాహిత్యం లైంగిక అణచివేతలు, సాంస్కృతిక అసమానతలపైనే ఎక్కువగా దృష్టిపెట్టింది. దళిత స్త్రీలకు లైంగికమైనవే కాకుండా కుల సంబంధమైన సమస్యలు ఎదురవడం వల్ల దళిత స్త్రీవాదం కనిపిస్తుంది. ఖైర్లాంజీలాంటి ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు ఇలాంటి వాటికి అద్దం పడుతాయి. తెలుగులో గోగు శ్యామల, జూపాక సుభద్ర, మేరీ మాదిగ, గూటాల శాంతకుమారి, సదాలక్ష్మి మొదలైనవారు దళిత స్త్రీల గొంతులకు తెలుగులో ప్రతినిధులుగా నిలబడ్డారు. దళిత స్త్రీలుగా ఉన్నందుకు అనుభవిస్తున్న అణచి వేతలను సాహిత్యంలో ముందుకు తెస్తున్నారు. చర్చిస్తున్నారు. ఆ క్రమంలో వచ్చిన రచన జూపాక సుభద్ర "రాయక్క మాన్యమ్" దళిత స్త్రీవాదం ఎందుకు ప్రధాన స్రవంతి స్త్రీవాదంతో నిజానికి ప్రధాన స్రవంతి స్త్రీవాదం అనడంపట్ల కూడా దళిత రచయిత్రులకు అభ్యంతరాలున్నాయి.- "అగ్రకులాలకు పితృస్వామ్యమే శత్రువు అంటారు. పితృస్వామ్య విముక్తే వారి విముక్తి. కాని దళిత మహిళల విముక్తి చాలా పీడనలతో ముడిపడి ఉంది. కుల హింసలు, శ్రమ దోపిడి, దొర, దొర్సాని ఇంటి మగస్వామ్యాలు, ఆకలి హింసలు యివన్నింటి నుంచి దళిత మహిళ విముక్తి చెందాల్సి ఉంది" (పే.10) అంటారు. అందువల్ల దళిత స్త్రీల సమస్య కేవలం లైంగికమైందో పైతృకమైందో మాత్రమే కాదు. దేశంలోని అన్నిరంగాలకూ ముడిపడి ఉన్నది. ఇందులో పదిహేడు కథల్లోనూ జీవితానికి సంబంధించిన పదిహేడు కోణాలు ఆవిష్కరించారు. అన్ని కథలూ దళితమహిళ కేంద్రంగా సాగుతున్నవే. నిజానికి ఉపరితలంలో కనిపించే నినాదం, కేవలం సైద్ధాంతిక దృష్టి కాకుండా పదిలమైన జీవితాన్ని కేంద్రంగా చేసుకుని ఈ కథలు సాగుతాయి. ఏక కాలంలో జూపాక సుభద్ర కథ మూడు అంశాలకు ప్రతినిధిగా నిలబడుతుంది. వస్తువులుగా దళిత మహిళల సామాజిక రాజకీయ ఆర్థిక సాంఘిక సాంస్కృతిక రంగాలకు సంబంధించిన సమస్యలను చిత్రిస్తుంది.

ప్రామాణిక భాషభావనలు బద్దలుకొట్టి దళిత జీవితాలను వాతావరణాన్ని ప్రతిబింబించే భాషా శిల్పాన్ని అనుసరిస్తుంది. కథ కథనంలో అత్యంత ఆధునికమైన నిర్మాణ భావనలను సంతరించుకుంటుంది.

ఈ సంపుటంలోని మొదటి కథ సామాజికంగా ఉన్న అంటరానితనాన్ని తేటతెల్లం జేస్తుంది. ఇంత అత్యాధునిక కాలంలోనూ ఊళ్లలో ఉన్న అంటరాని తనానికి చిత్రిక కడుతుంది. బడిలో కలిసి ఉండేవాళ్ళు ఇంటికి ఊరికి వచ్చేసరికి ప్రవర్తనల్లో తేడా ఉంటుందని ఈ కథ తేట తెల్లం చేస్తుంది. స్వాతంత్ర్యానికి ఈవల అంటరానితనంపై చట్టాలు వచ్చినా మానసికమైన భావనలు ఇంకా ఎలా ఉన్నాయో ఈ కథ చెబుతుంది. ఏడవ కథ 'శుద్ధి జెయ్యాలె' కూడా అంటరానితనాన్ని గురించి రాసిన కథనే. చదువుకుని విద్యావంతులై ఉద్యోగరీత్యా ఇల్లు దొరక్క చివరకు ఏదో ఒకలా ఒక ఇంట్లో చేరిన అమ్మాయిలకు ఇల్లు గలిగిన కులం వాళ్ళు. సామానులు పంపించి శుద్ధి జేసుకోవాలనుకోవడం ఇతివృత్తంగా ఈ కథ నడుస్తుంది. అంటరానితనం ఏఏ రూపాల్లో పాదుకుని ఉందో చెప్పిన అన్ని కథల్లానే ఈ కథ కూడా ఒక



అంశాన్ని కోణాన్ని వ్యక్తం చేస్తుంది.

రెండవ కథ ఆర్థిక సంబంధమైందిగా కనిపిస్తుంది కాని ఇందులో ఒకింత రాజకీయ చేతన, అన్నిటికీ మించి ఆత్మగౌరవం కలబోసుకున్న కథ. "షానిల బడాలె" - అన్న శీర్షిక నుంచే పూర్వపు సంప్రదాయాలను గౌరవిస్తూనే నాగరికంగా ఎవరికీ తక్కువగామన్న స్థాయికి చేరాలన్న ఉద్బోధ ఈ కథ చెప్తుంది. స్వాతంత్ర్యానికి ఈవల రాజకీయంగా మహిళలు అందులో అణగారిన వర్గాలవారు ఎదగాలన్న ఆలోచనతో వచ్చిన రిజర్వేషన్లు అధికారాన్నిస్తున్నాయి కాని. సంఘంలో సమానంగా నిలబడేం దుకు ఇంకా దళిత స్త్రీలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వాళ్లకు అంత చొరవ రావడం లేదు. గ్రామాల్లో ఇప్పటికీ ఉన్న కుల భావనలే దీనికి కారణం. సాంబలక్ష్మి మండల ప్రెసిడెంటు అయిన తరువాత పరిణామాలను చిత్రించడం ద్వారా సాంబలక్ష్మి లాంటి వాళ్లందరికి ఇలాంటి నామోషీ భావనలు పోవాలన్న సందేశాన్నిస్తుంది ఈ కథ. ఆర్థికం రాజకీయంతో ముడిపడినప్పటికీ ఈ కథ ఆత్మగౌరవానికి సంబంధించినదిగా కనిపిస్తుంది. "మా మాట గిట్లనే"-అనే కథ కూడా భాష విషయంలో ఎద్దేవా చేస్తూ అవమానించడం కనిపిస్తుంది. ఇతివృత్తం దళిత జీవితమే అయినప్పటికీ వస్తువు మాత్రం భాష. ఈ కథలో ఇతివృత్తం స్త్రీల చుట్టు అల్లుకున్నది కాకపోయినా భాషా సంబంధంగా అనేక ప్రతిపాదనలు, విశ్లేషణలు చేస్తుంది. కులం గూడెంలోని ఆడవాళ్ల జీవితాలను ఎలా అణచివేస్తుందో వివాహం ఆదర్శవంతమైన జీవితం అనే పేరుతో ఎలా మోసానికి గురౌతున్నారో చెప్పే కథ - ఆదర్శ విధ్వంసం. రోట్లె బడ్డ తలకాయ కథ ఆర్థిక సంబంధమైన మూలాలదే. సామాజికంగా రాజ్యాంగ ఫలాల వల్ల విద్యను పొందుతున్న దళిత పిల్లల విద్య తలిదండ్రుల ఆర్థిక స్థితి వల్ల వెట్టిచాకిరికి ఎలా గురౌతుందన్న విషయాన్ని చిత్రిక కట్టింది. బిడ్డను చదివించాలని బలంగా ఉన్నప్పటికీ బక్కన్న సార్వ కమలను పటేల్ మనుమరాలిని ఎత్తుకోడానికి పంపించాల్సి వచ్చిన కథ. మొండి వైదిగం-వైద్య వ్యవస్థ ప్రభుత్వ వైద్యులు మరో కార్పోరేటు కేసును తరలించారని ప్రయత్నం అక్కడ వైద్యం డబ్బుల కోసం ఆగడం ప్రభుత్వ నిశ్చేష్ట ఇవన్నీ కలగలసిన కథ. నిజానికి సాధారణంగా ఉండే వైద్యం తాలూకు సమస్యగా అనిపించినా, డబ్బు కోసం ఆలస్యం చేసి కాలు కొట్టేసిన హాస్పిటల్ నిర్వాకం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అణగారిన వర్గాల కోసం ప్రభుత్వాలు నిర్మించిన వైద్యశాలలు చేతలుడిగిపోవడం కూడా ఇందులో వ్యక్తమౌతుంది. 'పాయిదేర్ల తనం' కథ - ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల్లో కింది స్థాయి ఉద్యోగి భార్యకు ప్రభుత్వం నుంచి జరుగుతున్న అన్యాయాన్ని. ఇతర వర్గాల వాళ్లకు త్వరగా జరుగుతుండడంలోని అధికారుల అంటరానితనాన్ని ఈ కథ వ్యక్తం చెరస్తుంది. నక్సలైట్లు పోలీసు ఆఫీసరు కోసం ఏర్పాటు చేసిన బాంబు దాడిలో మరణించిన డ్రైవర్ భార్య కరుణ ప్రభుత్వ సహాయం కోసం పడ్డ తిప్పలు ఈ కథ. ఆఫీసర్ భార్యకు ఉద్యోగం, సెక్యూరిటీ, అన్నీ ఏర్పాటు జేసి కరుణకు ఏమీ ఇవ్వకపోవడం అలసత్వం చూపించడం ఇందులోని ఇతివృత్తం. 'నల్లజెండా' కథ సాయుధ పోరాటంలోనూ దళితుల అణచివేతకు సంబంధించిన సమస్యలను వ్యక్తం చేస్తుంది. 'రాయక్క మాన్యం' కథ ప్రధానంగా ఆయాకులాల్లో ఉండే సాంస్కృతిక ఉజ్జీవనాన్ని కట్టుబాట్లను వ్యక్తం చేస్తుంది. ఒక మగవాడిలా జీవితాన్ని తీర్చిదిద్దుకుని వారసత్వంగా వచ్చిన పెద్దరికాన్ని మోసిన రాయక్క కథ ఇది. దళిత స్త్రీల నిర్వహణా సామర్థ్యాన్ని న్యాయ నిర్ణయాలను, ఆలోచనను ఈ కథ వ్యక్తం చేస్తుంది. దళిత కుటుంబాలలో ఉండే సాంస్కృతిక కట్టుబాట్లను వ్యక్తం చేస్తుంది.

> **శీతకన్నులు బూముల్ని పంటల్ని మింగితే పొట్టసేత బట్టుకొని ఉప్పరి పనికి, రోడ్ల పనికి, మట్టి పనికి పట్నాలకు బోయే బిడ్డెల కొడుకుల గోస జూడలేక కుందాపనబడి, కన్నుమూసిన ఊరి పెద్ద మాదిగ" గా తండ్రి జీవితాన్ని కూతురి పాత్ర చెబుతుంది.**

'దేవిపోతల కారటి'-అనే కథ మానవ సంబంధాలకు సంబంధించిన కథ. తన అక్క కారటిని చూసి కథలోని పాత్ర బాధపడి ఆమె వైపుకు వెళ్లడం ఇందులోని సారాంశం. ఈ దేవిపోతల్లో మానవ సంబంధాల్లో ముఖ్యంగా అణగారిన వర్గాల జీవితంలోని సాంస్కృతికాభివ్యక్తి కనిపిస్తుంది. మా అయ్య అనే కథ కూడా కుటుంబ సంబంధాలకు సంబంధించిందే. ఒక తండ్రి తన జీవితంలో పడ్డ కష్టాలను, అవమానాలను విని బాధపడ్డ కూతురి కథ. కాని పరోక్షంగా దళిత జీవితాల్లోని ఆర్థిక సంబంధమైన లేమి ఒకటి ఇందులో కనిపిస్తుంది. దళిత జీవితాల్లోంచి శిరసెత్తి నిలుచున్న ఒక తండ్రి కథ ఇందులో కనిపిస్తుంది. - "బాంచి కులంల అంటరాని జాతిల బుట్టి ఆకలికంగలార్చి, జీతముండి, బూమితోని సకుల పోరాడి బూసామై... మారిన కాలాలు. శీతకన్నులు బూముల్ని పంటల్ని మింగితే పొట్టసేతబట్టుకొని ఉప్పరి పనికి, రోడ్ల పనికి, మట్టి పనికి పట్నాలకు బోయే బిడ్డెల కొడుకుల గోస జూడలేక కుందాపనబడి, కన్నుమూసిన ఊరి పెద్ద మాదిగ" గా తండ్రి జీవితాన్ని కూతురి పాత్ర చెబుతుంది. నాలుగవ కథ విద్య అది దక్కుతున్న చోట దళిత విద్యార్థి నులకు జరుగుతున్న అవమానాలు ఇందులోని ఇతివృత్తం. దళిత విద్యార్థుల అభ్యున్నతికి చదువు ఆవసరమని దానికోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన హాస్టళ్లల్లో ఎలాంటి ఇబ్బందు లెదుర్కుంటున్నారో, అవమానాలు పడుతున్నారో, హాస్టల్ వార్డెన్ల స్వభావాలెలా ఉంటాయో ఈ కథలో

వ్యాసం

చిత్రిక కడతారు జూపాక. బహుశః కథా ప్రపంచంలో ఈ వాతావరణంలోంచి వచ్చిన కథలు అరుదుగా కనిపిస్తాయి. ఆరవ కథ 'గద్దెత్కపోయిన బతుకమ్మ' సాంస్కృతికతను, చారిత్రకతను సమ్మిళితం చేసుకున్న కథ." బతుకమ్మ ఆడగూడదన్న ఊరి తీర్మానాన్ని పునర్మూల్యాంకనం చేసిన" కథ. ఎనిమిదవ కథ కూడా విద్యా సంబంధమైనదే. "పెన్ను" చుట్టూ తిరిగిన ఈ కథ అంటరాని తనాన్ని, పెన్నిచ్చిన అమ్మాయి స్వార్థపరత్వాన్ని వ్యక్తం చేస్తుంది. బోళ్లు ముట్టుకుంటే మా అమ్మ మల్లా కడుగుమంటది - అన్న స్నేహితురాలి మాట ఊరిలో స్పష్టంగా ఉన్న అంటరానితనానికి అద్దంపడుతుంది. పదవ కథ 'మీరెట్ల వెజ్జులు' "ఆహారం" అనే వస్తువు ద్వారా దళిత ఇతివృత్తం చుట్టూ తిరిగిన కథ. "పాలుపెరుగు కూడా నాన్ వెజ్ అనేకదా" అన్న వాదనతో ముడిపడి ఉంటుంది ఈ కథ. కాని వ్యక్తమౌతున్న విషయం కులం పేరుతోకాక పాలిష్డ్‌గా నాన్ వెజ్ పేరుతో తమ ఆహారాన్ని తినకుండా అవమాని స్తున్నారన్న ఆవేదనను వ్యక్తం చేస్తుంది.

కథలో ఇతివృత్తంగా అన్ని కథల్లోనూ దళిత జీవితమే కనిపిస్తుంది. అయినా అంశగతంగా వైవిధ్యమైన వస్తువులు ఈ కథల్లో కనిపిస్తాయి. అర్థిక దృష్టితో, విద్య, భాష, సంస్కృతి, రాజకీయం వీటన్నింటిలో వ్యక్తమౌతున్న అణచివేతను కులవ్యవస్థను ఈ కథలు వ్యక్తం చేస్తాయి. దళిత మహిళ చుట్టూ అల్లుకున్న భిన్న వాతావరణాలను ఈ కథలు చిత్రిక కట్టాయి. విద్య, వైద్యం, ఉపాధి అనే రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతున్న క్రమంలో దళిత స్త్రీలు పరోక్షంగా ప్రత్యక్షంగా ఎదుర్కుంటున్న నాగరికమైన అంటరానితనాన్ని ఈ కథలు తేటతెల్లం చేస్తాయి. సర్పంచి అయినా బతకమ్మ ఆడలేని దేవక్క, ప్రెసిడెంటు అయినా ధైర్యంగా నిలబడలేని సాంబలక్ష్మి, స్నేహితురాలి తల్లి మాటల్లో అణచివేతను అర్థం చేసుకున్న శ్రీలత. బాలసముద్రం హాస్టల్లో వార్డెన్ పైశాచికత్వానికి బలైన విద్యార్థిని, పెన్ను కోసం యాదమ్మకు లొంగిపోయిన అమ్మాయి, రాయక్క, అహారం విషయంలో సీతాలక్ష్మి లాంటి కొలీగ్స్ నుంచి బాధననుభవించిన ఉద్యోగిని, ఆధిపత్య కులాల ప్రేమలకు బలైన జ్యోతిరాణి, చదువు దూరమైన కమల, ప్రభుత్వ సహాయం పొందని కరుణ, శాంతక్క ఇలా దళిత మహిళల కథలే ఈ కథలు.

కథాశిల్పం వస్తువును కథాంశాలుగా విభజించుకోవడంతోనే ప్రారంభమ వుతుంది. కథా నిర్వహణలో వివిధ సంకేతాల (Codes)ను ఉపయోగించడం వలన సమగ్రం అవుతుంది. ఇవి లక్ష్యాన్ని, కేంద్రాన్ని చెబుతున్న విషయంలోని ప్రధానాంశాన్ని, ఉపాంశాలను ఆధారం చేసుకుని ఉంటాయి. శిల్పంలో మరో అంశం పాత్రల చిత్రీకరణ. లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కథకు పాత్రలను చిత్రీకరిస్తారు. ఈ లక్ష్యాన్ని బట్టే పాత్రల స్వభావం రూపొందుతుంది. ఈ పాత్రల సంభాషణ, రచయిత్రి లేదా అఖ్యాత కథనం వీటి ద్వారానే సంవేదనను చెప్పడం, సమస్యని చిత్రించడం కనిపిస్తుంది. వాక్యంలోని సారం. వాక్యాన్ని చెప్పే పద్ధతి పాత్రల స్వభావానికి మూలాలు. ఇదికాక కథాక్రమం ఒకటి కథను అర్థవంతంగా తీర్చిదిద్దుతుంది. రకరకాల సంకేతాల వలన కథలోని విషయం సమగ్రమయితే కథాక్రమం వలన కథ అర్థవంతమూ, కళాత్మకమూ అవుతుంది. ఇలా కథా శిల్పాన్ని అర్థం చేసుకోవచ్చు. జూపాక సుభద్రలో ఈ సంకేతాల నిర్మాణం. వస్తు విభజన, పాత్రల చిత్రీకరణ, కథాక్రమం ఇవన్నీ ఆమెదైన రీతిలో కనిపిస్తాయి.

'రాయక్కమాన్యం' కథలన్నింటిలో దళిత మహిళలే జీవితాలు ప్రధానం. దీనిని అనుసరించే ఈ కథల్లో కేంద్రభావన ఉంటుంది. దీనిని ఆత్మాశ్రయ సంకేతం (subjective code) అంటారు. ఇది సాంస్కృతిక

> **'రాయక్కమాన్యం' కథలో సాంస్కృతిక సంకేతం ఎక్కువగా కథా నిర్వహణలో భాగమయింది. దళిత స్త్రీ శక్తియుక్తులను చెప్పే లక్ష్యంతో రాసిన ఈ కథలోనూ నిర్దిష్ట సైద్ధాంతికత ప్రవహిస్తుంది. కాని కథావరణం దళిత సంస్కృతిని చెప్పడం. ఇతి వృత్తం దళిత స్త్రీ శక్తి యుక్తులను చెప్పడం. సాంస్కృతికాంశాన్ని వ్యక్తం చేసే వాక్యాలు కథలో ప్రత్యక్షంగా ఉంటాయి." డక్కలోల్లు వూర్లు తిర్గుతరుగని ఏ వూరు బడితే ఆవూరు తిరుగరు.**

సంకేతాన్ని (Cultural code) ఆనుకుని ఉంటుంది. జీవితం సంస్కృతి అనే అంశానికి ఆనుకుని ఉంటుంది కాబట్టి ఈ అంశం కేంద్ర భావన. సాధారణంగా అస్తిత్వ సాహిత్యాన్ని రెండు భావనలు ప్రధానంగా నడిపిస్తాయి. ఒకటి పైన చెప్పుకున్న సాంస్కృతిక సంకేతం. రెండవది సైద్ధాంతిక సంకేతం (theretical code) అస్తిత్వ సాహిత్యం తనకంటూ ఒక తాత్త్విక భూమికను ఏర్పరచుకుని సాగుతుంది. జూపాక సుభద్రలోనూ ఈ తాత్త్వికత ఉంది. సాధారణ స్త్రీవాదంలా కేవలం జెండర్ సమస్య కాకుండా దళిత మహిళ జీవితం చుట్టూ పరచుకున్న అనేక కోణాలను ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. దళిత మహిళలు ఎదుర్కొంటున్న అణచివేత, దళిత మహిళల శక్తియుక్తులు మానవీయ సంబంధాలు ఇవన్నీ చిత్రించారు. ఒక సూత్రంలా సైద్ధాంతిక, సాంస్కృతిక సూత్రాలు కథలో కదులుతున్నప్పటికీ కొన్ని అపాంశాలు కథలో ఉంటాయి. బహుసః అన్ని సాహిత్య రూపాలు ప్రక్రియల్లో కూడా. ఇందులోనూ సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ భూమికలున్నాయి. సంకేతం (code) అనేదే కొన్ని ఉపాంశాల (sub-codes)

సమూహం అని అర్థం చేసుకోవాలి. కథలో ఉండే కథావరణ సంకేతం కథను (storyline sign) ఏ ప్రదేశాన్ని ఆధారం చేసుకుని నిర్మిస్తున్నారో చెబుతుంది. కథలోని ఇతివృత్తం సంకేతం (Thematical code) ఏ అంశాన్ని ఆధారం చేసుకుని నిర్మిస్తున్నారో చెబుతుంది. ఒక్కో కథను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

"బల్లెనే దోస్తు వూల్లెగాదు"- కథలో కథావరణం ఒక పాఠశాలకు సంబంధించిన భాగం. కాని ఇతి వృత్తభాగంలో కులం వాటి మధ్యలో ఉన్న ఆర్థికాంశాలు ప్రధానాలు. ఇది ఇతివృత్త సంకేతానికి సంబంధించినది. కేంద్రం దళిత స్త్రీలే. ఇది ఆత్మాశ్రయ సంకేతం. ఈ కథ లక్ష్యం గ్రామాల్లో నిలిచి ఉన్న అంటరానితనాన్ని చెప్పడం. ఇది సైద్ధాంతిక సంకేతానికి సంబంధించినది. ఇలా కథలోని అంశాలను అర్థం చేసుకోవచ్చు. బల్లెనే దోస్తు వూల్లె గాదు - కథలో కథ ఇద్దరు స్నేహితుల ఆర్థిక జీవితాన్ని ఆనుకుని నిర్మించారు. దానిని వ్యక్తం చేసే వాక్యాలను కథలో గమనించవచ్చు."మా అమ్మ పత్తులేరినంక కుట్టిత్తనన్నది. గప్పటిదాక గీ పాతయే యేస్కోవాలె"- (పే.12) - "శ్రీలత వాళ్లకు అరెకురం సెల్క ఉన్నది. దాంట్లె పండే గింజలు అనతంత మాత్రమే. తల్లిదండ్రి ఇద్దరు కూలినాలి జేత్తరు-(పే.13) - ఇలాంటి వాక్యాలు ఆర్థిక సంబంధమైన కుటుంబవాతావరణాన్ని చెబుతాయి. కథలో ఇతివృత్త సంబంధమైన సంకేతం రెండు కులాల మధ్య తారతమ్యం చెప్పడం. సంపూర్తిగా కథల్లోని సైద్ధాంతికాంశం కూడా ఇదే. ఇది వ్యక్తమైన వాక్యాలు కూడా కనిపిస్తయి. - "నీకేం బుట్టిందే.... పిల్లకిచ్చి మల్లదెచ్చుడేందే, తెచ్చి పుస్తకాలల్లవెట్టుడేందే" - (పే.15) దోస్తు గీస్తు అంత బల్లెనే గీ మన వూల్లెగాదు కొత్తబట్టలు పాడుజేత్తివిగదనే గీ బట్టలకగ్గివెట్టా - (పే.15) జూపాక కథను తీర్చిదిద్దడంలో ఒక శిల్ప విధానాన్ని పాటిస్తారు. సంవేదనను చెప్పడానికి సంభాషణాత్మక రీతి (Conversational mode)ని, సమస్యను, శక్తిని, వ్యక్తి గొప్పదనాన్ని, కుటుంబ స్థితిగతులను చెప్పడానికి కథనాత్మకరీతి (Narrative mode)ని అనుసరిస్తారు. ఈ పద్ధతి చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ కథలో శ్రీలత మనసులో ఆలోచించిన ఆలోచనలన్నింటినీ ఈ సంభాషణాత్మకంగానే చిత్రించారు. స్వర్ణతో మాట్లాడిన మాటలను కూడా ఇలాంటివే.

'రాయక్క మాన్యం' కథలో సాంస్కృతిక సంకేతం ఎక్కువగా కథా నిర్వహణలో భాగమయింది.దళిత స్త్రీ శక్తియుక్తులను చెప్పే లక్ష్యంతో రాసిన ఈ కథలోనూ నిర్దిష్ట సైద్ధాంతికత ప్రవహిస్తుంది. కాని కథావరణం దళిత సంస్కృతిని చెప్పడం. ఇతి వృత్తం దళిత స్త్రీ శక్తి యుక్తులను చెప్పడం. సాంస్కృతికాంశాన్ని వ్యక్తం చేసే వాక్యాలు కథలో ప్రత్యక్షంగా ఉంటాయి." డక్కలోల్లు వూర్ల తిర్గుతరుగని ఏ వూరు బడితే ఆవూరు తిరుగరు. "యిస్స" మీదచ్చిన వూర్లల్లనే తిరుగుతరు. యిచ్చే మాన్యం గింజలు కొలుసుకొని, రోజు వారి తిండి అడుక్కొని పంటమేసి "జాంబ పురాణం" జెప్పి పైసల్దీసుకోవాలె. వాళ్లకు భూములు జాగలు ఉండద్దు. వ్యవసాయం జేయద్దు. - (పే.65) ఉలకట్టులో కులం బాధ్యతలు పెట్టేకాడ, పోసే కాడ ఏం తేడాలొచ్చినా రాజక్కే తెంపాలేది కుల కట్టడి - (పే.66) పొద్దునే సందెకాడ బువ్వ అడుక్కచ్చుకొని పగటీలి రైతుల కల్లాలకాడికి బోయి కల్లానికో వరికట్ట. రెండు కుంచాల మాన్యెం వడ్లు వసూలు జేసుకుంటది. మాన్యెం అంటే కింది కులాలైన చిందుడక్కలి ఉమ్మడి భూమి. దాన్ని దున్ని పండించి డక్కలి చిందోళ్లకు కొంత ధాన్యం ఇవ్వాలి" - (పే.68)- ఇలాంటివి దళిత సంస్కృతిలోని విషయాలను సమగ్రం చేస్తాయి. ఇలాంటి అంశాలను ఇంకా చాలా కథల నుంచి ఎత్తి రాయొచ్చు. శిల్పంలో కేంద్రగతమైన సంకేతాలు, లక్ష్యగతమైన సంకేతాలు రెండు తప్పని సరిగా ఉంటాయి. చెప్పే విలువను బట్టి ఆర్థిక సాంస్కృతిక రాజకీయమైన సంకేతాలు భాగమౌతాయి. 'రాయక్క మాన్యం' సంస్కృతిని ఆధారం చేసుకుని స్త్రీశక్తిని పరిచయం చేసిన కథ.

ఒకవైపు సాంస్కృతికాభివ్యక్తి, మరో వైపు ఆర్థిక సంకేతాన్ని జమిలీగా నింపుకున్న కథ "దేవిపోతల కారటు" ఇందులో ప్రపంచీకరణ వల్ల మారుతున్న ఆర్థిక జీవితాలను సంకేతించే వాక్యాలతో పాటు సాంస్కృతిక వైచిత్రిని వ్యక్తంచేసే వాక్యాలు కూడా కనిపిస్తాయి.-"సిన్నప్పుడు సమ్మక్క పొద్దుపొలుపులుండె - ఎన్నెల పాటలు, బతుకమ్మ పాటలు, కోలాటం పాటలు, కాముని పాటలు, పెండ్లి పాటలు పాడితే సంబురపడి యినెటోల్లం. పోషమ్మ కథలు, ఎల్లమ్మ కథలు, బీరన్న కథలు మల్లన్న కథలు పాండువలోల్ల కథలు జాంబవంతుని కథలు ఇప్పటికీ మర్సిపోలేదు"- "ఆమె సిన్నగున్నప్పుడు వూల్లెకి పొద్దులోల్లు, సార్తకాల్లు, మందుచ్చోల్లు, పిచ్చకుంట్లోల్లు, ఒగ్గోల్లు, డక్కలోల్లు ఎవలచ్చినా పని పాతరబెట్టి కతలినేతానికి బోతే యింటికచ్చినంక అయ్యతోని, అన్నల్తోని యాబ్బల్ల దెబ్బల్దినేది" - (పే.22) ఇందులోనూ సాంస్కృతికాంశం కనిపిస్తుంది. కాని పైన

**మాన్యెం** **అంటే కింది కులాలైన చిందుడక్కలి ఉమ్మడి భూమి. దాన్ని దున్ని పండించి డక్కలి చిందోళ్లకు కొంత ధాన్యం ఇవ్వాలి" - (పే.68)- ఇలాంటివి దళిత సంస్కృతిలోని విషయాలను సమగ్రం చేస్తాయి. ఇలాంటి అంశాలను ఇంకా చాలా కథల నుంచి ఎత్తి రాయొచ్చు. శిల్పంలో కేంద్రగతమైన సంకేతాలు, లక్ష్యగతమైన సంకేతాలు రెండు తప్పని సరిగా ఉంటాయి. చెప్పే విలువను బట్టి ఆర్థిక సాంస్కృతిక రాజకీయమైన సంకేతాలు భాగమౌతాయి.**

వ్యాసం

'రాయక్క మాన్యం'లో కనిపించే సాంస్కృతికాంశానికి ఇది భిన్నమైంది. ఒక సంకేతం(చౌదె)లో కొన్ని ఉప సంకేతాలు (సబ్-చౌదెలు) ఉంటాయి. ప్రతి సంకేతం కొన్ని ఉపసంకేతాల సమాహారం. ఆ మార్గంలో సాంస్కృతికాంశంలో జీవన సంకేతం, కళా సంకేతం అనే భాగాలుంతాయి. 'రాయక్కమాన్యం'లోని సాంస్కృతికాంశం జీవనానికి సంబంధించిన విషయాన్ని వ్యక్తం చేస్తే, 'దేవిపోతల కారటు'లోని సాంస్కృతికత కళాసంబంధాన్ని వ్యక్తం చేస్తుంది.

ఆర్థికాంశాన్ని వ్యక్తం చేసే వాక్యాలు కూడా కొన్ని చోట్ల కనిపిస్తాయి. ఇందులోనూ సమకాలీన ఆర్థికభావన, సాంస్కృతిక ఆర్థిక భావన అనేవి భాగాలు. 'రాయక్క మాన్యం'లో రాయక్క లాంటివాళ్ళ ఆర్థిక స్థితికి సంబంధించిన చర్చ సాంస్కృతిక భావనకు సంబంధించింది. దేవిపోతల కారటులో, 'షానిల బడాలె'లో ఈ చర్చ సమకాలీన ఆర్థిక స్థితికి సంబంధించింది. - "యిగ తవ్వేడు పెసాల్లు యేంచి, యిసిరి పవుజేత్తె మజా మాడిపోయి కంచుడెగిరి పోయినట్లుండేది. గిప్పుడా రుసే కరువైంది. - "పెసరి గుడాలల్ల బెల్లమేసి దంచి పెసరి ముద్దలు పల్లీలల్ల నువ్వులల్ల బెల్లమేసి దంచి పల్లీల ముద్దలు, నువ్వుల ముద్దలుజేసి బతుకమ్మల కాడ పలారం పంచి పెట్టనీకి తీస్కబోయేది. గిప్పుడవన్నీ కన్ను బొడుసుకున్నా కండ్లబడ్తలేవు - (పే.23) గింత పెంటబోసి మోటగొడితే... ఓ.. సోలిపోయే పంటలు. యిప్పుడేందో సిత్రం! ఒక్కారేసిన యిత్తునం మల్ల మొల్వదాట, పంత పంటలకు కొత్తిత్తునం కావాల్నట (పే.24) - ఇలాంటివన్నీ ఆర్థిక సంబంధమైన అంశాలను వ్యక్తం చేస్తుంది. ప్రపంచీకరణ వల్ల పరిస్థితిని మొదటి వాక్యాలు ప్రతిబింబిస్తే, పర్యవసానాన్ని రెండవ వాక్యం ప్రతిబింబిస్తుంది. ఇలా జూపాక కథలన్నీ కథల్లో వివిధాంశాలను సమ్మిళితం చేయడం ద్వారా సారంలో జీవితాన్ని సమగ్రంగా చిత్రించే ప్రయత్నం చేస్తారు. ఒక్కో కథను పరిశీలించి కథావరణం, ఇతివృత్తం, సంబంధ సంకేతాలు, కేంద్ర లక్ష్యాలను అనుశీలన చేస్తే ఈ విషయాలు అర్థమవుతాయి.

శిల్పంలో ప్రధాన భాగం కథానిర్మాణ క్రమం కళాభాగానికి సంబంధించిన అంశం పైన చర్చించిన అంశాలన్నీ సారం విషయంలో కథను సమగ్రం చేయడానికి ఉపకరణాలు. కాని కథను కళగా తీర్చిదిద్దేందుకు కథా రచయిత రచయిత్రి ఒక క్రమాన్ని అనుసరిస్తారు. ఇవి కథా నిర్మాణ క్రమానికి సంబంధించినవి. వీటిని వర్ణనా సంకేతం (Descriptive code) కథనాత్మకత (narration) పాత్రల చిత్రీకరణ (Characterization) భాషా సంవిధానం (Linguistic mode). కథావరణానికి ప్రవేశద్వారం లాంటిది వర్ణనాత్మకమైన సంకేతం. కథావాతావరణంలోనికి తీసుకెళ్లేది ఇదే. ఇది ప్రారంభ సూచిక కాదు. కథను సంభాషణతో ప్రారంభినంచవచ్చు. వర్ణన ద్వారా ప్రారంభించవచ్చు. కాని కథావాతావరనంలోకి తీసుకువెళ్లడం ఏ భాగం చేస్తుందో అది వర్ణనాభాగం. - "మా హాస్టలు బిల్డింగ్ మొతం వరంగల్ టౌన్లోనే బాలికలకు ప్రభుత్వం గట్టించిన ఒకేఒక్క పక్కా బిల్డింగు. మిగతా సోషల్ వెల్ఫేర్ హాస్టల్లన్నీ కిరాయకు తీస్కుని నడిపిచ్చేవే. ఓ నాలుగైదు రూములున్న గూనపెంకు టిల్లుగాని, దాబాగాని కిరాయకి తీసుకోవడం, దాంట్ల నూటికి నూటిరువై మందిని కొట్టంల ఎడ్లను దోలినట్లు దోలడం, హాస్టల్ రన్ చేయడం యిదీ సోషల్ వెల్ఫేర్ పాత్ర"-(పే.27) జ్యోతి గుండెలు చిల్లులు జేసి పరారైన ఆ తోడేలు మీదికి దాడికిపోవాలన్నంత కోపమొచ్చింది. చీకటి వెలుగులు సహజమనే సూత్రాలు వెసులుబాటున్న వాళ్లకే వర్తించే కూర్పులు ఓదార్పులేమో, కాని జ్యోతి లాంటి వూరావలి ఆడపిల్లలకు వెసులుబాటులన్నీ ఇనుప గోడలై అంతా చీకటే. వెలుతురు రాని వెన్నెల రేఖలు చేరని గబ్బిలాలే"-(పే.84) దూరంగా గోదావరి తెల్లగా నవ్వుతోంది. అడవి ఆహ్లాదంగా గంభీరంగా ఊరంతా చుట్టుముట్టినట్లుంది. కొంత ఎర్రనేల. కొంత నల్లనేల ఎంత ముద్దొస్తుందో. ఊరంతా పచ్చగా నల్లగా ఎర్రగా కలగాపులగంగా ఉంది-(పే.52)- ఇలాంటి వర్ణనాత్మకమైన వాక్యాలు అన్ని కథల్లోనూ కనిపిస్తాయి. కథలోపలికి ఆ వాతావరణానికి ఇవి పాఠకుణ్ణి ఆహ్వానిస్తాయి. కథనంలో కూడా కొన్ని భాగాలను గమనించవచ్చు. వీటిలో పాత్ర స్వభావాన్ని చెప్పడం, పరిసరాలను చెప్పడం. ఆర్థిక రాజకీయ సామాజికాంసాలను చెప్పడం లాంటి భాగాలను గమనించవచ్చు. ఇందులోనూ విషయాత్మక కథనం. కళాత్మక కథనం అని విభజించుకుంటే. కథా విషయాన్ని అనుకుని చెప్పేది విషయాత్మకం. కొంత ఆలంకారికంగా చెప్పేది కళాత్మకం." బస్సులు ఎర్రమట్టి దిబ్బలల్లో పొర్లాడే జెర్రిపోతుల్లా వస్తూ పోతున్నవి-(పే.52) లాంటివి కళాత్మకంగా కనిపిస్తాయి. కథను చెప్పేందుకు ఉపయోగించే అన్ని మార్గాలు ఈ కథనాత్మకత లోనికే వస్తాయి. పాత్రల చిత్రీకరణ కూడా కథానిర్మాణంలో భాగమే. పూర్వంలో నాయికా లక్షణాలు, నాయక లక్షణాలు ఉండేవి. అలాంటివే ఇవి. కాకపోతే కథాగతంగా చెప్పలనుకున్న సైద్ధాంతిక ధర్మాన్ని, సాంస్కృతిక భావనను ఇవి మోస్తాయి. 'రాయక్క మాన్యం'లో రాయక్కను చిత్రించిన తీరు. మా అయ్యలో ఒక దళితకుటుంబంలోని తండ్రిని చిత్రించిన తీరు. నల్లజెండాలో శాంతను చిత్రించిన తీరు ఇవన్నీ పాత్రల చిత్రీకరణలో జూపాకకుండే నేర్పరితనాన్ని చెబుతాయి. వీటన్నింటినీ కథనాత్మకంగా చెబుతారు. కొన్ని పాత్రల స్వభావాలను సంభాషణల ద్వారా చెబుతారు. ప్రతిపాత్రల నిర్మాణాన్ని గమనించినా పాత్రల చిత్రీకరణలోని మెళకువలు అర్థమవుతాయి. హాస్టల్ వార్డెన్ లాంటి పాత్రలను వాటి స్వభావాన్ని అర్థం చేసుకున్నా ఈ శిల్పభావన అర్థమవుతుంది.

'రాయక్క మాన్యం' కథల్లో ప్రధానంగా

కనిపించేది భాషా సంవిధానం. నిజానికి పైన చెపిన కథా నిర్మాణ క్రమంలోని అంశాలన్నీ ఉన్నప్పటికీ అవన్నీ అంతర్లీనంగా ఉంటాయి. అన్ని కథల్లో కాకపోయినా ఎక్కువ కథల్లో జూపాక అనుసరించిన భాషా సంవిధానం ప్రత్యేకమైంది. బహుశః తెలంగాణా ఉద్యమానికి దగ్గరలో ప్రజావ్యవహారంలోని భాషను సాహిత్యంలో ఉపయోగించడం కనిపిస్తుంది. దానికి మరింత దగ్గరలో దళిత బహుజన ఉద్యమాల్లో భాగంగా అటడుగువర్గాల భాషా వ్యవహారాన్ని భాషా సంవిధానంగా రూపొందించడం కనిపిస్తుంది. ఈ విధానాలను అర్థం చేసుకోవడానికి “అణచివేత దారు నుంచి అణచివేయబడిన వారి దాకాబీ భాష మరియు అధికార రాజకీయాలు (The Power and Politics of Language, from Oppressor to Oppressed-Adelia Saunders) వ్యాసం లేదా అర్నాల్డ్ కింగ్ రచన “మూడు రాజకీయ భాషలు” (The three languages of politics) మొదలైన పుస్తకాలను ఆదర్శంగా తీసుకుని విశ్లేషించుకుంటే మరింతగా అర్థమవుతుంది. తెలుగు లోనూ పత్రికలు మాధ్యమంగా ఒక పుస్తకభాష లేదా రచనా భాష తయారైంది. ఈ భాష పట్ల రచయితలందరూ తెలంగాణా నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. విప్లవవాదులు, సంప్రదాయవాదులు, స్వేచ్ఛావాదులు ముగ్గురూ ఈ భాషను సమర్థించారు. లేదా కనీసంగా ఒక రాజకీయమౌనాన్ని అనుసరించారు. ఇది భాషకు పరిమితులు గీస్తుందన్న విషయం ఈ క్రమంలో మరుగునపడింది. అందువల్ల నిసర్గ సౌందర్యం గల భాష సాహిత్యంలోని భాషా సంవిధానానికి దూరమైంది. దీనికి ప్రతిగా నిసర్గ సౌందర్యంగల, మూలభాషను కథల్లో భాషా సంవిధానానికి జూపాక సుభద్ర ఉపయోగించారు.

జూపాక సుభద్ర భాషా సంవిధానంలో గమనించాల్సిన కొన్ని అంశాలున్నాయి. 1. జాతీయాలను సంవిధానంలోకి చేర్చడం (Idiomatic mode). 2. మూలభాషా నుసరణ (adaptation of original language) 3, క్రియాత్మక వాక్య నిర్మాణం (Functional syntax) మొదలైన వాటిని గమనించవచ్చు. భాషా శాస్త్రం భాషా సంవిధానంలో జ్ఞానం (Cognition) వ్యక్తీకరణ (expression) సంకల్పం (conation) అనే లక్షణాలు భాషకు ఉన్నాయని విశ్వసిస్తుంది. జ్ఞానం సమాచారాన్నిస్తుంది.

వ్యక్తీకరణ మానసిక స్థితిని చెబుతుంది. సంకల్పం వాక్యప్రయోగంలోని లేదా పదప్రయో గంలోని కోరికను, ఊహలను, ప్రేరణలను ప్రభావాలను రికార్డు చేస్తుంది. పదాల ఉపయోగంలో భాషకుండే సంప్రదాయ వ్యవస్థకు భిన్నంగా ఉచ్చారణా సామ్యంతో పదాలను రాయడం కనిపిస్తుంది. “చిన్న-సిన్న” “కథ-కత” “ధనాన-దనాన” “సంపద/సంపత్తి-సంపతి” “చపగ-సప్పగ” “మహత్కార్యం-మాత్కారం” “బ్రష్-బురుసు” “బ్రహ్మ-బమ్మ”- ఇలా చాలా పదాలకు జన వ్యవహారంలోని ఉచ్చారణా సామ్యానికి దగ్గరగా స్పెల్లింగులు రాసే పద్ధతి కనిపిస్తుంది. మౌఖిక సంప్రదాయానికి దగ్గరగా భాష రాసినప్పటికీ ఇది సాధారణ వ్యాకరణ గతమైన నియమాలుగల పదం ఏ జ్ఞానాన్నిస్తుందో ఆ జ్ఞానాన్నిస్తుంది. ఇవన్నీ సంస్కృతం, లేదా ఇంగ్లీషు మొదలైన భాషలకు సంబంధించిన పదాలు. కాని ఈ భాషలోని వ్యవహారానికి తెచ్చుకునేటప్పటికి ఇక్కడి మౌఖిక నియమాలకు దగ్గరగా పదరూపాన్ని తయారుచేయడం కనిపిస్తుంది. ఇలా తయారై భాషా వ్యవహారంలో స్థిరపడ్డ రూపాలను జూపాక స్వీకరించారు. కానీ భాషలోని మరో భాగం అచ్చమైన దేశీ పదాల ఉపయోగం. జూపాక భాషా సంవిధానంలో పదసంయోజనంలో గమనించాల్సిన విషయాలలో ఇదికూడా ఒకటి. “దొంతులు-కాగులు-సోలిపంటలు-కుంచం-బువ్వ-కలిగంజి-కంచుడు-ఆయిపాయిగ తినడం-యాది-గొడ్డు-” ఇలాంటి పదాలను కూడా అనేకంగా ఏరి రాయొచ్చు. ఇలా ఈ కథా సంపుటాన్ని పరిశీలిస్తే ఒక నిఘంటువే చేయవచ్చు.

వ్యక్తీకరణ అనేది అన్ని వాక్యాల్లోనూ కనిపిస్తుంది. ప్రధానంగా తెలంగాణాలో ఉపయోగించే జాతీయాలను సామెతలను తన కథల్లో కథా భాగం దెబ్బతినకుండా ఉపయోగించారు.- “ఏడు ముట్టెల్లకాలం గీ మట్టి బిసుక్కుంట, ఎద్దుముడ్ల బొడ్సుకుంతనే బతుకుతమా” ఏ దెల్వని ఎల్లిపాయ “నవ్వులుబోయి నువ్వులైతయని” “ఎరువు సొమ్ము పరువు సేటైతదని” “మకుర నిల్సున్నట్టు” “ఎనుకట ఎల్ల గుర్రాలనెక్కితె ముడ్డంత కాయగాసిందని” “మన్నంత కాకులేర్గినట్లుండింది” “బట్టల్లేనోల్ల రూపు బాంచ రూపు” “అవ్వేద్వంగ బిడ్డేడ్సినట్టు”- ఇలాంటి జాతీయాలు నానుడులు సామెతలను కూడా ఎత్తిరాయొచ్చు. స్పష్టంగా జూపాక సుభద్ర భాషపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని అర్థమవు తుంది ఈ కథలు చదివితే. ఇది దళిత జీవనాల్లో ఉండే భాష కాబట్టి ఇది ఆత్మగౌరవ సంకేతమే. ప్రజల్లో స్త్రీల వద్ద ఉండే భాషను మూలభాషగా భావించే అలవాటు ఉండేది. కాలిక ఉత్కాలిక సిద్ధాంతాలను గ్రంథస్థం చేయడానికి “స్త్రీలు విద్యాధికులు కానివారు వృద్ధులు మాట్లాడే అ భాషలో గ్రంథస్థం చేయమని చెబుతారు మత గురువులు.

అలాంటి మాయిముంతల భాష ఈ కథల నిండా పరుచుకున్నది. ‘రాయక్క మాన్యం’ కేవలం కథల సంపుటి మాత్రమే కాదు. పలుకోణాల్లో దళిత మహిళా జీవితాలను, అందులోనూ ఆధునిక దశలో అనుభ విస్తున్న ఆచివేతను వ్యక్తం చేసిన సజీవ జీవన భావనలు. కథలకు వస్తువులను, ఇతివృత్తాన్ని, పాత్రలను వాటి వ్యక్తిత్వాలను, సంభాషణను, భాషను ఎన్నుకోవడంలో శిల్పంలో జూపాక సుభద్ర నైపుణ్యానికి ఈ కథలు అద్దం పడుతాయి.

కవిత

# దేహాలయం..!

డా॥ పెరుగు రామకృష్ణ, 9849230443

నీ నుండి నువ్వు
ఎంత దూరం పరిగెట్టినా
కాలం కంటే వెనకబడే వుంటావు
నిన్ను నువ్వు
చేరుకోవాలన్న తపనలో
నీకు నువ్వు దూరమౌతూనే వుంటావు
నీలోకి నువ్వు
తొంగి చూసుకున్నప్పుడే
నిన్ను నువ్వు తెలుసుకుంటావు..
ప్రాణలింగాన్ని
గర్భగుడిలో దాచుకున్న దేహం
దేహాలయం కాక మరేమవుతుందని..?
ఎన్ని మెట్లెక్కినా
ఎన్ని కొండలెక్కినా
చివరకు నిన్ను నువ్వు చేరుకోవటమే కదా
దైవత్వమంటే..
నీ దేహం బ్రహ్మ పదార్థమన్న సత్యం
నిత్యం నీ స్పృహలో వున్నంత కాలం,
పంచభూతాలు నీలో
పంచాగ్నులై వెలిగినంత కాలం,
నీ దేహ దేవళం వొక యాగ వాటిక
నిరంతరం వెలిగే ఆత్మదీపిక..

★ ★ ★

నిన్న, నేడు, రేపు చుట్టూ
నీ అజ్ఞాన పరిభ్రమణం మాని
ఆత్మ పరిక్రమ చేసిన్నాడే
విశ్వరూప రహస్యం బోధపడుతుంది
కోటాను కోట్ల జీవాణువుల
నీ దేహమే
విశ్వరూపంగా దర్శనమిస్తుంది..
పుట్టడం, గిట్టడం
తిరిగి పుట్టిన శరీరంలోనే
లీనమై పోవటం అంతేనా అనుకోకు
పాలపుంతలో గ్రహాల్లా
నీ దేహంలో పరిభ్రమించే జీవాణువుల
శ్వేతారుణ కణజాలం లెక్కకు మిక్కిలి..
ఇదే దేవ రహస్యం
శరీర ధర్మమే ప్రకృతి ధర్మం
ఉభయాస్తమయాలు
ఊపిరి ఆటుపోటులు
దేవాలయ శిఖరం
దేహంలో నీ శిరస్సు
కలశాలు మూడూ ముక్కన్నులు
మరి నీకు రెండే నంటావా
జ్ఞాననేత్రం తెరచి చూడు
విశ్వ వీక్షణం నీలోనే
నిన్ను నీవు ఎప్పుడూ
పరిశీలించుకొని వుండవు
నీలోకి నువ్వు ఎప్పుడూ
తొంగి చూసుకుని వుండవు
పద్మాసనం వేసుక్కూచుని
తరచి చూసుకో ఎప్పుడైనా
అఖండ జ్యోతి దర్శనం లభిస్తుంది
"అహం బ్రహ్మాస్మి"
అన్న సత్యం బోధపడుతుంది...!



క
థ

# దృష్టి

తనకు తానే ఆత్మస్థైర్యం సంతరించుకున్న స్త్రీ కథ...



లక్ష్మీ బి. కందిమళ్ళ
89196 99815

పచ్చి పుండులా వుంది మెదడు.

తోటి ఉద్యోగస్తులు, అందునా స్త్రీలు, తన గురించి అంత దుర్మార్గంగా మాట్లాడుకోవడం అన్నది అరవింద మనసును మెలిపెట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

నిజంగా ఈ మనుషులకు కాస్తంత అన్న దయ, కరుణ వుండదా?

ఇలా లేనిపోనివి అనుకొని మనసు నింపుకుంటుంటారా?

కానీ ఇదంతా ఎవరితో చెప్పుకోవాలో కూడా అర్థం కాని పరిస్థితి ఇప్పుడు అరవిందది.

వాళ్ళే నా స్థానంలో వుంటే ఈ బాధేంతో వాళ్ళకు అర్థం అయ్యేది కదా..

పదేపదే వాళ్ళ మాటలే వినిపిస్తున్నాయి అరవిందకు.

ఊపిరాడనంత దుఃఖంతో...

అరవింద ఒక గవర్నమెంట్ స్కూల్ టీచరు.

తను ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఉండగానే మంచి సంబంధం వచ్చిందని పెళ్ళి చేశారు. తనకు ఇంకా చదువుకోవాలని వుందని చెప్పలేక పోతుంది. ఇంట్లో వాళ్ళకు తన చదువు కన్నా తన పెళ్ళి ముఖ్యం. తన తర్వాత ఇద్దరు ఆడ పిల్లలు వున్నారని. పెళ్ళి అయ్యాక భర్తతో కూడా చెప్పలేక, ఆ కోరికను అలాగే మనసులో దాచుకుంటుంది.

అరవింద భర్తది చిన్న గవర్నమెంట్ ఉద్యోగం కావటం వల్ల, చాలీ చాలని జీతంతో ఆచి తూచి బతకాలి. ఊరి నుండి కొంత ధాన్యం వచ్చినా, అవి పుచ్చి పురుగు పట్టి ఉంటాయి. అయినా వాటినే శుభ్రం చేసుకొని తినాలి.

అరవింద తనకు ఒక బాబు పుట్టాక, వాడు స్కూల్‌కు వెళ్ళే వాడు అయ్యాక, తనకు కొంత ఖాళీ సమయం దొరికడంతో... ఇన్ని రోజులు అరవింద తన మనసులో దాచుకున్న కోరికను భర్తతో చెబుతుంది. బాబు పెద్ద వాడు అవుతున్నాడు. వాడిని మంచి చదువు చదివించాలి కదా.. నేను ఏదైనా ఉద్యోగం చేస్తే, వాడి భవిష్యత్తుకు ఆసరా అవుతుంది అని చెప్పటంతో.. చదువుకోవడానికి ఒప్పుకుంటాడు అరవింద భర్త.

అరవింద ప్రైవేటుగా బి.ఏ చేసి, బి.ఇడి కూడా పూర్తి చేసుకుంటుంది. ఆ వెంటనే అదృష్టం కొద్దీ తన ఊరిలోనే ఉద్యోగం వస్తుంది. అరవింద అనుకున్నట్టుగా ఉద్యోగం సాధించుకోగలిగింది. అలాగే తర్వాత తన భర్త కూడా ఉద్యోగం తన ఊరికే బదిలీ చేయించుకోవచ్చని ఆశతో కొడుకును తనతో పాటు తెచ్చుకొని సంతోషంగా ఉద్యోగంలో చేరుతుంది.

ఇప్పుడే అసలు కథ మొదలవుతుంది అరవింద జీవితంలో..

ఆరోజు

అరవింద తన క్లాస్ మధ్యలో బాత్ రూమ్‌కు వెళుతుంది. బాత్ రూమ్ పక్కనే ఉన్న స్టాఫ్ రూమ్ నుంచి తన పేరు వినిపిస్తుంది. స్టాఫ్ రూమ్ తలుపులు వారగా వేసి ఉన్నాయి. రూమ్‌లో ముగ్గురు ఆడవాళ్ళు (టీచర్లు) తన గురించి మాట్లాడుకుంటున్నారు. భర్త ఊరిలో ఉండడు. రోజూ పూలు పెట్టుకొని అంత అందంగా తయారై వస్తుంది, ఎవరికోసమో మరి అని వాళ్ళు అనుకునే మాటలు విని అరవింద గుండె జల్లుమంటుంది. మనసు మండుతుంది. ఉక్రోషంతో తలుపులు తోసుకొని లోపలికి వెళుతుంది. తనను అలా చూడగానే నోర్లు వెల్లబెట్టుకొని లేచి నిలబడ్డారు ముగ్గురు. ఆవేశంతో అరవిందకు వాళ్ళ చెంపలు వాయించాలనిపిస్తోంది. మీరు అస్సలు ఆడవాళ్ళేనా.. చదువుకున్న మూర్ఖులు మీరు. మీ కన్నా నాగరికత తెలియని వాళ్ళు మేలు. తోటి స్త్రీని ఇంత ఘోరంగా అనుకోవడానికి సిగ్గు అనిపించడం లేదా.. మీవి నోర్లేనా.. ఏమి తింటున్నారు.. ఛీ, మీ మొహాలు చూడటానికి కూడా అసహ్యంగా ఉంది, అంటూ అనవలసిన మాటలు అనేసి, దుఃఖాన్ని మింగుకుంటూ, విసవిసా తన క్లాస్ రూంకు వెళ్ళిపోతుంది. అలా ప్రత్యక్షంగా దొరికిపోవడంతో నోట మాట లేక శిలల్లా నిలబడి పోయారు ముగ్గురూ..



స్కూల్‌లో ఉన్నంత వరకు తన దుఃఖాన్ని ఎలాగో మింగుకుంటూ, ఇంటికి రాగానే మంచంపై బోర్లా పడుకొని గట్టిగా ఏడుస్తుంది అరవింద. చాలా సేపు ఆ దుఃఖాన్ని ఆపుకోలేక అలా ఏడుస్తూ ఉండిపోతుంది. కొడుకు స్కూల్ నుండి వచ్చింది కూడా గమనించుకోలేదు. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఎర్రబడ్డాయి. ముఖం కందగడ్డలా ఉబ్బిపోయింది. అమ్మను అలా చూసి అరవింద కొడుకు ఏడవడం మొదలు పెట్టాడు. వాడి ఏడుపు చూసి,తన తప్పు తెలుసుకొని, దుఃఖాన్ని మింగుకుంటూ కొడుకును దగ్గరకు తీసుకుంది. ఏమైందమ్మా అని వాడు భయం భయంగా ఏడుస్తూ అడుగు తుంటే, ఏమీ లేదు నాన్న స్కూల్ నుండి త్వరగా వచ్చాను. ఏదో సినిమా చూసి ఏడుపు వచ్చింది. నీకు తెలుసు కదా ఎక్కువ దుఃఖం ఉన్న సినిమాలు చూస్తే నేను ఏడ్చేస్తానని.. అదే అంటూ రాని నవ్వును పెదవులపైకి తెచ్చుకుంటూ, చెదిరిన జుట్టును ముడి వేసుకొని, వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళి ముఖంపై నీళ్ళు వేసుకొని అక్కడే ఉన్న టవల్‌తో ముఖాన్ని తుడుచుకొని, ఉండు నీకు నాకు ఇష్టమైంది ఒకటి తెస్తాను అంటూ.. రెండు గ్లాసులలో మ్యాంగో జూస్ పోసుకొని వచ్చి కొడుకుకు ఇచ్చి తను తాగి స్నానానికి వెళుతుంది. అమ్మను అలా మామూలుగా చూసి వాడి మనసు తేలికై టీవీ చూస్తూ కూర్చున్నాడు.

స్నానం చేసి వచ్చిన అరవింద చెరో రెండు చపాతీలు చేసి వాడికి తినపెట్టి, తను తిందామని పెట్టుకుంది. ఊహూ.. తినబుద్ధి కాలేదు. తిరిగి వాటిని హాట్ బాక్స్‌లో పెట్టి, వంట రూమ్ సర్దేసి, బెడ్ రూమ్‌లోకి వెళుతుంది. అప్పటికే కొడుకు మంచి నిద్రలో ఉన్నాడు. తను వాడి పక్కనే పడుకొని కొడుకు తల నిమురుతూ కళ్ళు మూసుకుంటుంది. మళ్ళీ ఆ ముగ్గురి మాటలు జోరీగల్లా చెవిలో గోలపెడుతున్నాయి.

**అమ్మ అంత ఉషారుగా ఉండటాన్ని చూసి రాత్రి చూసిన అమ్మ పరిస్థితిని మరచిపోయి, తను డ్యాన్స్ చేసుకుంటూ స్నానానికి వెళుతాడు కొడుకు. అప్పుడు అర్థం అవుతుంది అరవిందకు, తను సంతోషంగా ఉంటేనే తన కుటుంబం సంతోషంగా ఉంటుందని. ఇకపై తన కొడుకు భవిష్యత్తే తనకు ముఖ్యం అనుకుంటుంది అరవింద.**

అస్సలు నేను చేసిన తప్పేంటి?

భర్త ఊర్లో లేకపోవడమూ ఒక తప్పా?

అందరి ఆడవాళ్ళలాగే ఇంత జడ వేసుకొని పూలు పెట్టుకున్నాను. అదేనా నేను చేసిన తప్పు?

దానికి అన్నన్ని మాటలా?

అసలు వాళ్ళు మనుషులా?

ఎదుటి వారిని మంచి దృష్టితో చూడలేని మూర్ఖులు. చూపు మంచిగా ఉంటేనే కదా.. మనసు మంచిగా వుంటుంది. వాళ్ళకు ఆ రెండు లేవు.

నేను ఇంత కష్టపడింది, ఇలాంటి వాళ్ళకు భయపడి బ్రతకడానికా?

నేను ఎందుకు ఏడుస్తున్నాను?

అస్సలు ఆ పనికిరాని ముఖాలు ఇంకా ఇంకా ఏడ్చేలా నేను బ్రతకాలి. అని కసిగా అనుకున్న తర్వాత కాస్తంత ఊపిరి గట్టిగా తీసుకొని బలవంతాన ఆలోచనలకు అడ్డుకట్ట వేసి కళ్ళు మూసుకుంటుంది అరవింద.

ముందు కన్నా మరింత ఉషారుగా లేచి తనకు ఇష్టమైన సినిమా పాట పాడుకుంటూ కొడుకును నిద్ర లేపుతుంది అరవింద. అమ్మ అంత ఉషారుగా ఉండటాన్ని చూసి రాత్రి చూసిన అమ్మ పరిస్థితిని మరచిపోయి, తను డ్యాన్స్ చేసుకుంటూ స్నానానికి వెళుతాడు కొడుకు. అప్పుడు అర్థం అవుతుంది అరవిందకు, తను సంతోషంగా ఉంటేనే తన కుటుంబం సంతోషంగా ఉంటుందని. ఇకపై తన కొడుకు భవిష్యత్తే తనకు ముఖ్యం అనుకుంటుంది అరవింద. తన దుఃఖాన్ని మరిచిపోయే ప్రయత్నంలో.. !!!

వ్యాసం

# తెలుగులో వంద ఉత్తమ నాటకాలు (1880-2020)

తెలుగులో నాటకాల పరిణామం చిత్రించిన వ్యాసం...



కె.పి. అశోక్ కుమార్
97000 00948

నన్నయ భారత రచనతో తెలుగు సాహిత్య చరిత్ర ప్రారంభమైంది. ఆనాటినుండి ఎందరో కవులు సంస్కృత నాటకాలను కూడా అనువదించారు. కాని అవి నాటకాలుగా కాక కావ్యాలుగా వ్రాయబడ్డాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం మన ఆచార సంప్రదాయాల మీద, భాష మీద పడిన తర్వాతనే మనదగ్గర నాటక రచన ప్రారంభమైంది. ముందుగా సంస్కృత నాటకాలను యదాతథంగా ఆంధ్రీకరించడమే కాకుండా ప్రఖ్యాతి చెందిన ఆంగ్ల నాటకాలను కూడా అనువదించడం ప్రారంభించారు. కొంతకాలం తరువాత పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో నూతన ధోరణులతో కూడిన స్వతంత్ర్య నాటకాలు రావడం ప్రారంభమయ్యాయి.

1860లో కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన 'మంజరీ మధుకరీయం' తెలుగులో వచ్చిన మొట్టమొదటి నాటకం. ఇది ప్రబంధ పద్ధతిలో రచించిన పద్యనాటకం. ప్రదర్శనానుకూలమైనది కాదు. తర్వాత 1880లో వావిలాల వాసుదేవశాస్త్రి రాసిన 'నందక రాజ్యం' తొలి సాంఘిక నాటకం. మొట్టమొదటిసారిగా ముద్రించబడిన నాటకం కూడా ఇదే. అప్పటినుండి 1920 వరకు తెలుగు నాటకరచనసంప్రదాయ పద్ధతిలో జరిగింది. చారిత్రక నాటకాలకు



కోరాడ రామచంద్రశాస్త్రి

ఇది స్వర్ణయుగం. 1920 తరువాత కాలంలో జాతీయ వాద ధోరణిలో, ఆ తర్వాత సంఘసంస్కరణ ఉద్దేశంతో నాటకాలు విరివిగా వెలువడినాయి.

1940 తర్వాత తెలుగు నాటకరంగం బాగా విస్తరించింది. ఆ కాలంలోనే తెలుగు నాట నాటక పోటీలు ప్రారంభమై నాటకరంగం ఊపు అందుకుంది. పుంఖానుపుంఖాలుగా కొత్త రచనలు వెలుగులోకి వచ్చాయి. 1960 నాటికి తెలుగులో సుమారు 2000 వరకు నాటకాలు, సుమారు 4000 వరకు ఏకాంకికలు, నాటికలు వెలువడినాయని డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు తన పరిశోధనా గ్రంథం "తెలుగు నాటక వికాసము"లో తెలియజేశారు. 1860-1960 సంవత్సరాలలో అంటే వందేళ్ళలో వెలువడిన రచనల సంఖ్య అది.

1960-2019 వరకు అంటే ఈ 60 యేళ్ళ కాలంలో నాటకాల సంఖ్య తగ్గినా, నాటికల సంఖ్య పెరిగిందనే చెప్పాలి. ఇవి కాకుండా పలు ప్రదర్శనలు పొంది అధిక జనాదరణ నొందిన నాటకాలు కూడా ముద్రణకు నోచుకోకపోవడం వల్ల సమాచార లేమి కనిపిస్తుంది. ఈ విషయాన్ని పక్కన బెట్టినా, అంత విస్తారంగా వచ్చిన నాటక సాహిత్యం ఎంతవరకు అందుబాటులో ఉన్నది ఒక ప్రశ్నగానే మిగిలిపోతుంది. ప్రదర్శనపరంగా ప్రజాదరణ పొందిన నాటికలు, నాటకాలు 1980 ప్రాంతాల వరకు వివిధ ప్రచురణ సంస్థల ద్వారా ముద్రించబడ్డాయి. అందులో పునర్ముద్రణకు నోచుకున్నవి వందల సంఖ్యలోనే వుండొచ్చు. అవి క్రమంగా కనుమరుగవుతున్నాయని చెప్పుకోవాలి. ఏ సాహిత్య ప్రక్రియలోనైనా కాలానికి నిలబడే రచనలు పరిమిత సంఖ్యలోనే వుంటాయి. వాటిని భద్రపరిచి ముందు తరాల వారికి అందించాల్సిన బాధ్యతను ఈ తరం తీసుకోవాలి.

వ్యాసం

ఆ ఆలోచనతోనే వల్లూరు శివప్రసాద్, గంగోత్రి సాయి కలిసి 2010 నుండి ఎంపిక చేసిన ఉత్తమ నాటక సాహిత్యాన్ని సేకరించి, ముద్రించి నేటి పఠనాభిలాషులకు, విమర్శకులకు, భవిష్యత్తు తరాలవారికి అందజేయడానికి ఎంతగానో కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా 140 ఏళ్ళ నుండి వెలువడుతున్న నాటక సాహిత్యంలో నుండి, ఎంపిక చేసిన ఉత్తమ లేదా ప్రజాదరణ పొందిన నాటికలను, నాటకాలను సంకలనాలుగా వెలువరించాలని సంకల్పించారు. ఆ దిశగా సేకరిస్తూ వచ్చిన నాటకాలలో నుండి నూరు నాటకాలతో ఆరు సంపుటాలుగా వెలువరించడం అభినందించదగ్గ విషయం.

1880-1945లలో వచ్చిన నాటకాలతో ప్రథమ సంపుటి వెలువడింది. తొలి తెలుగు సాంఘిక నాటకం వావిలాల వాసుదేవశాస్త్రి రాసిన 'నందక రాజ్యం' ఆరో సంకలనం ప్రారంభమైంది. ఈ నాటకం వైదికి-నియోగుల మధ్య ఉన్న వైషమ్యాలను, ఆధిపత్య పోరాటాలను చిత్రీకరించింది. గ్రామ్య పదాలతో కూడిన వ్యావహారిక భాషలో రాసిన ఈ స్వతంత్ర నాటకంతో తెలుగులో ఆధునిక నాటక రచన మొదలైందని చెప్పవచ్చును.

1910 నాటి వృద్ధ వివాహ దురాచారాన్ని, వరవిహీన వివాహ దురాచారాల్ని తీవ్రంగా ఖండిస్తూ పానుగంటి లక్ష్మీనరసింహారావు రాసిన



వావిలాల వాసుదేవ శాస్త్రి

నాటకం 'వృద్ధ వివాహం' కూడా ఇందులో ఉంది. భర్త ఎంత దుర్మార్గుడైనా, భర్త కన్నా పరమ దైవం లేదన్న మూఢభక్తితో భర్త క్షేమం కోరి అతను చేసిన హత్యానేరాలను తనపై వేసుకొని, వధ్యశిలపై ఎక్కిన అభాగ్యురాలి కన్నీటి గాథను 'రంగూన్ రౌడీ'గా మలిచినారు సోమరాజు రామానుజరావు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో పంజాబ్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో డయ్యర్ జరిపిన కాల్పులను ఇతివృత్తంగా తీసుకొని పాంచాలమాతను డయరాసురుడు పరాభవించబోతే కృష్ణుడు గాంధీ రూపంలో దర్శనమిచ్చినట్లు, డయ్యరు పారిపోయినట్లు సన్నివేశ కల్పన చేశారు. ప్రజలపై ఆంగ్లేయుల ఆంక్షలు, ఆకృత్యాలు దయనీయంగా చూపబడ్డాయి. పంజాబు దురంతం మీద ఎంక్వైరీ కమిటీలు సమర్పించిన నివేదికల ప్రస్తావనతో నాటకం ముగుస్తుంది.

ఉడుకు పేర్లతో (నిక్‌నేమ్) ఏడ్చేవాడ్ని అతిత్వరగా ఏడ్పించవచ్చనీ, కోప్పడేవాడ్ని ఇంకా కోప్పడేటట్టు చెయ్యవచ్చని, అల్లరికి ఫౌంటెన్ హెడ్ లాంటి దంటూ ఒక ఉడుకు పేరుతో హాస్యభరితంగా అల్లిన శుద్ధ తెలుగు నాటకం 'బాగుబాగు'. వాక్చమత్కృతితో, తెలుగు సాహిత్యంలో శాశ్వతత్వం పొందిన పాత్రలతో నిండిన ఈ నాటకాన్ని భమిడిపాటి కామేశ్వరరావు రాశారు. మద్యపాన నిషేధాన్ని కోరుకుంటూ సంఘ సంస్కరణాభిలాషతో స్వాతంత్ర్యానికి పూర్వమే రాయబడిన కాళ్ళకూరి నారాయణరావు 'మధుసేవ' ఒక ప్రభోదాత్మక సాంఘిక నాటకం.

ఆడవారికి, మగవారికి అన్యోన్య సహాయం లేకుంటే సంసార రథం నడవదని, సంపాదించుకు వస్తున్నాననే గర్వం మగవాడికి, ఇంటిపనులు ఒంటిచేత్తో చక్కబెడుతున్నానన్న గర్వం ఆడదానికి కూడదని- మనస్పర్థలు, అపార్థాలు లేకుండా సంసారాన్ని నడుపుకోవాల్సిన బాధ్యత భార్యాభర్తలకు సమానంగా వుంటుందని ఒద్దిరాజు సోదరులు హాస్యభరితంగా తీర్చిదిద్దిన నాటకం 'మగ సంసారం'. తెలుగు నాటకాన్ని ఆధునికత వైపు అనగా వాస్తవికత వైపుకు మళ్ళించిన నాటకం పి.వి. రాజమన్నారు గారి 'తప్పెవరిది?'. ఈడుజోడు కాని ద్వితీయ వివాహాల వలన స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను చాటిచెప్పిన నాటకం ఇది.

అభ్యుదయకాముకులు బాల్యవివాహాలు, వితంతు వివాహాల్లాంటి సాంఘిక దురాచారాలను వ్యతిరేకించడం ఛాందసులకు 'సరిపడని సంగతులు' సంఘసంస్కరణోద్యమ ప్రభావంతో, వితంతు వివాహం జరిపిన ఈ ఆధునిక నాటకాన్ని బళ్ళారి టి. రాఘవ రాశారు.

గ్రామీణ ప్రేమికుల నిష్కల్మత్వానికి, అమాయకత్వానికి భావుకతను, కళాత్మకతను జోడించి తీర్చిదిద్దిన నాటకం డా॥ చిలుకూరి నారాయణరావుగారి "అచ్చి లేక కాపు వలపు". రైతు దంపతుల పవిత్ర ప్రేమను అచ్చతెలుగు వ్యవహారిక భాషలో రచించిన నాటకం ఇది. స్త్రీ ఆర్థికంగా తండ్రిమీద, భర్త మీద ఆధారపడి బ్రతకాల్సిరావడం కన్నా శాపం మరొకటి లేదని, స్త్రీకి ఆస్తిహక్కు, ఆర్థిక స్వావలంబన వుండాలని 80 యేళ్ళ క్రితమే ఎలుగెత్తి చాటిన నాటకం మల్లాది అవధానిగారి 'గాలివాన'. ఇది పద్యనాటకాలు అమితంగా ఆదరణ పొందుతున్న కాలంలో వ్యవహారిక భాషలో రాయబడిన సంచలనాత్మక నాటకం. ఆంధ్రదేశాన్ని ఆవరించిన దాస్య తిమిరాలను తొలగించడానికి వెలిగించిన ఆంధ్రజ్యోతి ప్రసరించే స్వతంత్రకాంతులు గ్రామగ్రామానికి వ్యాపించి ప్రజ్వరిల్లిననాడు ఆంధ్ర రాష్ట్రమే కాదు. భారతదేశానికి స్వరాజ్యం కూడా అచిరకాలంలోనే ప్రాప్తిస్తుందని చెప్పే ఆంధ్రరాష్ట్ర ప్రబోధ నాటకమే 'ఆంధ్రజ్యోతి'. ఈ నాటకాన్ని రాళ్ళపల్లి నారాయణమూర్తి రాశారు.

తెలుగుజాతి ఔన్నత్యాన్ని, తెలుగుభాష గొప్పతనాన్ని దశదిశలా చాటిచెప్పే నాటకం వేదాంత కవి గారి

'తెనుగుతల్లి' బీమా వ్యాపారం విస్తరిస్తున్న తొలిదశలో, ఏజెంట్లు వ్యాపారం కోసం అవకతవక విధానాలకు పాల్పడటాన్ని దుయ్యబట్టిన హాస్యనాటకం ముద్దు కృష్ణ గారి 'బీమా విలాపంలో భామాకలాపం'. ఆదర్శంతో కాలానికే ఎదురీదబోయిన ఆ యువకుడు చివరకు ఏం సాధించాడని ప్రశ్నించే నాటకం కొండముది గోపాలరాయశర్మగారి 'ఎదురీత'. సంఘసంస్కరణను ఉద్దేశించిన ప్రబోధాత్మక నాటకమిది. స్త్రీని సంపూర్ణంగా అర్థం చేసుకోకుండా స్త్రీ విద్యను, స్త్రీ స్వాతంత్ర్యాన్ని ధిక్కరించే సాంఘిక దురాచారాల మీద దాడిచేసిన ఈ 'స్త్రీ' నాటకాన్ని మల్లాది వెంకటకృష్ణశర్మ రాశారు. విశాఖ మండలం భాషాయాసలను పాత్రోచితంగా వాడడం ఇందులోని విశేషం.

రెండవ సంకలనంలో 1945 మొదలుకొని 1956 వరకు వచ్చిన నాటకాలు వున్నాయి. ఇందులో మొదటగా సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుల 'ముందడుగు' నాటకం వుంది. ఇందులో జమిందారుల రాక్షసకృత్యాలు, తాబేదారుల దురాగతాలు అడ్డుకోవాలంటే రైతుల ఐకమత్యం, రైతు సంఘాల స్థాపన ద్వారానే సాధ్యమని ఎలుగెత్తి చాటిన నాటకం. ఇది బ్రిటిష్ ప్రభుత్వంచే నిషేధానికి గురయిన సంచలనాత్మక నాటకం. పాలేరు కొడుకు పాలేరుగానే బ్రతకాల్సిందేనా? అని బోయి భీమన్న 'పాలేరు' నాటకం ద్వారా ప్రశ్నిస్తున్నారు. తరతరాల పాలేరు వ్యవస్థను ధిక్కరించిన ఈ నాటకం గ్రామగ్రామాన విస్తృతంగా ప్రదర్శింపబడి, అత్యంత ప్రజాదరణ పొందింది. పట్టణాల్లో బతికే గుమస్తాలు చాలీచాలని జీతాలతో కుటుంబాలను ఎలా పోషించాలన్నది ఒక సమస్య. దీనితోపాటు మధ్యతరగతి కుటుంబాల మనస్తత్వాలు, ఫాల్స్ ప్రిస్టేజి పేరిట పడుతున్న ఆర్థిక, సాంఘిక సమస్యల్ని వాస్తవికత దృష్టితో ప్రతిబింబించిన ఈ 'ఎన్.జి.ఓ.' నాటకాన్ని ఆచార్య ఆత్రేయ రాశారు.


కొప్పరపు సుబ్బారావు

కొల్లాపురం మఠం రాచయ్య రాసిన "శ్రీ మహాత్మా గాంధీ" నాటకం రేఖామాత్రంగా గాంధీజీ జీవితాన్ని, ఆశయాలను సిద్ధాంతాలను ప్రతిబింబించింది. గ్రామీణ కళాకారులచే వందకు పైగా ప్రదర్శనలతో, ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని నింపింది. నాటకరంగంలో వాస్తవ జీవితాన్ని శాస్త్రీయ దృక్పథంతో వివరించే తొలి ప్రయత్నమే అనిసెట్టి సుబ్బారావుగారి 'గాలిమేడలు'. శాస్త్రీయ దృక్పథంతో జీవితాన్ని చిత్రించడం, ప్రేక్షకులను కూడా ఈ నాటకంలో పాత్రధారులుగా చేయడానికి ప్రయత్నించడం, ఈ రెండూ ఈ నాటకంలోని కొత్త విషయాలు. గ్రామ ప్రజలంతా అన్యోన్యంగా, ఇరుగుపొరుగు మంచి చెడు గుర్తించి నడుచుకుంటే పల్లెటూళ్ళు ప్రశాంతంగా వుంటాయని చెప్పే సందేశాత్మక నాటకం కోడూరు అచ్చయ్యగారి 'పెత్తందారు' మానవత్వం మంటగలిసినప్పుడు మనిషికి జంతువులే ఆదర్శమవుతాయని పినిశెట్టి శ్రీరామమూర్తి 'పల్లె పడుచు' తెలియజేస్తుంది.

కొప్పరపు సుబ్బారావుగారి 'ఇనుపతెరలు' వెనక మనిషి మితిమీరిన స్వార్థంతో సమాజ బాధ్యతలను విస్మరించి, ఎలాంటి ఆకృత్యాలకు పాల్పడుతున్నారో కళ్ళకు కట్టినట్లు చూపించింది.తమని తాము అమితంగా ప్రేమించుకునేవాళ్ళు ఇతరుల్ని ప్రశాంతంగా బ్రతకనివ్వరు. తాము ప్రశాంతంగా బ్రతకలేరంటూ వారి 'ఆత్మవంచన'ను బుచ్చిబాబు నాటకంగా మలిచారు. ఒక రచయిత తన నాటక రచనా నైపుణ్యంతో ప్రేమికుల మధ్య ఏర్పడిన అపార్థాలను తొలగించి, పెనుతుఫానులో చిక్కుకున్న వారిద్దరి ప్రేమలతను రక్షించి నిలబెడతాడు. నాటక కళకి గొప్ప గౌరవాన్ని, ప్రయోజనాన్ని సంపాయించి పెట్టాడు. డి.వి. నరసరాజు 'నాటకం' ఇది. స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ రామరాజు విప్లవగాథకు అపూర్వమైన నాటకీకరణ పడాల రాసిన 'అల్లూరి సీతారామరాజు'. మధ్యతరగత ఉమ్మడి కుటుంబాల్లో ఒకరి మీద ఒకరికి అసూయలు, ద్వేషాలు, కలహాలతో తమ జీవితాలను ఎలా పాడుచేసుకుంటారో గోరాశాస్త్రి 'ఆనందనిలయమ్' నాటకంలో చిత్రీకరించారు.

దున్నేవాడిదే భూమి అంటూ కౌలుదార్ల రక్షణ కోసం రైతులు చేసే పోరాటాన్ని కళ్ళకు గట్టినట్లు చిత్రించిన నాటకం నాజర్ గారి 'ఆసామి'. పల్లెల్లో జరిగే కామందుల దాష్టికాన్ని కళ్ళకు కట్టించిన నాటకం కందశ్రీగా 'ఇదా ప్రపంచం'. కె.యల్. నరసింహారావుగారి 'అడుగుజాడలు' నాటకం దేశాభివృద్ధికి మహాత్ముల అడుగుజాడలలో ముందుకు నడవాలి అని ప్రబోధిస్తుంది.

1956 నుండి 1964 వరకు వచ్చిన నాటకాలతో మూడవ సంకలనం వెలువడింది. ఇందులో మొదటి నాటకం బెల్లంకొండ రామదాసుగారి 'పునర్జన్మ'. ఒకసారి మోసపోయిన స్త్రీ జీవితం అధోగతి పాలు కావల్సిందేనా? అని ఈ నాటకం ప్రశ్నిస్తుంది. తెలుగులో అపరాధ పరిశోధన నాటకాలకు నాంది పలికిన ప్రఖ్య శ్రీరామమూర్తి మరో నాటకం 'కాళరాత్రి' ఇందులో వుంది. ఉత్తుత్తి హత్య నిజం కావడంతో, ఉత్తుత్తి హంతకుడు నిజమైన హంతకుడిగా నిలబడాల్సి వస్తుంది. ఈ హత్య ఎలా? ఏమిటి? ఎందుకు జరిగిందో చివరకు గాని

తెలియదు. పనులు లేక, తిండి దొరకక ఆకలి చావులతో అణగిపోతున్న చేనేత కార్మికుల దుస్థితిని పింజల సోమేశ్వరరావు గారు 'వస్త్ర నిర్మాత' నాటకంలో చిత్రించారు.

జీవితంలో అనేక పరిస్థితుల కారణంగా పతనమవుతున్న వ్యక్తులు అలాగే పడి వుండాలా? సంతోషంగా ప్రశాంతంగా గౌరవంగా బ్రతికే అవకాశం లేదా? అందుకు దోహదపడని సమాజం కూడా ఒక సమాజమేనా అని అవసరాల సూర్యారావు 'పంజరం' ప్రశ్నిస్తుంది. వివాహ బంధానికి కట్టుబడి, భోగలాలసులైన పురుషుల కఠిన పాదశిలలకింద నలిగిపోయే స్త్రీల 'రక్తకన్నీరు'ను పాలగుమ్మి పద్మరాజు చిత్రించారు. ఎటువంటి ప్రజలకు అటువంటి ప్రభుత్వమే వస్తుందని కొర్రపాటి గంగాధరరావు 'యథా ప్రజా-తథారాజా'లో తెలియజేశారు.

తెలుగు సాహిత్యంలో ప్రీవర్స్‌లో కుందుర్తి వ్రాసిన మొట్టమొదటి రంగస్థల నాటకం 'ఆశ'. నిరాశతో జాతి నిర్వీర్యమవుతుందని, బ్రతుక్కి నూతన శక్తి నిచ్చేందుకు భూమిమీద ఆశలతోరణాలు కట్టాలని చెప్పే ప్రయోగాత్మక నాటకమిది. కాలంతో పాటు పెద్దలు మారాలి. ప్రేమికుల్ని పెళ్ళితో ఆశీర్వదించాలి అంటూ "భలేపెళ్ళి" చేసిన ఘనత గన్నిశెట్టి వెంకటేశ్వరరావుది.

స్థానిక సంస్థల ఎన్నికలలో, పాలనలో జరిగే అన్యాయాలపై, అవినీతిపై సంధించిన వ్యంగ్యాస్త్రం కొడాలి గోపాలరావుగారి 'ఛైర్మన్'. సాధక బాధకాలు ఆలోచించకుండా ఎవరికీ ఎటువంటి మాట ఇవ్వకూడదని, ఇచ్చిన మాటకు కట్టుబడి వుండాలని చెప్పిన నాటకం రావి వెంకటాచలం గారి 'మాట తప్పకు'. తెలుగుదేశంలో కవీ, కళాకారుడు ఆదరణ లేక బ్రతికున్నన్నాళ్ళు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించి చస్తారనీ, చచ్చాక కూడా కళాపోషకుల దయాదాక్షిణ్యాల మీదనే బ్రతుకుతారని, తెలుగువారి ఉపేక్షాభావాన్ని ఎత్తిచూపిన నాటకం 'కీర్తిశేషులు'. ఇది భమిడిపాటి రాధాకృష్ణ విరచితము. కె.వి. రమణారెడ్డి మరియు పి.వేణు కలిసి రాసిన 'అన్నపూర్ణ' నాటకం గ్రామాల్లో పెత్తందార్లకు, బీద ప్రజానీకానికి మధ్య జరుగుతున్న పోరాటాన్ని చిత్రీకరించింది.



**చిలుకమర్తి లక్ష్మీనరసింహం**

మచ్చలేని మనిషిగా, ఆత్మ గౌరవంతో నిజాయితీగా బ్రతికినా ఆమె చివరకు సాంఘిక దురన్యాయానికి ఎలా బలయిందో దాసం గోపాలకృష్ణ 'చిల్లరకొట్టు చిట్టెమ్మ'లో చూడాల్సిందే. నిజాన్ని కాపాడాల్సిన సాక్షులు అబద్ధం చెప్పడంతో నిర్దోషికి ఉరిశిక్ష విధించబడటం ఎంత అన్యాయమో, రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'నిజం' చెబుతుంది. కాంట్రాక్టర్ల వ్యాపార దృష్టి, ధనాశ నాటకరంగానికి చేటు చేస్తుందన్న సత్యాన్ని వెల్లడించిన 'రంగస్థలం' నాటకాన్ని కోడూరుపాటి సరస్వతీ రామారావు వ్రాశారు. నైతిక సంస్కరణ, నైతిక విప్లవం మనిషిలో రావాలని ప్రబోధించే ఎన్.ఆర్. నంది 'మరో మెహెంజొదారో' ఎలియవేషన్ పద్ధతిలో, తెలుగు నాటకరంగంలో నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది.

నాలుగవ సంకలనంలో 1964 నుండి 1975 వరకు వచ్చిన నాటకాలు వున్నాయి. కులమత ప్రాంతాలకు అతీతమైనది మానవ ప్రేమ అని చాటిచెప్పిన రవీంద్రనాథ్ టాగోర్ "కాబూలీవాలా" కథకు రాంజీ చేసిన నాటకీకరణ బాగుంది. అవినీతి, స్వార్థంలతో నిండిన ఈనాటి సమాజంలో అందరూ 'శ్రీరంగనీతులే' చెబుతారు. కాని ఆచరించి చూపేవారు లేరని వడ్లమూడి సీతారామారావు తెలియజేస్తున్నారు. కన్నవాళ్ళకు పిల్లల పట్ల మితిమీరిన ప్రేమతోపాటు, పెంపకంలో సరైన అదుపు లేకపోతే వాళ్ళ జీవితాలు "పట్టాలు తప్పిన బండి"లా అవుతాయని రావికొండలరావు హెచ్చరిస్తారు. నటీనటుల ఆలయం 'నటనాలయం' అనీ, నాటకసమాజాలు - నటన పవిత్రమైనవిగా వుండాలని, ఆరాధ్యాలుగా వుండాలని చెప్పే విశేష రచన. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందిన ఈ నాటకాన్ని మోదుకూరి జాన్సన్ రాశారు.

చిలుకమర్తి లక్ష్మీనరసింహం రాసిన 'గణపతి' 1920లో ప్రచురింపబడిన హాస్యరస ప్రధానమైన నవల. దీనికి బందా కనకలింగేశ్వరరావు చేసిన రేడియో అనుసరణ విశేష ప్రజాదరణ పొందింది. రాజకీయాలు పల్లెల్లోని ప్రశాంతతను ఏవిధంగా కలుషితం చేస్తాయో, అందుకు కారకులు ఎవరో బయటపెట్టే 'గాలివాన' నాటకాన్ని ఆర్.వి.యస్. రామస్వామి రాశారు. మనిషిలో మితిమీరిన స్వార్థాన్ని సంఘం ఉపేక్షించదని, ఏదోనాడు శిక్షకు గురిచేస్తుందని హెచ్చరించే 'సంఘం చెక్కిన శిల్పం' కె.ఎస్.టి. శాయి గారిది.

మనిషిలోని ద్వంద్వ ప్రవృత్తిని వెలికితీస్తూ జంధ్యాల రాసిన నాటకమే 'సంధ్యారాగంలో శంఖారావం'. ఒక జానపద కథను నేటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా, ఆధునికంగా మలచిన నాటకం. రచనలో, ప్రదర్శనలో ప్రయోగాత్మకమైన ఆధునిక యక్షగానం అబ్బూరి గోపాలకృష్ణ గారి 'త్రిజాతీ యమ దర్శనం'. దేవుడికోసం ఏర్పాటయిన ఈ వ్యవస్థలో ఎంత అవినీతి, ద్రోహం,

అజ్ఞానం, హింస ఇమిడివుందో తెలియజెప్పడం- హేతువాద దృష్టితో ఆలోచింపజేయడం కోసం యం.వి. హరనాథరావు రాసిన నాటకమే 'జగన్నాథ రథచక్రాలు'.

అంటరానివాళ్ళుగా దళితుల్ని అణచివేస్తున్న కాలంలో, దళితుల పక్షాన నిలబడిన అభ్యుదయ రచన ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' ఈ నవలకు నగ్నముని చేసిన నాటకీకరణ ప్రశంసల నందుకుంది. కష్టజీవులంతా ఏకమై సాయుధ పోరాటం చేయ్యాలనీ, రాక్షసుల్లా కాల్చుకుతిన్న భూస్వాముల పని పట్టాలని చాటిన విప్లవ నాటకం చెరబండరాజు 'గ్రామాలు మేల్కొంటున్నాయి''. దోపిడి విధానం అతివాదులు-మితవాదుల వల్ల పోదని, హృదయవాదుల వల్లనే ఈ విధానంలో మార్పు వస్తుందనీ, అందుకు బుద్ధిజీవులైనవారు పూనుకోవాలని గణేశ్‌పాత్రో ఆకాంక్ష 'అసుర సంధ్యలో' ప్రతిఫలించింది. స్వార్థపరుల చేతిలో ప్రజాస్వామ్యం రకరకాలుగా సమాధికాబోతుందన్న నగ్నసత్యాన్ని బట్టబయలు చేసిన అభ్యుదయ రచన పరుచూరి వెంకటేశ్వరరావుగారి 'సమాధి కడుతున్నాం - చందాలివ్వండి'.

ఈ సంఘం నైతిక జీవనం విషపూరితం కావడానికి కారణం పెద్దమనుషుల ముసుగులో ఉన్న స్వార్థపరులే. దీనికి కారణం మూర్ఖత్వం మూర్తీభవించిన మెజార్టీ ప్రజలేనన్న చేదునిజాన్ని వెల్లడించిన ఆలోచనాత్మక నాటకం 'సత్యం గారిల్లెక్కడ'. ఇది గొల్లపూడి మారుతీరావు రచన. మధ్యతరగతి రైతుల అమాయకత్వాన్ని, అవసరాన్ని తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా మలచుకునే గ్రామపెత్తందార్ల స్వార్థంతో రైతుల సౌభాగ్యాన్ని కొల్లగొడుతున్నారని పూసల 'మండువా లోగిలి' తెలియజేస్తుంది.

1975-1989లలో వచ్చిన నాటకాలతో అయిదవ సంకలనం వెలువడింది. ఈ వ్యవస్థలో నిరుపేదల పక్షాన న్యాయం వున్నా, ఘరానా పెద్దల కుయుక్తుల ముందు అవి బతికి బట్టకట్టలేవన్న నగ్నసత్యానికి దర్పణం పట్టిన నాటకం యండమూరి వీరేంద్రనాథ్ 'పుట్ట'. నిరుపేద ఆదివాసుల శ్రమను దోచుకుని ఆస్తుల్ని పెంచుకునే బుగతలు, షావుకార్లను తొలగిస్తేనే కాని వాళ్ళు బాగుపడరని 'తూర్పురేఖలు'లో అత్తిలి కృష్ణ చెబుతాడు. ఇతరుల కోసం సర్వం త్యాగంజేయడానికి సిద్ధపడే సహృదయుల వ్యథాభరిత సంఘర్షణకు కమనీయ వాస్తవరూపం రాఘవగారి 'కనకపుష్యరాగం'.

ఇసుకపల్లి మోహనరావు 'తర్జని' పురుషాధిక్య సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న ఆకృత్యాలకు అద్దం పట్టింది. మూడోవ్యక్తి ప్రమేయంతో మధ్యతరగతి కుటుంబాల్లో తలెత్తే మనస్పర్థలను అతివాస్తవికంగా 'కృష్ణపక్షం'లో బి.ఆర్. రంగారెడ్డి చిత్రించారు. ప్రజాపోరాటాల ద్వారానే సామాజిక వ్యవస్థలోని లోటుపాట్లను సరిదిద్దాలని యం. సంజీవి 'సమాధానం కావాలి'లో బోధిస్తారు. గ్రామీణ జీవనాన్ని కలుషితం చేస్తున్న పెద్దమనుషుల ఆటపట్టించాలంటే ప్రజలు చైతన్యం కాక తప్పదని చెప్పే నాటకం పి.వి. రమణ 'చలిచీమలు'. దివ్య ప్రభాకర్ 'వేటకుక్కలు' ప్రజాస్వామ్యం ముసుగులో పత్రికా స్వాతంత్ర్యానికి, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ఏర్పడుతున్న అవరోధాల్ని భంగపాటును ఎండగట్టింది.

యువతరం అలసత్వం వదిలి గ్రామాభివృద్ధికి పాటుపడాలని, ఆధిపత్యం కోసం పాకులాడే కుళ్ళు వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలని ఉద్బోధించే నాటకం వి.యస్. కామేశ్వరరావు 'ఈ మంటలార్పండి'. పీడితులంతా ఐక్యమైతే వారికి ఎదురులేదని చాటిచెప్పే నాటకం 'నీలి దీపాలు' కె. చిరంజీవి రాశారు. నేటి దేశ సాంఘిక రాజకీయ న్యాయవ్యవస్థకు సజీవ వ్యంగ్య రూపకల్పన దాడి వీరభద్రరావు 'రాజసూయ యాగం'లో కనిపిస్తుంది. బతుకు బరువుల బండిని ఒంటిచేత్తో ఈడ్చుకొస్తున్న మధ్యతరగతి కథ 'ఒంటెద్దు బండి'. ఎల్.బి. శ్రీరామ్ రాసిన నాటకమిది.

అరవేటి శ్రీనివాసులు 'ఈ కథ మార్చండి' నాటకం రక్తపాతంతో గాకుండా, ఆలోచనలతో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రయోగాత్మకంగా చెప్పిన రచన. దేశాన్ని గృహంగా సంక్షిప్తీకరించి, నేటి వ్యవస్థలోని విభిన్న వర్గాలను పాత్రలుగా ప్రతీకపరిచి పరస్పరం సంఘర్షించుకునేట్లుగా ఈ 'అంఅః' నాటకంలో అనంత హృదయరాజ్ చిత్రీకరించిన తీరు ప్రశంసనీయం. కులంలో పుట్టినంత మాత్రాన బ్రాహ్మడు వాడు. చిత్తశుద్ధి, సదాచారము, వివేకము, విశ్వశ్రేయస్సూ కోరుకునేవాడే బ్రాహ్మడని విరియాల లక్ష్మీపతి 'పంచమవేదం'లో నిర్ధారిస్తున్నారు.

పాటిబండ్ల ఆనందరావు 'నిషిద్ధాక్షరి' నాటకంలో అస్పృశ్యతకు మూలమైన ఈ కులవ్యవస్థను రూపుమాపాలని, కులవ్యవస్థను పెంచి పోషించే ఆర్థిక అసమానతల్ని కూలదోసి, కులరహిత సమసమాజ స్థాపనకోసం పూనుకోవాలని పిలుపునిస్తారు. వర్తమాన సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే ఏ పోరాటమైనా చిరకాలం నిలుస్తుంది. 'బొమ్మలాట' కూడా దీనికి మినహాయింపు కాదని నడిమింటి నరసింగరావు చెబుతారు. జానపద గేయగాథల్లో చోటుచేసుకున్న ప్రజావీరుడు 'సర్దార్



**పాటిబండ్ల ఆనందరావు**

పాపన్న' వీరోచిత గాథను పంపన సూర్యనారాయణగారు నాటకంగా మలిచారు.

ఆరవ సంకలనంలో 1990 నుండి 2019 వరకు వచ్చిన నాటకాలు వున్నాయి. అట్టాడ అప్పలనాయుడు "మడిసెక్క" నాటకంలో డొక్కలెండి నోళ్ళు, రెక్కలిరిగినోళ్ళు, మడిసెక్కలు పోయినోళ్ళు ఏకమైతే భూస్వాముల దురాగతాలు సాగవని చెబుతారు. కుటుంబాలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా నాటక కళాకారులు తమ సిద్ధాంతాలకే కట్టుబడి వుంటారని అనగా ప్రజలవైపుకే వుంటారని శిష్ట్లా చంద్రశేఖర్ "భువనఘోష" తెలియజేస్తుంది.

భారత ఇతిహాసంలోని కథకు ఆధునిక రూపమిచ్చిన హాస్య, వ్యంగ్య నాటకం 'బకాసుర'. ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు రాసిన ఈ కథను ఎస్. తారకరామారావు నాటకీకరణ జేశారు. కఠోరమైన జీవిత వాస్తవాన్ని హాస్యపు పూతను అద్ది అందించిన చేదు మాత్ర. రెండు గంటల నాన్‌స్టాప్ నాటకానికి నాన్‌స్టాప్ నవ్వు శంకరమంచి పార్థసారథి 'దొంగల బండి'. బాల్యంలో తండ్రి మీద, యౌవనంలో భర్త మీద, వృద్ధాప్యంలో సంతానం మీద ఆధారపడుతూ అగచాట్లు, అవమానాలు భరిస్తున్న స్త్రీ సమాజానికి సమర్పిస్తున్న 'శ్వేతపత్రం' మార్గదర్శిది. ప్రతి వ్యక్తీ వాడి హక్కులూ, బాధ్యతలూ తెలిసి ప్రవర్తిస్తే ఆరోగ్యవంతమైన వ్యవస్థకు పునాదులు వేస్తాయన్న ఆశావాద దృక్పథం, వ్యక్తిగత హింస సమస్యకు పరిష్కారం కాదని వెల్లడించే నాటకం 'పులి మళ్ళీ వస్తుందా?' ఇది శ్రీశైలమూర్తి రచన.

దళితులు చేజిక్కిన అధికారాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ పెత్తందార్ల, భూస్వాముల వ్యవస్థను పడగొట్టాలి. పాలనా పగ్గాలను చేజిక్కించుకోవాలి అని ప్రబోధించే నాటకం డి. విజయభాస్కర్ గారి 'కుర్చీ'. మధ్యతరగతి జీవిత వాస్తవికతకు ప్రతిబింబం ఆకెళ్ళ శివప్రసాద్ 'నరవాహనం' నిస్వార్థ రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన త్యాగమూర్తి 'ప్రజా నాయకుడు ప్రకాశం' జీవిత విశేషాలను మొదలి నాగభూషణ శర్మ నాటకంగా మలిచారు. కన్నవాళ్ళు సంతానం బరువు బాధ్యతల్ని బ్రతికినంతకాలం తలకెత్తుకోవాల్సిందేనా? అని వల్లూరు శివప్రసాద్ 'వానప్రస్థం'లో ప్రశ్నిస్తారు.

యుగకర్త, సంఘసంస్కర్త, సాహితీవేత్త, తెలుగుజాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగంను 'వైతాళికుడు'గా కొనియాడుతూ వాడ్రేవు సుందరరావు నాటకంగా రాశారు. పల్నాటి కన్నెగంటి హనుమంతు పుల్లరి పోరాట చరిత్రను 'వీరగంధం' నాటకంగా మలచినవారు దేవి. ఆకెళ్ళ రాసిన 'మీ ఇల్లెక్కడ?' మనిషి చావు చుట్టూ అల్లుకున్న మూఢ విశ్వాసాలు, మూఢాచారాలను ఎండగడుతుంది. మానవ వనరుల విధ్వంసాన్ని, రైతుల దోపిడిని అడ్డుకోవడానికి రైతులు సంఘటితం కావాలని చాటిచెప్పిన నాటకం కందిమళ్ళ సాంబశివరావు గారి "సైసై జోడెడ్ల బండి". భార్యాభర్తల మధ్య డబ్బు అవసరాలు తీరుస్తుంటే తప్ప అదే అవసరంగా వుండదని 'ఇక్కడ కాసేపు ఆగుదాం'లో భాస్కర చన్ద్ర చెబుతారు.

కన్నవాళ్ళు ఇరుకు గదుల్లో వుండొచ్చు గాని, పిల్లల గుండె గదులు ఇరుకైతే వుండలేరని 'జీవితార్థం'లో కాపూరి సత్యనారాయణ తెలియజేస్తారు. దురాచారాలకు బలవుతున్న స్త్రీలు తెగింపుతో తమ జీవితాలను చక్కదిద్దుకోవాలనీ, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి ముందడుగు వేయాలని 'తెగారం'లో పెద్దింటి అశోక్ కుమార్ బోధిస్తారు. రాయలసీమ దాత బుడ్డా వెంగళరెడ్డి జీవితచరిత్ర ఆధారంగా, అదే పేరుతో యస్.డి.వి. అజీజ్ రాసిన నాటకం ఇందులో వుంది. ముసలి తల్లిదండ్రులను పట్టించుకోని 'కన్నబిడ్డల' కాఠిన్యాన్ని అరవై ఏళ్ళ క్రితమే గిడుతూరి సూర్యం హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించారు.

తెలుగునాట సంభవించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మార్పులు ప్రజాజీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయో, వాటివల్ల వారి జీవితంలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ఈ నాటకాలు వివరిస్తాయి. ఇందులో వున్న జానపద ప్రజావీరులు, జాతీయ నాయకులు, త్యాగమూర్తుల జీవితాలను చిత్రీకరించిన నాటకాలు యువతరానికి ప్రేరణగా నిలుస్తాయి. భారతదేశ స్వాతంత్ర్యం- దాని ఆవశ్యకతను తెలియజేస్తూ తొలిదశలో నాటకాలు వచ్చాయి.

స్వాతంత్ర్యం వచ్చినా తెల్లదొరల స్థానంలో నల్ల దొరలు వచ్చారనీ, సామాన్యుడి పరిస్థితి ఏమీ మారలేదని తెలియజేస్తూ తర్వాత దశలో మరికొన్ని నాటకాలు వచ్చాయి. అవిద్య, అజ్ఞానం వల్ల పెరిగిన మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలను ఖండిస్తూ హేతువాద, శాస్త్రీయ దృక్పథం వైపుకు మళ్ళించిన నాటకాలు మరికొన్ని. మంచితనం త్యాగనిరతి, ఆదర్శవాద ధోరణులతో వచ్చిన నాటకాలు కూడా వున్నాయి. వీర, శాంత, కరుణ రసాలే కాదు హాస్యరసానికి పెద్దపీట వేసిన నాటకాలు బోలెడున్నాయి. భాషాపరంగా చూస్తే గ్రాంథిక, సులభ గ్రాంథిక, వ్యవహార, పాత్రోచిత మాండలికం, పూర్తి మాండలికంతో వచ్చిన నాటకాలున్నాయి. ప్రయోగాలపరంగా విజయం సాధించిన నాటకాల ప్రస్తావన కూడా ఇందులో వుంది.

మొత్తానికి 140 ఏళ్ళ తెలుగు నాటకరంగ చరిత్ర, నాటకాల క్రమ వికాస పరిణామాన్ని తెలుసుకోవడానికి ఈ సంకలనాలు ఉపకరిస్తాయి. వేలాది నాటకాలను క్షుణ్ణంగా పరిశీలించి అందులోంచి వంద ఉత్తమ నాటకాలను ఎంపిక చేయడం, వాటిని ఆరు సంకలనాలుగా విభజించి వెలువరించ డంలో వల్లూరు శివప్రసాద్, గంగోత్రి సాయిల కృషి అభినందనీయం.

కథ

# కాకి ఎత్తుకు పోయింది!

గూడు చెదిరిన యువకుని వ్యథ...



పిన్నంశెట్టి కిషన్
9700230310

వేములవాడకు ఎప్పుడు పోయినా ముందు చందు (చంద్రకాంత్)కు కాల్ చేస్త. బస్ దిగే సమయానికి, బస్ స్టాండ్ల ఎదురు చూస్తూ ఉంటడు. తిరిగి వచ్చేప్పుడూ అంతే, వాడే తోడు. 'ఎందుకురా!' అంటే వినడు. పోయిన కాడినించి వచ్చేదాంక, కలిసేవున్నం అనే భావన వల్లేమో! నేనూ ఖచ్చితంగా వద్దన లేను. పోనీ, టు వీలర్ మీద తీసుకు పోవడానికి వస్తాడా అంటే అదీ కాదు. నడిచే వస్తడు. ఊరంతా నడిచే తిరుగుతడు.

ఇప్పుడంటే ఇంటింటికీ బండ్లేనాయే! చిన్ననాట ఒకటీ అర ఉండేవి. సైకిల్ పై పోవడమే మా గొప్ప! నడిచి వెళ్లడమే ఎటయినా! అగ్రహారం, నాంపెల్లి గుట్ట, కొనాయిపల్లి, లక్ష్మీపురం... ఓ రథ పౌర్ణమికయితే, సిరిసిల్లకు సుత నడుసుకుంటనే పోయినం.

అలా జ్ఞాపకాల ఊయల లూగీ.. ఊగి.. కన్నంటుకుంది ఎపుడో! తెలివి అయ్యే సరికి సిరిసిల్లల వున్న. మంచి నీళ్ల బాటిల్ బ్యాగుల కెల్లి తీసి గడగడ తాగిన. చందుకు ఫోన్ చేస్తే ఎంగేజ్ రావట్టింది.

విండోలోంచి బస్టాండ్ పరిసరాల్ని గమనిస్తున్న... ఇంటర్ మీడియట్ ఇక్కడి గవర్నమెంట్ కాలేజీలోనే చదివింది. రెండేళ్లు, బస్సుల్లో వచ్చి పోయేవాళ్ళం. లంచ్ బ్రేక్లో ప్రతాప చంద్రశేఖర్, చిట్టిమల్ల అనంతరాములు, కొట్టె దేవదాస్, కూర రమేష్లతో బస్టాండ్ వరకు ఆటవిడుపుగా నడిచివచ్చే వాళ్ళం. అడపాదడపా అరటి పండ్లు తినడం, లేకపోతే ఉడిపి హోటల్ల నీళ్లే గతి. రోడ్ పక్కన హోటల్లో water with fingers నుండి purified water తాగే వరకు, ఎంతటి జీవన ప్రయాణం చేయాల్సి వచ్చింది!...

చందు నుండి call back ring వచ్చింది. 'సిరిసిల్లల ఉన్నా'నన్న.

నా విండో వీక్షణం అలా కొనసాగుతూ ఉండగా... అగ్రహారం కొండలు కరిగి, రాళ్లయి లారీలకు ఎక్కుతున్న విధ్వంసక విషాద దృశ్యం. గుండెను స్టోన్ క్రషింగ్ మిషన్లో వేసి తిప్పుతున్న తీరు, వెన్నంటి వెంటాడుతూ ఉంటే వేములవాడ చేరిన. రెడీగా కనిపించిండు చందు. దిగి, వాడ్ని అలుముకుంటే గానీ విషాదం అలుముకున్న మనసు తిరంగాలేదు.

ఎప్పుడైనా ముచ్చట్లు పెట్టుకుంట, నడిచేటోళ్ళం. చేతిలో లగేజీ ఉందని, షేరింగ్ ఆటో ఎక్కినం.

సీట్లో సర్దుకుంటూ, "శెఫిక్ (హయత్ ఖాన్) వచ్చిండారా!" అన్న.

"నామాల రాజేందర్ గాని లాడ్జీల ఉన్నడు."

ఆశ్చర్యంగా "లాడ్జింగ్ ఎందిరా!" అన్న.

"ఇల్లు అమ్ముకున్న సంగతి తెల్వదా?"

వాడిచ్చిన షాక్ నుండి తేరుకోలేక, గొంతు తడారిపోంగ, పొడిపొడిగా "లేదు. చెప్పలే!" అన్న.

సౌదీకి తిరిగి పోనని నిర్ణయించుకుని శెఫిక్ ఇండియా వచ్చినంక, మేం ముగ్గురం కలవలేదు. నేను వేములవాడకు వస్తున్నానంటే "నిజాంబాద్ల వున్న, వస్తా" నన్నాడు. ఇంటి సంగతి, ఊరు విడిచి నిజామాబాదుల ఉంటున్నదీ, చెప్పలేదు. చెప్పడానికి ఏం ఉందనో! చెప్పలేదు.

పొద్దుగూకే వేళకి ప్రకృతి మొత్తం గూటి వైపే చూస్తుంది. అంతిమ గమ్యం నివాసమే! మనిషి సైతం దినమంతా ఏ దూరాన ఉన్నా రాత్రి తీరం చేరాల్సిందే. సొంతమో! కిరాయో! ఉండటానికి ఓ ఇల్లంటూ చెప్పుకోడానికి ఓ చిరునామా అంటూ ఉండాలి. లేనివాళ్లు...! లేనివాళ్లు ఇప్పటికీ ఉండడం నాగరిక సమాజం సిగ్గు పడాల్సిన విషయం. పడుతుందా? పడేనా ఎప్పటికయినా!

* * *

ఆటో పెద్ద గుడి కాడికి వచ్చింది. ఎవరో యవ్వనవతి.. వివాహిత.. యవ్వన సహిత వివాహిత! వడ్డెర చండీదాస్ 'గంగి'లా ఆమె.. ఆటో ఆపింది. తను ఎక్కబోతుంటే... ఆమెకు ఇబ్బంది కలగొద్దని, చందు దిగి డ్రైవర్ పక్కన కూర్చున్నడు. పానుగంటివాళ్ల ఇంటికాడికి

కథ

పోంగనే ఆటో ఆపి దిగి, పైటకొంగు పక్కకు జరిపి, పర్సు తీసి, పది రూపాయల నోటు డ్రైవర్ చేతిలో పెట్టి, ధిక్కారపు నడకతో కనుదోయి దాటి వెళ్ళిపోయింది. తిప్పికొడితే, రెండు ఫర్లాంగుల దూరం ఉండదు దారి. నడక మరిచిన నగరం. శారీరక శ్రమ సోయి లేదు! పైసలపట్ల ఫికర్ లేదు!

పోచమ్మ గుడి మలుపు తిరుగంగనే ట్రాఫిక్ జాం.

'ఇక్కడ కూడానా!''

"అవును, ఇక్కడ కూడా!! ఇంటికోటి కాదు, మనిషి మనిషికీ వాహనం... పెరిగిన వలస వాసులు... యాత్రికులు. పెరగని దారులు. భూమి పుట్టినప్పుడు వేసినవి ఈడ పుట్టిన గరీబోడి బతుకులా మార్పు లేనివి!" వాడి గొంతులో వాస్తవిక విషాద బాధావేశం. దేన్నీ చూడని దృష్టిని బయటికి సారించి, చెప్పుకు పోతున్నాడు.

ఇంతట్ల, ఇల్లు వచ్చింది. ఇద్దరం దిగినం.

"సాయంత్రం కలుస్తారా!" అంటూ వాడు వెళ్లిపోయిండు.

నేను గేట్ తీసుకొని లోపలికి నడిచిన.

సప్పుడు విని అమ్మ "కిషన్నాంటూ" ఎదురొచ్చింది.

వంగి, కాళ్ళు మొక్కుతుంటే "నడుమునొప్పితో ఎందుకు లేరా"ని... "పానం ఎట్లుంది బిడ్డా"ని అంటుంటే లేచి, 'నువ్వెట్లున్న'వన్న. "మంచిగున్న" అంది.

ఎక్కడ మేం బాధపడుతామోనని ఎంత చేత గాకున్న తానెప్పుడూ బాగులేనని చెప్పదు. ఒంటి గంట దాక మాట్లాడుకుంట, తిన్నం. పడుకుంటానని మంచం ఎక్కిన. కనురెప్పలయితే మూయగలం, ఆలోచనల్ను ఎలా కమ్మిపెట్టేది!? బలవంతంగ కమ్మినా 'కొక్కరో కో' అని గుండె గంపలోంచి కూస్తూనే ఉంది.

★ ★ ★

షెఫీక్ ఎన్ని కలలు కన్నడు, సొంత ఇంటి కోసం! పుట్టిన ఊర్లో కిరాయి ఇండ్ల పంచన పడి, ఎన్ని ఏండ్లు గడిపిండ్రు! సౌదీ పోయినప్పటి నుండి ఒకటే ధ్యాస,



ఇల్లు కట్టుకోవాలని. బ్లాక్ ఆఫీసు వెనుక జాగ కొనడం దగ్గరి నుండి అన్ని విషయాలు నాతో పంచుకునే వాడు.

'ఇంటి ప్లాన్ సౌదీల గీయించ్చుకు వచ్చిన అన్నా'' అంటూ నక్ష చూపించిండు. "ముగ్గురు అన్నదమ్ములకు, అమ్మ-బాపులకు తలా ఒక బెడ్ రూమ్, పెద్ద డైనింగ్ హాల్, సిటౌట్" వివరించిండు. ఖర్చు ఎంత అవుతుంది, ఎలా మేనేజ్ చేస్తుంది, ప్రతిదీ పూస గుచ్చినట్లు చెప్పిండు.

తమకంటూ ఓ గూడు ఏర్పడుతుందని, ఆ గొంతులో ఎంత ఆరాటం! ఎంత ఆనందం! ఇప్పుడు... ఆవిరైన మేఘపు బతుకు! ఎలా ఉండి ఉంటాడు!? ఇల్లు లేనితనాన్ని ఎలా తట్టుకుంటున్నాడు!? దీర్ఘ నిశ్వాస, ఓ కన్నీటి చుక్క మిత్రులై జమిలిగా...

షెఫిక్ సంగతి అలా ఉంటే, చందు గాడు...! వీనికి సొంత ఇల్లు ఉంది. ముందు కొంత పడిపోయిన ప్రహరీ గోడతో ఉండేది. రాళ్లతో కొంత కవర్ చేసినా రోడ్డు మీది ఇల్లాయె! దారిల వచ్చిపోయేటోళ్లకు, ఇంటి ముందర అంతా కనిపించేది.

పెద్ద బడిల శేరిక్ అయినంక, "దోస్తులు ఇంటి ముందరికేళ్ళి పోన్గ-రాంగ ఇజ్జత్ అనిపిస్తుంది రా, ఎట్లైనా ఇల్లు కట్టుకోవా''లని అనేటోడు.

అది వాడి జీవితాశయం అయింది. మా ఇంటర్ మీడియేట్ అయిపోంగనే కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో డిగ్రీ చదవడానికి నేను పోవడం... వాడు చదువు మానేసి, సంపాదనలో పడిపోవడం... జరిగింది.

మూడేళ్ల కాలం తిరిగే లోపు, చందు పాత ఇల్లు కూలగొట్టి నాలుగు దుకాణాలు కట్టిండు. వాటి వెనుక జాగలో ఉండేడిది.

ఆ విజయ సాధన ఆనందం అకాలంగా ఆవిరైపోయింది. తండ్రీ, తల్లీ ఒకరి తరువాత ఒకరు తరలిపోవడం... అన్నదమ్ముల మధ్యన ఆస్తి గొడవ... వద్దని వారిస్తున్నా వినకుండా, ప్రభాకరన్న షాపులు తెగనమ్ముకుని బతుకు వెతుకులాటలో హైద్రాబాద్ పోవడం, రోడ్ వైడనింగ్ పుకార్ల చెక్కర్లలో పడి... ధరలు పడి, తప్పని దుస్థితిలో తాను తక్కువ ధరకే అమ్ముకోవడం. అప్పటి నుండి కిరాయి కొంపల్లోనే జీవనం. 'కూనల్ని పట్టుకోని ఏడేడు ఇండ్లు తిరిగే పిల్లితల్లి లెక్క', ఎన్ని ఇళ్ళు మారిండని!?

★ ★ ★

ఉండే నీడ కోసం, ఎక్కడైనా ఇంత స్థలం కొందామంటే రేట్లకు రెక్కలొచ్చి, అందనంత ఎత్తులో ఎగురవట్టె! ఏం మాయ ఇది. భూమాతకూ అంతుచిక్కని రియలెస్టేట్ లెక్కలు... చిక్కులు... బొక్కలు.

బయటి నుండి వచ్చినోడు బరి అవుతుంటే, చెత్త మీద చెత్త పడ్డట్టు బంగ్లల మీద బంగ్లలు కడుతుంటే, అవసరాలకు మించి ఆస్తులు పోగేసుకుంటుంటే ఈడ పుట్టి ఈడ పెరిగినోడు, తట్ట బుట్ట సర్దుకొని, పొట్ట చేత పట్టుకోని యాడికో పోవట్టె!

మాయదారి మనుగడ మర్మమేదో విప్పి చెప్పే వాడెవ్వడు? గూడు గోడు వినే నాథుడెవ్వడు?

సంపద చుట్టూ తిరిగే మానవ సంబంధాల్లో విలువలకు విలువుండదు, నెలవుండదు. 'ఆత్మీయ' ఆస్థి తగాదాలు అనుభవంలోకి వచ్చేలోపు, కొండల్ని తొలుచుకు వెళ్ళగా కరిగి మిగిలిన ఆనవాళ్ళ మౌతాం.

రెండు చేతులా సంపాదించిన మిత్రులు ఇద్దరూ నేడు రిక్త హస్తాలతో, నాలుగు రోడ్ల కూడలిలో!... back to square one స్థితి గమనంలో ఇంకెందరో!

కవిత

# అలసట



పొన్నం రవిచంద్ర, 9440077499

ఎప్పుడో అయితే సరే గానీ
తరుచూ అవే చేదు అనుభవాలు ఎదురవుతుంటే,
ఈ శరీరమూ, ఈ మనసూ
సాంద్రంగా అలసిపోతున్నాయి.....
కఠిన పరిణామాల్లో ఇక మార్పు మృగ్యం అని
ఎప్పటికప్పుడు తేలిపోతుంటే,
బతుకు పొడవునా
గాయాలూ, ఘర్షణలూ తప్పవనే
ఆలోచన నిరాశను బలపరుస్తున్నది....
అవును....
ఈ జీవితం అంత గొప్పదేమీ కాదనిపిస్తుంది.
జీవితానికి దూరంగా ఎటైనా వెళ్లిపోవాలనిపిస్తుంది.
ఆశా భోంస్లే గొంతులో ఆవేదన భరితమైన..
"తంగ్ ఆ చుకే హై కశ్మకశే జిందగీ సే హమ్
ఠుక్రా న దే జహాఁ కో కహీ బే దిలీ సే హమ్ తంగ్ ఆ చుకే"
పాట వింటుంటే..
హృదయ జ్వాలలే కనిపిస్తున్నాయి.
జీవితపు పెనుగులాటలో అలిసిపోయిన నేను
బంధాల మీదున్న నమ్మకాల్ని విరిచేస్తూ
నిరాసక్త హృదయంతో ఈ లోకాన్నే తృణీకరిస్తానో ఏమో....!?



# గట్టి విత్తనం!



కరిపె రాజ్ కుమార్, 8125144729



ఏ విత్తు పాతితే
ఆ మొక్క మొలుస్తుంది!
విత్తనం గట్టిదైతే
కలకాలం నిలుస్తుంది!!

వ్యసనాల వాసనలు సోకకుండా
చమురు వత్తి అర్ధాంతరంగా ఆరిపోకుండా!
అరచేతులు ప్రాకారమై పరిరక్షిస్తే
ఆజన్మాంతం వెలుగు పూలు పూస్తుంది!!

సంఘంతో మమేకమై
సమాజంతో శ్వాసిస్తూ
సమసమాజ లోకాన్ని సృష్టిస్తుంది!
సాంస్కృతిక చిహ్నమై భాసిస్తుంది!!

బాల్యంలో నడచివచ్చిన బాటలు బంగారు దారులై
బ్రతుకంతా చైతన్యం వెల్లివిరుస్తుంది!
పటిష్ట పునాదులు కలిగిన భవంతి
పదికాలాలపాటు పరిఢవిల్లుతుంది!!

జడత్వం నుంచి జాగృతి దిశగా పయనించి!
జాతి మనుగడను శాసిస్తుంది!!



## కవిత్వానికి పట్టాభిషేకం
# సీమస్ హీనీకి నోబెల్ పురస్కారం

సీమస్ హీనీ ఒక సుప్రసిద్ధ ఐరిష్ కవి, నాటక రచయిత, ఐరిష్ కవుల్లో డబ్ల్యూబీ యీట్స్ తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన హీనీకి 1995లో సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. హీనీ 1939, ఏప్రిల్ 13న ఐర్లాండ్ లోని కౌంట్ డెర్రీ ప్రాంతంలో మైనార్టీ క్యాథలిక్ కుటుంబంలో జన్మించాడు. 1960 నుంచి రచనలు ప్రారంభించాడు. 1960లో 'పదకొండు కవితలు' పేరిట తన తొలి కవితా సంపుటి విడుదల చేశారు. 1966లో విడుదల చేసిన 'డెత్ ఆఫ్ ఏ నేచురలిస్ట్' ఆయనకు ఇంగ్లీష్ సాహిత్యంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చింది. 'డోర్ ఇన్‌టు ది డార్క్', 'స్టేషనస్', 'ఫీల్డ్‌వర్క్', 'స్టేషను ఐలాండ్', ది హా లాంటెర్న్', 'సీయింగ్ థింగ్స్', 'ది స్పిరిట్ లెవెల్', 'ఎలక్ట్రిక్ లైట్', 'డిస్ట్రిక్ట్ అండ్ సర్కిల్', 'హ్యూమన్ చెయిన్' వంటి కవితా సంపుటాలు, 'ది క్యూర్ ఎట్ ట్రాయ్', 'ది బరియల్ ఆఫ్ థేబ్స్' వంటి నాటకాలు, అనువాద రచనలు హీనీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయి. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, కాలిఫోర్నియా వర్సిటీల్లో కొంతకాలం అధ్యాపకునిగా పనిచేశారు. 2013 ఆగస్టు 30న డబ్లిన్‌లో కన్నుమూశారు

## జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత (1994), కన్నడ కథా సామ్రాట్
# ఉడిపి రాజగోపాలచార్య అనంతమూర్తి



కన్నడ సాహిత్యరంగంలో జ్ఞానపీఠ అవార్డు పొందిన ఎనిమిది మంది కన్నడ సాహితి వేత్తలలో ఉడిపి రాజగోపాలచార్య అనంతమూర్తి (డిసెంబరు 21, 1932 - ఆగష్టు 22, 2014) ఆరవవాడు. రచయిత, సాహిత్య విమర్శకుడు. ముక్కుసూటిగా తన మనస్సులోని భావాన్ని వ్యక్తపరచే వ్యక్తిత్వమున్నవాడు. అనంత మూర్తి 1955 లో విడుదలచేసిన ఎందెందు ముగియద కతె కథా సంకలనం ద్వారా ఆయన సాహిత్యకృషి మొదలైనది. మౌని, ప్రశ్నె, ఆకాశ మత్తు బెక్కు-అనంతమూర్తి యొక్క ఇతర కథా సంకలనాలు. ఈ మూడు కథలను కలిగిన మూరు దశకద కథెగళు అనే సంక్షిప్త కథా సంపుటం 1989 లో ప్రకటితమైనది. ఇతడు 2002లో తుమకూరులో జరిగిన 69వ కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించాడు. ఆయనకు పేరుతెచ్చిన మరిన్ని రచనలు "సంస్కార", "భారతీపుర" , "అవస్థె" (1978), "భవ"(1994) అనే కథాసంకలనాలు. ఇతడు 1974లో విడుదలై కన్నడ భాషలో జాతీయ ఉత్తమ ప్రాంతీయ భాషా చిత్రంగా ఎంపికైన కంకణ సినిమాకు స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూర్చాడు. సంస్కార, ఘటశ్రాద్ధ, బర చిత్రాలకు ఉత్తమ కథా రచయితగా ప్రశంసలు అందుకున్నాడు. 1983లో కర్నాటక సాహిత్య అకాడమీ పురస్కారం, 1992 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1994 లో మాస్తి పురస్కారంతో అనంతమూర్తిని గౌరవించడమైనది. 1994లో ఆయన్ను భారతదేశంలో అత్యుత్తమ సాహిత్య గౌరవమైన జ్ఞానపీఠ అవార్డుతో సత్కరించారు. 2014, ఆగష్టు 22 న అనారోగ్యంతో కన్నుమూశారు

పుస్తక పరిచయం

# అమలిన శృంగార వర్ణనం.. ఈ 'ఆనందవర్ధనం'

సౌందర్య దృక్పథం చాటిన వ్యాసం...



కటుకోజ్వల మనోహరాచారి
9441023599

ఆధునిక కవిత్వం కొత్తపుంతలు తొక్కుతున్న ఈరోజుల్లో లోతైన భావకవిత్వాన్ని.. అందునా ప్రణయ కవిత్వాన్ని హృద్యంగా పండించిన కవి స్తంభంకాడి గంగాధర్. ఆయన ఇటీవల వెలువరించిన కవితా సంపుటి 'ఆనందవర్ధనం'.

పుస్తకం ఇటీవల వెలువరించినా.. అందులోని కవితలు మాత్రం దాదాపు మూడుపదుల వయస్సు కలవి. అందుకే సాంప్రదాయతను పొదవిపుచ్చుకొన్న భావాత్మక కవితా వాక్యాలతో నిర్మితమైన సిసలైన కవితలుగా గోచరిస్తాయి. ఆధునికంగా వెలువడుతున్న నూతన ప్రక్రియల వాసనలు ఏమాత్రం పొడసూపని ఆనాటి భావసంపద కవిత్వంలో ఆద్యంతం కనిపిస్తుంది.

ఈమధ్యకాలంలో ఎన్నో కవితా సంపుటుల్ని చూశాం కానీ.. ఇంత గాఢత ఉన్న కవిత్వాన్ని చూసి ఉండరు. అందునా.. ఒక ప్రణయ రాగలహరిని మోగించి, హృదయ సవ్వడులను వినిపించేంత సున్నితమైన ఆత్మాశ్రయ కవిత్వాన్ని ఇటీవలి కాలంలో ఎరిగి ఉండరు.

అర్థ శతాబ్దం క్రితం కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావుల్లోని ప్రణయం ఇందులోని ప్రతి కవితలో కనిపించడం వెనుక కవి హృదయంలో తిష్ట వేసుకున్న



ప్రణయ సుందరి ప్రభావమేనని స్పష్టంగా తెలుస్తుంది. అంటే.. కౌమారం నుండి యవ్వనంలోకి ప్రవేశిస్తున్నప్పుడు ప్రతి యువకుడిలోనూ ప్రణయ భావనలు కలుగడం సహజమే అయినా అందరూ వాటిని అక్షరబద్ధం చేయలేరు. చేసినా ఇంత ముగ్ధంగా, స్నిగ్ధంగా పదాలను పొదవిపట్టి జాలువార్చలేరు.

గంగాధర్ హృదయ మందిరంలో సుస్థిర స్థానం పొందిన ఆ ప్రణయదేవత ఎవరైనా కావచ్చు. ఆమెనే ఆరాధించి, ఆమె కోసమే పరితపించి, ఆమె గురించి ఊహాపోహల్లోకొచ్చిన ప్రతి భావననూ అక్షరీకరించి పొందికైన కవిత్వాన్ని జాలువార్చాడు. వాటి సమాహారమే ఈ ఆనందవర్ధనం కవితాసంపుటి.

కవిలోని గాఢమైన ప్రేమభావన అణువణువునూ సృజించినా.. ఎక్కడా హద్దులు దాటని అమలిన శృంగారాన్నే ఒలకబోసాడు. పుస్తకంలోని ప్రతి కవితావాక్యం కవిలోని గాఢమైన ప్రేమ భావనను మనసుకు కడుతుంది. పాఠకుని మనోఫుటల్ని తాకి పులకింపజేస్తుంది.

'సూర్యకిరణం సముద్రంతో రమిస్తే/ మేఘం జనించినట్లు/నా భావం భాషతో రమించి/కవిత్వాన్ని ప్రసవిస్తుంది' అని తన భాష, భావనలోని ప్రత్యేకతను చాటాడు. 'అక్షరరూపం దాల్చే/నా భావనలు/ఎగిరే కపోతాలు/మరకత మణులు/ప్రజ్వరిల్లే ప్రభాత జ్యోతులు..' అని దేవరకొండ బాలగంగాధర తిలక్ లా అక్షరాల మీద తన సాధికారతను ప్రకటించాడు.

అయితే.. కవి కవిత్వానికి ప్రేరణ అయిన ప్రణయ సుందరి గురించి ఆలోచిస్తే.. ఆమె 'కలల లోకంలో/ కడలితీరంలో/నువ్వున్నప్పుడు కంటిచూపులతో /నువ్వు లేనప్పుడు ఎదురు చూపులతో' గడుపుతాననడం ఆమె ఊహా సుందరి కాదని స్పష్టం చేస్తుంది.

కాకుంటే... ఆమెను గాఢంగా ఆరాధిస్తూ.. అందీ అదని స్థితిలో ఉన్న ఆమెను ఎక్కువగా కలల్లో

దర్శిస్తున్నాడనవచ్చు. కనిపించినప్పుడు కళ్లనిండా చూసుకోవడం, కనిపించనప్పుడు ఎదురుచూపులతో గడపడం ఒకరకమైన విరహమే!

'నువ్వు పువ్వై/నేను తుమ్మెదై/మన ప్రేమ మధువై' అని 'నువ్వు జననమై/ నేను జీవమై/మన ప్రేమ అమరమై' అని తన ప్రేమలోని గాఢతను చూపుతున్నాడు. ఎక్కడో తను కనిపించి ఉంటుంది. అప్పుడప్పుడూ కలల్లో వస్తుంటుంది. ఆమె ఎవరో పూర్తిగా తెలియదనుకుంటా. అందుకే 'నాహృదయంలో విహరిస్తూ/విరహాగ్ని సృష్టిస్తున్న/ నువ్వెవరు?' అనికూడా ప్రశ్నిస్తున్నాడు.

అప్పటికప్పుడు మనసు చెదురుతుంది. అప్పుడు 'నేను భయపడి/నా హృదయం సిగ్గుపడి/లౌకిక ప్రపంచం లోకి/ నన్ను నేను తిప్పుకొన్నప్పుడు/మళ్లీ నా మనసు/చేస్తుందొక వికటాట్టహాసం/నా బాహ్య మానవుని పెదాలు విచ్చు కొంటాయి/తిరిగి చీకటి దారుల్లోకి/నా తిరోగమనం' అని అప్పుడే తనను తాను నిగ్రహించుకొన్నా ఆమె ఆలోచనలు మళ్లీ తనను విచిలితున్ని చేస్తాయంటాడు. ఏదేమైనా చివరకు తను ఉదాత్త లక్షణాల్నే ప్రదర్శిస్తాడు.

ఒక ఏకాంత సాయంత్రం ఆమె కనిపిస్తే- అతనిలోని 'స్వార్థం మూర్తీభవించిన మాలిన్య మానసం' ఆవేశపడింది. అదుపుతప్పాలంది. 'అయితేనేం/హిమశిఖరోన్నత వికాస వ్యక్తిత్వం/భీతిల్లక, తలవంచక/నిటారుగా నను నిలబెట్టింది' అని స్పష్టంగా.. తను వ్యక్తిత్వం కోల్పోలేదని, విలువల వలువలు విప్పలేదని.. తనలోని అమలిన శృంగార తత్వాన్ని చాటాడు.

ఎంత అమలిన తత్త్వమంటే 'జీవన పర్యంతం ఏకాంతంలో/నైతిక సమరం చేయడం తప్ప/నాకిక వేరే పోరాటమేమీ లేదు/రాగం నిండిన దేహానికి/అపశ్రుతుల ఆపేక్ష తప్పితే/సరస సాంగత్యమేమీ లేదు' అంటూ పూర్తి నైతికతకు పట్టం గట్టాడు కవి.

ఈ ప్రణయసుందరి ఎంతగా తన మదిని ఆక్రమించిందంటే.. ఆమె




ఆలోచనలతో 'నీ గురించి రాస్తుంటే/ ఆలోచనల్లో అమృతత్వం ఆవరిస్తుంది/ అక్షరాలు అనుక్షణం/నవ్యతను సంతరించుకొంటాయి/కవిత్వం వరదలా పొంగుతుంది' అన్న కవే.. ఒక్కోసారి భావ జడత్వం ఆవరిస్తుందనీ చెబుతాడు. 'పచ్చగడ్డి పరకలపై నిలిచిన/ మంచు ముత్యాల తలత్రాలు/దినకర తేజస్సుకు/ వెచ్చబడి ఆవిరైనట్లు/ఒక్కోసారి వ్రాయలేనితనం ఏర్పడుతుంది/ సృజన కరువై/మనసు బరువై పోతుంది' అంటాడు.

తన ప్రణయసుందరి ఎంత సౌందర్యవతో అలంకారయుతంగా చెబుతాడు. 'నీ వదనం చూస్తే/పున్నమి చంద్రుడు/ఈర్ష్య పడతాడు/నీ నవ్వు చూస్తే/వికసిత పద్మం/ముడుచు కొంటుంది...' అంటూ అనేక ఉపమానాల తోటి తాద్రూప వ్యంగ్యంలో చెబుతాడు.

పదాల పొందికలో గానీ, శబ్ద, అర్థాలంకార వినియోగంలో గానీ తలపండిన భావకవులకు తీసిపోని కవిత్వం స్తంభంకాడి గంగాధర్ ది. 'నాకైతే ఏకాంతం/జాబిలిలేని పున్నమిలా/పున్నమి తెలియని చీకటిలా/చీకటి తరగని ఉదయంలా /ఉదయం చూడని హృదయంలా/హృదయం వీడిన ప్రణయంలా/ప్రణయం పట్టని పరువంలా/పరువం తగ్గిన ప్రాణంలా' తోస్తుందని ముక్తపదగ్రస్తాలంకారంలో చెప్పిన తీరు అద్భుతం. 'నీ స్పర్శ ప్రభాత పవన వీచిక/నీ పలుకు వసంత కోకిల గీతిక/ నీ చూపు పున్నమి శశికిరణం/నీ ప్రేమ నా గుండెకు తోరణం..' వంటి పంక్తుల్లో రూపకాలు, అంత్యానుప్రాసలు అలవోకగా దొర్లిపోయాయి.

చేయితిరిగిన కవిలా భాషలోనూ, భావనలోనూ సమాసపద గుంఫనంలోనూ విశేషమైన పట్టుతో 'నువ్వేమో నాకందనంత దూరంలో/అచల చుంభిత నీరదావళికి అవతల/తమస్విని విచ్చిన్న తారాతీరపు గగనసీమలో/ కాంతులీనుతుంటావు..' అంటూ ప్రాచీన కవులకు తీసిపోని కవిత్వాన్ని అందించాడు గంగాధర్.

మొత్తంగా శృంగార రసంలో అమలినాన్ని చొప్పించి నాయికా నాయికల ప్రణయాన్ని పండించే చక్కని ప్రబంధ కావ్యాన్ని చదివిన భావన పాఠకలోకానికి కలిగిస్తుంది ఈ ఆనందవర్ధనం.

కథ

# సయోధ్య

దూరం కావడం వలన పెరిగిన ప్రేమను తెలిపిన కథ...




వాసర దత్తా రమణ
97044 44760


(ఉగాది కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ...)

"ఏంటీ అమ్మ, శిరీష ఎక్కడికి వెళ్ళారు" ఇంటి తలుపులు బార్లా తెరిచి ఉండటం చూసి ఆశ్చర్యపడ్డాడు మహీంద్ర.

శిరీషకు కాల్ చేసి "ఎక్కడ ఉన్నావు" అని భార్యను అడిగాడు.

"మన అపార్ట్‌మెంట్ కింద ఫ్లోర్లో కిట్టి పార్టీలో ఉన్నాను. ఏంటి, అప్పుడే ఇంటికి వచ్చేసారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును, ఎందుకో బాగా తలనొప్పిగా ఉంది. ఆఫీసులో పర్మిషన్ తీసుకొని వచ్చెసాను. ఇంతకీ అమ్మేది?"

"అదేంటి, ఇంట్లో లేరా?"

"లేదు. వీధి తలుపు తెరిచే ఉంది" నుదిటి కణతల మీద వేళ్ళు నొక్కు కుంటూ అన్నాడు.

"నేను వస్తున్నాను" కంగారుగా అంది. ఇంకో రెండు నిముషాల్లో అత్తాకోడళ్ళు ఇద్దరు ఇంచుమించుగా ఒక్కసారే లోపలికి వచ్చారు.

"ఒంట్లో బాగోలేదా ఏంటి, అప్పుడే వచ్చేసావు?" కొడుకు మీద చేయి వేస్తూ కమల ఆందోళనగా అంది.

"బాలేదు కానీ అమ్మా, తలుపులు తీసి ఎక్కడికి వెళ్లావు ?".

"ఎదురింటి రావుగారి భార్యతో మాట్లాడుతుంటే ఆవిడ టీ పెట్టి ఇచ్చింది. తాగేసిన కప్పు వాళ్ళింట్లో పెట్టేసి వస్తున్నాను. ఇంతలోపే నువ్వు మనింట్లోకి వచ్చేసి ఉంటావు" అంది.

"అయితే, అంత బాధ్యత లేకుండా వీధి తలుపు తెరిచి వెళ్ళారా అత్తమ్మ. ఇంతలో ఎవరైనా దూరితే?" శిరీష కోపంగా అంది.

"మొగుడు ఇలా ఆఫీసుకి వెళ్ళగానే, ఎక్కడివక్కడ వదిలేసి పొద్దుననగా కిట్టి పార్టీ అంటూ చక్కా పోయావు, బాధ్యత గురించి నువ్వు నాకు చెప్పేదేమిటి, గొడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్లు. అయిదు నిముషాలకు కావాలని ఎందుకు అంత రాద్ధాంతం చేస్తున్నావు?" వెటకారంగా అందావిడ.

అత్తా కోడలికి మాట మీద మాట పెరిగింది. అతనికి ఒంట్లో బాగాలేదన్న విషయం మరిచిపోయి ఇద్దరు వాదులాడుకోవడంలో మునిగిపోయారు.

పిల్లలు స్కూల్ నుంచి రావడంతో, కాస్త శాంతించి ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్లారు. పిల్లలకి బట్టలు మార్చి వాళ్ళని ట్యూషన్‌కి పంపే ఏర్పాట్లలో శిరీష మునిగిపోయింది.

"నానమ్మా, నాకు ఇవాళ మురుకులు చేస్తానన్నావు కదా, చేసావా?" మనవరాలు ముద్దు ముద్దుగా అడుగుతుంటే,

"పొద్దునే చేసేసాను. నువ్వు త్వరగా రెడీ అయి రా. పెడతాను" నిళిత బుగ్గలు నిమురుతూ కమల లోగొంతుతో అంది.

"అమ్మయ్య వాన వెలిసింది" అనుకుంటూ మహీంద్ర టాబ్లెట్ వేసుకొని నిద్రలోకి జారిపోయాడు.

* * *

రాత్రి "మీరిద్దరూ అంతలా వాదులా డుకుంటే నాకు బాగనిపించడంలేదు" మహీంద్ర భార్యతో అన్నాడు.

"ఎందుకో ఈ మధ్య నా మీద ఆవిడే తెగ చిరాకుపడిపోతున్నారు" కోపంగా అంది.

"నువ్వు, అమ్మ కలిసిమెలిసి ఉండాలి. నేను ఒక్కడే కొడుకుని. నాన్న హఠాత్తుగా పోవడంతో అమ్మ పైకి చెప్పక పోయినా మనసులో చాల బాధ పడుతోంది. అన్నేళ్ల సాంగత్యం కదా" దిగులుగా అన్నాడు. భర్త ముఖం చూసి తర్కించకుండా మౌనంగా ఉండిపోయింది.

"పిల్లలు పడుకోవడానికి రాలేదే?" అన్నాడు.

"వాళ్ళ బామ్మ చెప్పే కథలు వింటూన్నారు. అక్కడే పడుకున్నారేమో" అలకగా అటు వైపు తిరిగి పడుకుంటూ అంది.

మర్నాడు పొద్దున్న బద్దకంగా లేచాడు మహీంద్ర. లోపల్నుంచి ఏదో గొడవ వినపడుతుంది. "అమ్మ బాబోయ్, మళ్ళీ మొదలయింది" అనుకుంటూ హాల్లోకి వచ్చాడు.

"పాలన్ని పొంగిపోయాయి. స్టవ్ స్లోలో పెడితే సరిపోతుందిగా, నెమ్మదిగా వేడెక్కి పాలు చక్కగా మరుగుతాయి. అన్నింటికీ

తొందరే నీకు'' కమల చిరాకుగా అంటోంది.

"ఊరికే గొడవచేయకండి. ఇంకో లీటర్ పాలు తెప్పిస్తాను'' శిరీష గొంతు వంటింట్లోంచి నిర్లక్ష్యంగా వినపడుతోంది.

"అసలు ఇదేం మాట? నీకసలు బుద్ధిగా ఒద్దికగా సంసారం నడిపే ఆడదాని లక్షణాలు ఒక్కటి కూడా లేవు, డబ్బు పడేయటమే తెలుసు కాని జాగ్రత్త తెలియదు. పాలు తెస్తే సరిపోతుందా, ఇదంతా తుడవాలి. కడగాలి. ఈ చాకిరీ అంతా ఎవరు చేస్తారు?'' గ్యాస్ గట్టును కడుగుతూ గొంతు పెద్దది చేసి అంది.

"మీకు ఎప్పుడు అదే చెబుతాను. మీరు అసలు వంటింట్లోకి రాకండి. నాకలవాటున్నట్టుగా నెమ్మదిగా అన్ని నేనే చేస్తాను''.

"వంటింట్లోకే రావద్దా. అసలు ఇంట్లోనే ఉండొద్దా'' కమల గట్టిగానే అంది.

ఒంట్లో బాగోలేకపోయినా మనశ్శాంతిగా అనిపించక మహీంద్ర ఆఫీసుకి బయలుదేరి వచ్చేసాడు. ఆఫీసులోనూ రకాల రాజకీయాలతో తలపగలు కొట్టుకుంటూ ఉంటె ఇప్పుడీ ఇంటి గొడవలని తలుచుకుంటూ అతని మనస్సంతా ఇంకా రగిలిపోతోంది.

అతనికి ఒక్కతే చెల్లెలు సుధ. తను ఆస్ట్రేలియాలో ఉంటోంది. అతను కూడా శిరీషతో పెళ్ళయాక నోయిడాలో ఏడేళ్ళు పని చేసి తిరిగి వచ్చాడు. నోయిడాలో ఉన్నప్పుడు రాకపోయినా ఇప్పుడున్న ఇంటికి వచ్చి మటుకు అప్పుడప్పుడు అతని తల్లితండ్రి వచ్చి వెళ్తుండేవాళ్ళు. తండ్రి పోయాక ఊరునుంచి తల్లిని తన ఇంటికి శాశ్వతంగా తీసుకొచ్చినప్పటి నుంచి మటుకు అత్తాకోడళ్ళకు ఒకళ్ళంటే ఒకళ్లకు పొసగడం లేదు. తల్లికి తనంటే ఎంత ప్రాణమో, భార్యకు తనంటే ఎంత ప్రేమో అతనికి బాగా తెలుసు. వాళ్ళని కలపాలని ప్రయత్నించిన అతని ప్రేమ ఎప్పటికప్పుడు ఓడిపోతూనే ఉంది.

కమల ఒంటిచేత్తో పదిమందికైనా క్షణాలలో వంట చేస్తుంది. ఆవిడకు మొదటినుంచి క్రమశిక్షణ ఎక్కువ. కానీ శిరీష ఆవిడకి పూర్తిగా వ్యతిరేకం. ముందునుంచి స్వేచ్ఛగా, గారాబంగా పెరిగింది. పిల్లల ముందు గొడవలు వద్దని భార్యకు చెబుతుంటే అర్ధం చేసుకోదు. కోపగించేసుకొని మూడ్ పాడుచేసుకొని,

"మీ అమ్మగారిలో అహంకారం పెరిగింది. ఆవిడ ప్రవర్తనలో చాల తేడా వచ్చింది. ప్రతిదానికి నన్ను తీసి పడేసినట్టు మాట్లాడుతుంది'' అని రోజు పడకగదిలో ఏడ్చి గోల పెట్టేస్తోంది.

"నాన్నతో పాటె నేను పోయి ఉంటె బావుండేది. విలువ లేనిచోట నేను ఉండ లేను. నన్నేవృద్ధాశ్రమంలోనో పడేయరా'' అంటూ కమల కొడుకు దగ్గర తరచుగా కన్నీళ్లు పెట్టుకుంటోంది.

మనుషులతో బంధాలు పెంచు కోవాలని, అవే విలువైన స్థిరాస్తులుగా తమతో చివరి వరకు మిగిలి ఉంటాయన్న జీవితసత్యాన్ని అతనెన్నిసార్లు చెప్పినా ఇద్దరూ అర్థం చేసుకోవడం లేదు. మహీంద్ర ఆలోచిస్తూనే ఉన్నాడు.

★ ★ ★

ఆ రోజు రాత్రి ఆస్ట్రేలియా నుంచి సుధ ఫోన్ చేసింది. చెల్లెలుతో మాట్లాడాక అతను బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. తన చర్య తల్లిని బాధిస్తుందని అతనికి తెలుసు కానీ తప్పదనిపించింది.

"అమ్మా, సుధ అత్తగారు ఓల్డ్ ఏజ్ హొమ్‌లో ఉంది కదా, ఆవిడకి విపరీత మైన జ్వరంతో మూసిన కన్ను తెరవడం లేదుట. పది పదిహేను రోజులు పాటు నిన్ను ఆమె దగర తోడుగా ఉంచమని సుధ నన్ను బతిమాలింది'' అన్నాడు.

"నేనలా ఇంటిని వదిలి ఎక్కడయినా వెళ్లి అలా ఉంటాన్రా? అంత బుర్ర లేకుండా అదేలా అడిగింది?'' కమల తెల్లబోతూ



అంది.

"నువ్వు వెళదామనుకుంటే సాయంత్రం ఆఫీసు నుంచి వచాక తీసుకెళ్ళాను" ముక్తసరిగా అన్నాడు.

"భలేవాడివే, ఒకసారి వెళ్లి పలకరించి వద్దాం అంతే కాని, అయినా సుధతో నేను మాట్లాడతానులే" కోపంగా అంది.

కానీ కూతురు ఏమి మాట్లాడి ఒప్పించిందో ఏమో కాని, సాయంత్రాని కల్లా మహేంద్ర ఆఫీస్ నుంచి ఇంటికి చేరేటప్పటికి కమల గంటు మొఖం పెట్టుకొని బట్టల సంచి సర్దుకొని కూర్చుంది.

"ఏమిటో, నాకసలు అలా వెళ్లడం ఇష్టం లేదురా. కానీ నేను వెళ్లనన్నానని అల్లుడు చాల కోపంగా ఉన్నాడట. ఊళ్ళో ఉన్న మీ అమ్మగారు కాస్త సాయంగా వెళ్ళితే బావుంటుంది కదా, లేకపోతే ఉద్యోగానికి సెలవు పెట్టి ఆస్ట్రేలియా నుంచి వెంటనే బయలుదేరు అన్నాడుట. అతనికి తల్లంటే ఎంత గౌరవమొ చూడు" అంది.

"అంత గౌరవం ఉన్నవాడు తల్లిని తీసుకెళ్ళి ఓల్డ్ ఏజ్ హోంలో ఎందుకు పెట్టాడు అత్తమ్మ ?" వెనుక నుంచి శిరీష వెటకారంగా అంది.

కమల గొంతులో పచ్చివెలక్కాయ పడినట్టనిపించి ఏం మాట్లాడలేక అయిష్టం గానే కొడుకుతో వృద్ధాశ్రమానికి బయలుదేరింది.

* * *

మర్నాడు ఆరు గంటలకి అలారం మోగింది. నిద్రలో ఉలిక్కిపడి లేచి, మళ్ళీ ఆపేసి శిరీష నిద్రపోబోతుంటే, "అమ్మ లేదు కదా,పిల్లల్ని స్కూలుకి పంపాలి" నిద్రలో జోగుతూ మగతగా అన్నాడు మహేంద్ర. అతను ఇంటికి రాత్రిళ్ళు కాస్త లేటుగానే వస్తాడు. అతను నిద్రలేచాక రోజు ఇంట్లో సందడిగా తిరుగుతూ ఎదురుగా ఉండే తల్లి లేక మనసుకు వెలితిగా అనిపించి అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.కాని శిరీష మటుకు చాలా ఉత్సాహంగా ఉంది. కర్టెన్స్, పక్కదుప్పట్లు అన్ని చకచకా మార్చేసింది. ఇల్లంతా తనకు నచ్చినట్లుగా సర్దుకుంది. పెళ్ళైనప్పటి నుంచి మునుపు ఎంత స్వేచ్ఛగా ఉండేదో ఇప్పుడు ఇంట్లో అత్తగారు అడ్డుగా లేకపోతే ఇల్లంతా తనదేనన్న ఆనందం ఆమెకు ఎనలేని సంతృప్తిని కల్గిస్తోంది.

* * *

కొద్దిరోజులు గడిచాక "ఏవండీ లేవండి" మహేంద్రని తెల్లారే నిద్ర లేపింది శిరీష.

"ఏంటీ" నిద్ర మత్తులో అన్నాడు.

"పాలు రాలేదు" అంది.

"వీధి చివరేగా తెచ్చుకో. అమ్మ అలాగే తెస్తుందిగా".

"అబ్బా, నేనీ నైటీలో వెళ్ళను" అంది.

"నన్నులేపకు" అంటూ అతను కావాలనే పక్క మీద నుంచి లేవలేదు.

పిల్లల్ని రెడీ చేసి టిఫిన్స్ బాక్సులు పెట్టి పంపింది కాని ఆమెకి తలనెప్పిగా పెరగసాగింది. ఈలోగా ఆమె సెల్ మోగింది. ఆమె అన్నయ్య చేసాడు కాని విసుగుతో ఎత్తలేదు. తర్వాత మాట్లాడు దామని వదిలేసింది. ఫ్రెండ్స్ రెండు మిస్ కాల్స్ అందులో ఉన్నాయి.

"ఇప్పుడు చేస్తే గంట మాట్లాడుతారు వాళ్ళు" అనుకోని తిరిగి వాళ్లకు కాల్ చేయలేదు.

అతను నిద్ర లేచాక, "మీరు లేటుగా వస్తారు. తొందరగా నిద్ర లేవరు. కనీసం పాలయినా తేకపోతే ఎలా. కాఫీ తాగక తలనెప్పి వచ్చేసింది" అంటూ గట్టిగానే దెబ్బలాడింది కాని అతను భార్యకి ఎటువంటి సాయం చేయదలుచుకోలేదు కాబట్టి మారు మాట్లాడకుండా లంచ్ బాక్స్ తీసుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

"ఈవాళ పొద్దున్న పని తేమలక పొద్దున్న మిమ్మల్ని కొంచం ఎక్కువగా విసుక్కున్నాను" రాత్రి భర్తతో శిరీష బాధగా అంది.

"ఫరవాలేదు. పనమ్మాయిని మిగతా పనులకు కూడా మాట్లాడుకో. నాకీ మధ్యన ఆఫీసులో పని ఒత్తిడి ఎక్కువగానే ఉంటోంది. ఇంటి పనుల కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నాను" అన్నాడు.

**అతను నిద్ర లేచాక, "మీరు లేటుగా వస్తారు. తొందరగా నిద్ర లేవరు. కనీసం పాలయినా తేకపోతే ఎలా. కాఫీ తాగక తలనెప్పి వచ్చేసింది" అంటూ గట్టిగానే దెబ్బలాడింది కాని అతను భార్యకి ఎటువంటి సాయం చేయదలుచుకోలేదు కాబట్టి మారు మాట్లాడకుండా లంచ్ బాక్స్ తీసుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.**

"వద్దులెండి. పోయినసారి అలా పెట్టుకుంటేనే మీ ఖరీదైన వాచీ పోయింది కదా. నేను వాళ్ళను సంబాళించలేను. అంట్లుకి ఒకటే చాలు. నేను బాల్కానీలో పక్కన ఉంటాను కాబట్టి చూసుకోగలను".

"నీ ఇష్టం" అన్నాడతను.

ఇంకో నాలుగు రోజులు గడిచాక, "మనకి సాన్నిహిత్యంగా ఉండే సమయం అసలు దొరకడం లేదు. అత్తమ్మా ఉంటె అక్కడ పిల్లలు పడుకునేవాళ్ళు. ఇప్పుడు పడుకోమంటే భయం అంటున్నారు" ఆ రాత్రి శిరీష దిగులుగా అంది. అతనేమి మాట్లాడలేదు.

అతను ఆ మరునాడు ఆఫీసు నుంచి మధ్యాన్నమే ఇంటికి వచ్చేసాడు.

"ఇంత హఠాత్తుగా క్యాంపు ఎందుకు పడింది? వెళ్ళడం తప్పదా" శిరీష ఆందోళనగా అంది.

"వెళ్ళకుండా ఉండటానికి చాల ప్రయత్నించాను కాని వీలు పడలేదు. ఇంకో రెండు గంటల్లో ఫ్లైట్ ఉంది. పదిహేను రోజులు పట్టొచ్చు. మీ వాళ్ళను రమ్మంటావా" హడావుడిగా అన్నాడు.

"మా అమ్మ నాకు తోడు కోసం రాలేదు. ఆవిడకే కళ్ళ ఆపరేషన్ అయింది కదా!"

"ఉండగలవా మరి" అన్నాడు.

"నేనే అక్కడికి వెళతాను" అంది.

మహేంద్ర వెళ్ళిపోయాడు.

కథ

తన పురుళ్ళ తరువాత పదిరోజులు పుట్టినింట్లో ఉండటమే ఇదే ప్రథమం శిరీషకు. ముందు రెండు రోజులు బాగానే గడిచాయి. అన్నగారేమో శ్రీవారి సేవకని తిరుమలకి వెళ్ళాడు. వదిన ఇల్లు శుభ్రంగా పెట్టుకోకపోవడం మటుకు ఆమెకు ఎక్కడిలేని అసహనాన్ని కలిగించింది. చిందర వందరగా ఎక్కడి వస్తువులు అక్కడే నేల మీదపడి దొర్లుతున్నాయి. ఎంతసేపు డాంబీకపు కబుర్లు చెబుతూ బాగా తయారై కాలు మీద కాలు వేసుకుని కూర్చుంటుంది కాని, ఇంటి సంగతులేమి ఆమెసలు పట్టించుకోదు.పైగా ప్రతి చిన్నదానికి తల్లి తండ్రిని చులకన చేస్తూ ఆమె మాట్లాడుతుంటే శిరీష సహించలేక కోపంతో రగిలిపోయింది. కీళ్ళ నొప్పులతో తల్లి పూర్తిగా వదిన దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడిపోయిందన్న విషయం అర్థం చేసుకుని ఇక అక్కడ ఉండలేక పిల్లల్ని తీసుకుని తన ఇంటికి బెల్లం కొట్టిన రాయిలా తిరిగి వచ్చేసింది.

ఇంట్లోకి అడుగు పెడుతూనే హాల్లోని అత్తగారి, మావగారి ఫోటోను ఎదురుగా చూడగానే మరి అత్తగారితో తాను ఎలా ప్రవర్తిస్తోందన్న అంతర్మథనం శిరీషలో తొలిసారిగా మొదలైంది.

“అదే అత్తమ్మ అయితే ఆరేసిన బట్టలు ఇస్త్రీ చేసిన బట్టల్లాగా చక్కగా మడతలు వేసి పేర్చి ఎవరి గదుల్లో వాళ్ళకి పెడుతుంది. అంత వయసు ఉన్నా ఒక్క క్షణం కూడా మధ్యాహ్నం కునుకు తీయదు. ఏదో కుట్టుకుంటు, ఎదురింటి వాళ్ళతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేసుకుంటుంది. ఇంతకు మునుపు పిల్లలకు కూడా కాస్త క్రమశిక్షణ ఉండేది. ఇప్పుడు అది కూడా పోయింది. తాను వంటింట్లో ఉంటె వాళ్ళు టీవీ చూస్తూ కూర్చుంటున్నారు. అదే అత్తమ్మా టీవీ అసలు పెట్టనిచ్చేదే కాదు. హోమ్‌వర్క్స్ చేయిస్తూ వాళ్ళ పక్కనే కూర్చునేది. తను ఫ్రెండ్స్ ఇళ్లకెళ్లి చాలరోజులయింది. అన్నీ తలుచుకుంటుంటే అప్పటివరకు గుర్తించని అత్తగారి విలువ కూడా ఆమెకు కొద్దికొద్దిగా తెలిసివస్తోంది. ఆ మరునాడే పనిమనిషి జాతరకి వెళ్తానని రెండు రోజులు రానని శిరీషతో చెప్పింది.

ఇంటినిండా పిల్లలు విప్పిన స్కూల్ బట్టలు, సింకు నిండా తినేసిన పళ్ళాలు, సోఫాల మీద స్నానం చేసిన విసిరేసిన తడి తువాళ్ళు మధ్యాహ్నం అయినా ఆమెకు పని ఎంతకి తేమలడంలేదు. స్నానం చేసి, అన్నం తిని అన్ని సర్దుకునే లోపే మధ్యాన్నపు బళ్ళు అవడంతో పిల్లలు రెండింటికే ఇంటికి వచ్చేస్తున్నారు. వాళ్ళకి స్నాక్స్ పెట్టి ట్యూషన్స్‌కి పంపేటప్పటికి ఆమెకు అలసట ముంచుకు వచ్చింది. ఆరేసిన బట్టలు తెచ్చి మడతలు వేసి మళ్ళి వంట అయేటప్పటికీ రాత్రి తొమ్మిది దాటిపోయింది.

**వదిన ఇల్లు శుభ్రంగా పెట్టుకోకపోవడం మటుకు ఆమెకు ఎక్కడిలేని అసహనాన్ని కలిగించింది. చిందర వందరగా ఎక్కడి వస్తువులు అక్కడే నేల మీదపడి దొర్లుతున్నాయి. ఎంతసేపు డాంబీకపు కబుర్లు చెబుతూ బాగా తయారై కాలు మీద కాలు వేసుకుని కూర్చుంటుంది కాని, ఇంటి సంగతులేమి ఆమెసలు పట్టించుకోదు.**

ఇంకో రోజు సాయంత్రం అనుకో కుండా ఆమె పిన్ని, బాబాయి ఇంటికి వచ్చారు. వాళ్ళకి టిఫిన్, కాఫీలు, భోజనాలు చేసేట్టపటికే ఆమె పని పూర్తిగా అయిపోయింది.

రోజులు గడిచే కొలది శిరీషకి అత్తగారు లేని కాపురం సరదా అంతా తీరిపోయింది. హఠాత్తుగా జీవితమంతా గందరగోళంగా అయిపోయినట్లుగా అనిపించసాగింది. ఇంట్లో కొన్ని స్టీల్ సామానులు కనపడటం లేదు. పనిమనిషిని అడిగితే నేను పట్టుకెళ్ళలేదు అంటుంది. ఇస్త్రీకి ఇచ్చిన మహీంద్ర రెండు కొత్త బట్టలు కూడా లాండ్రీ అతను తెచ్చివ్వలేదు.

అడిగితే “వేసింది రెండు పాంట్స్, నాలుగు కాదు. మీరేమి రాసుకోలేదు. లెక్క సరిగా చూసుకోండమ్మా” అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. తానేమి రాసి పెట్టుకోలేదు. అత్తమ్మ అయితే చిన్న పుస్తకం పెట్టుకుని పద్దు వ్రాయందే బట్టలు ఇవ్వనే ఇవ్వదు. ఎంత ఓపికో. పని అంటే అస్సలు విసుగె ఉండదు. ఒక్క తిరుపతికి తప్పితే ఆవిడ ఇల్లు వదిలి ఎక్కడికి వెళ్ళింది కూడా లేదు. అదే ఆడపడుచు అత్తగారికి ఎప్పుడు ఏదో ఒక అనారోగ్యమే. ఎప్పుడు ఎదురుసేవలు చేస్తూనే ఉండాలి” ఆలోచిస్తూ అనుకుంది శిరీష.

ఆ మర్నాడు కూతురు నిఖితకి పెద్ద పెట్టున జ్వరం ముంచుకురావడంతో శిరీష కంగారుపడిపోతూ తెల్లవార్లు నుదుటి మీద తడిగుడ్డ వేస్తూనే ఉంది. మూసిన కన్ను తెరవకుండా ఉన్న కూతురు పరిస్థితికి ఆమె బాగా భయపడిపోయింది. ఎదురింటి రావు గారిని తోడు తీసుకుని ఆ రాత్రి ఇంటి దగ్గర నర్సింగ్ హోంలో ఉంచి సెలైన్ ఎక్కించి మరునాడు ఇంటికి తీసుకు వచ్చింది కాని ఆమె మనసు మనసులో లేదు.

“మా పిల్లలు ఉద్యోగాలతో దూరంగా ఉన్నారు. మా ఆవిడకు కాస్త కాలక్షేపం మీ అత్తగారితోనే అయ్యేది. ఆవిడ ఎప్పుడు వస్తారు” అడిగారు రావుగారు. ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పలేక తడబడింది. ఆ క్షణం నుంచి అత్తగారిని ఇంటికి త్వరగా తెచ్చేసుకోవాలని ఆమెకు బలంగా అనిపించసాగింది.

మహీంద్ర క్యాంపు నుంచి ఇంటికి తిరిగి రాగానే అతనిని పట్టుకుని, “నిఖిత జ్వరంతో కంగారు పెట్టేసింది” అని చెబుతూ గట్టిగా ఏడ్చేసింది.

“ఉద్యోగ బాధ్యతలు పెరిగాయి. బిజినెస్ టూర్లు పడుతూనే ఉంటాయి. నువ్వింక ధైర్యంగా, ఒంటరిగా ఉండటం నేర్చుకోవాలి” గంభీరంగా అన్నాడతను.

భర్త కళ్లలో మునపటి అనురాగం మెరవ కపోవడం ఆమె మనసు గుర్తించింది. అతని మాటల వెనుక ఏదో సందేశం కూడా ఆమెకు లీలగా ధ్వనించింది.

రోజులు గడుస్తున్న కొలది భార్యతో అంటిముట్టనట్టుగా వ్యవహరిస్తున్నా, మహేంద్ర శిరీషను ఒక కంట గమనిస్తూనే ఉన్నాడు. అత్త కోడళ్ళ మధ్య రేకెత్తిన అపోహలు తొలగిపోయి, పెరిగిన దూరాల్లన్ని తరిగిపోయి, ఒకరి పట్ల ఒకరి విలువ పెరగాలని అందరిని బాధకు గురిచేస్తున్న ఈ ఎడబాట్లు ఒక మంచి పరిష్కారానికి దోవ తీయాలని అతను బలంగా కోరుకుంటున్నాడు.

★ ★ ★

"నెల రోజులైంది, ఇంతవరకు మహేంద్ర ఒక్కసారైన వచ్చి నన్ను చూసి వెళ్లనేలేదు. అప్పుడు నేనే ఫోన్ చేస్తే పదిహేను రోజులు క్యాంపుకు వెళు తున్నానన్నాడు. ఈవాళ చేస్తే ఆఫీసులో చాల బిజీగా ఉన్నానని అంటున్నాడు" వియ్యపురాలితో కమల బాధగా అంది.

"ఈ నెలకే మీరు ఇలా అంటే వదినా, నేను నా కొడుకుని చూసి ఇప్పటికి రెండేళ్లయింది" పేలవంగా నవ్వుతూ అంది సుధ అత్తగారు సుశీల.

ఆమెకి అనారోగ్యం కన్నా మానసిక బాధే ఎక్కువగా ఉందనిపించింది కమలకి. కానీ అల్లుడు ఆమెను సంపన్నుల వృద్ధాశ్రమంలో పెట్టాడు. డాక్టర్లు, అంబులెన్సుతో సహా అన్ని వసతులు బాగానే ఉన్నాయి. దేనికి లోటు లేదు. ఒక్క ఆత్మీయులకి తప్ప అనిపించింది కమలకి.

ఆశ్రమంలో ఉన్న వాళ్ళతో మాట్లాడు తుంటే ఎప్పుడు వాళ్ళంతా వాళ్ళ పిల్లల కబుర్లే చెబుతారు కాని కానీ వేరే మాటలే ఎవ్వరికి ఉండవు. అందరు అపారమైన ఒంటరితనంతో బాధ పడుతున్నవాళ్లే. అందరి జీవిత పరిచయాలు పిల్లలు తమకు దూరమయ్యారన్న భారంతో, వేదనతో మిళితమై ఉన్నాయనిపించింది కమలకు.

"పించన్లు వచ్చినా, బ్యాంకుల్లో ఎంత డబ్బు ఉన్నా వదినా, ఈ వయసులో మన కన్నపిల్లలు మన దగ్గరగా లేకపోతే అవన్నీ ఏమి చేసుకోవాలి చెప్పు, పిల్లలు ఎవరో ఒక్కళ్ళు దగ్గరికి పోవాలని ఉంది. కాని వాళ్ళు ఎప్పటికి తీసుకెళ్తారో?' నిస్పృహగా అంది సుశీల.

"పరాయి దేశం అంటే, వీసాల దగ్గరనుంచి అన్ని ఇబ్బందులే వదిన. లేకపోతే సుధ మిమ్మల్ని ఎప్పుడో అక్కడికి తీసుకెళ్ళేదే" కూతురిని వెనకేసుకొస్తూ ఆమె నెపం ఏమిలేదనట్టుగా అంది కమల.

"ఏమో ఏమిటో ఆ వీసా గోలలు. ఏదైనా నువ్వు చాల అదృష్టవంతురాలివి. నీ కొడుకు నువ్వంటే ప్రాణం పెడతాడు. శిరీష మాట త్వరగా విసిరేస్తుంది కానీ మనిషి చాలా భోళా మనిషి. తనకి తన మన అన్న భేదం లేదు. అందరిని సమానంగా చూస్తుంది' ఆయాసంగా అందావిడ. తన కోడలి వ్యక్తిత్వం గురించి మాట్లాడుతుంటే కమల ఆమెవంక ఆశ్చర్యంగా చూసింది

'వదినా, ఎక్కువగా మాట్లాడకు. పడుకో" అంటూ ఆవిడకి దుప్పటి కప్పి కమల ఆమె మంచం పక్కన దిగాలుగా కూర్చుండిపోయింది.

తన ఇల్లు, ఆప్యాయంగా మాట్లాడే కొడుకు, గారాలు చిందించే మనవరాళ్ళు కమలకు తరచుగా గుర్తుకువస్తున్నారు. తన భర్త, కొడుకు తనని ఇంటికి మహారాణిని చేసి కూర్చోబెట్టారు. చుట్టుపక్కల వాళ్ళలో, బంధువులలో మంచిపేరు తెచ్చుకుని తను ఇంటి గౌరవాన్ని ఉన్నతంగా నిలబెట్టింది. ఇప్పుడు తన కోడల్ని కూడా తన స్థాయికి చేరిస్తేనే కదా, తన వంశాన్ని ఉద్ధరిస్తూ తను కూడా ఇంటి గౌరవమర్యాదలు నిలపెడుతుంది.

తమిద్దరి మధ్య ఎన్ని తగవులు జరిగినా పరాయివాళ్ళ ముందు కోడలు తననెప్పుడు అగౌరవపరచలేదు. చెప్పుడు మాటలు చెప్పదు. శిరీషకా సంస్కారం ఉంది. అత్తమ్మా అని పిలిచే కోడలికి అమ్మలా ప్రేమని పంచి, ఆదరిస్తే కదా ఇల్లు ఆనందనిలయం అవుతుంది. అన్ని వదుల్చుకుని ప్రశాంతంగా ఉండాల్సిన పెద్ద వయసులో అతిగా చేస్తూ తను తప్పులు మీద తప్పులు చేస్తుందన్న భావన కమలకి తొలిసారిగా కలిగింది.

కొడుకుని, కోడలిని బెదిరిస్తూ వృద్ధాశ్రమానికి పోతాను అంటూ గర్వంతో తలఎగరేస్తూ తను అన్న మాటల్ని తథాస్తు దేవతలు విన్నారా అయితే అదే నిజమవుతోందా? అందుకేనా పది రోజులని చెప్పి ఇన్ని రోజులైనా తనని తీసుకెళ్ళడానికి కొడుకు రాలేదా? నేను లేకపోతేనే వాళ్లకు ఇల్లు బావుందని పించిందా? కమలకు హఠాత్తుగా భయం వేసింది. ఇక ఒక్కక్షణం కూడా ఆశ్రమంలో ఉండాలనిపించలేదు.

ప్రేమించే కన్నకొడుకు, చక్కటి కుటుంబం ఉండి కూడా తను, ఇలా వృద్ధాశ్రమంలో పడి తన వియ్యపురాలిగా దిక్కులేని జీవితం గడపదలుచుకోలేదు. స్థిరంగా నిశ్చయించుకుంటూ బట్టల బ్యాగ్ సర్దుకుంది. మళ్ళీ కొద్దిరోజుల తరువాత వస్తానని చెప్పి ఆశ్రమ నిర్వాహకులకు వియ్యపురాలిని జాగ్రత్తగా చూసుకొమ్మని అప్పచెప్పేసి తన ఇంటికి బయలుదేరింది.

★ ★ ★

మధ్యాహ్నం తలుపు తీసిన శిరీష, గుమ్మం దగ్గర అత్తగారిని చూసి ఒక్కసారిగా తెల్లబోయింది.

"అదేంటి, అత్తమ్మ, ఇంత ఎర్రని ఎండలో అంత దూరం నుంచి ఒక్కరు ఎలా వచ్చారు?" అంటూ ఆవిడ చేతుల్లోంచి బ్యాగ్ అందుకుంది.

మంచినీళ్లు చేతికి ఇచ్చి, "ఇంతకీ అన్నం తిన్నారా? కుక్కర్ పెట్టమంటారా?" అంటూ శిరీష గలగలా మాట్లాడుతుంటే,

"ఏమక్కర్లేదు. నేను అక్కడ తిని వచ్చాను" ఎదలోపల సంతోషపరవళ్ళు అదిమిపెట్టుకుంటూ కమల అంది.

"అన్నం పెట్టనా అత్తమ్మ" అని ప్రేమగా అడుగుతున్న కోడల్ని ఇన్నాళ్ల మాటల ఈటెలతో దూరం పెట్టినందుకు తనకి క్షమాపణ చెప్పాలనిపించింది కానీ

పెద్దరికం అడ్డం వచ్చింది. అత్తగారు ఇల్లు చేరిన ఆనందంలో శిరీష తలమునకలయింది.

"కాసేపు నువ్వు పడుకో. పిల్లలు వస్తే నేను టిఫిన్ పెట్టి, ట్యూషన్‌కి పంపుతా నులే" అంటూ కోడల్ని పడకగదిలోకి పంపి, ఇల్లంతా చిన్నపిల్లలా సంబరంగా కలియతిరిగింది. మంచం మీద దొర్లుతూ తన ఫ్రెండ్స్‌తో కాసేపు సరదాగా కబుర్లు చెప్పి చాలా రోజుల తర్వాత శిరీష హాయిగా మధ్యాహ్నం కునుకుతీసింది.

బడి నుంచి వస్తూనే "బామ్మా" అంటూ ఆప్యాయంగా చుట్టుకుపోయిన మనవరాళ్ళని హృదయానికి సంబరంగా హత్తుకుంటుంటే కమలలోని ఆనందం అంబరాన్ని తాకింది. సాయంత్రం ఇల్లు చేరిన మహేంద్రకు తల్లి ఎదురుగా స్వాగతం పలకడంతో అతని గుండెలలోని అపరాధభారమంతా ఒక్కసారిగా దిగిపోగా మనసంతా సంతోషంతో నిండిపోయింది. తల్లిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకు న్నాడు. సంతృప్తితో నవ్వుతున్న తండ్రి ముఖం లిప్త మాత్రంగా అతని కళ్లముందు మెదిలింది.

ఆ రాత్రి మహేంద్ర భార్యవంక చూస్తూ చిలిపిగా అన్నాడు.

'రాణిగారు, ఇవాళ సాయంత్రం నుంచి సెల్లో కబుర్లు, రాత్రికి లుక్కుల్లో తేడాలు, ఏంటి చాలా హుషారుగా కనిపిస్తున్నారు" ఆమె ముఖంలో చిరునవ్వు అందంగా మెరిసింది.

మర్నాడు పొద్దున్న, "శిరీష లే, అలారం మ్రోగుతోంది" భర్త నిద్ర లేపుతుంటే బద్దకంగా కదిలింది.

"వద్దు, పడుకో, మర్చిపోయాను. అమ్మ వచ్చేసిందిగా. ఇక చూసుకుం టుందిలే" మళ్ళి అటుతిరిగి పడుకుంటూ అన్నాడు. ఆ మాటకు ఆమెకు పూర్తిగా మెలుకువ వచ్చింది.

"ఆవిడ ఒక్కతే ఏం చేస్తుంది. కాస్త సాయం చేస్తే పని త్వరగా పూర్తి అవుతుంది" అంటూ పక్కమీద నుంచి చెంగున లేచింది. అతని పెదాలపై చిరునవ్వు విరిసింది. అతను కూడా

**"నీకు చిట్టి వచ్చినందుకు కిట్టి పార్టీ మనింట్లోనేట, అందుకే ఎంత మంది వస్తారో కనుక్కో, ఏం వంటలు చేయాలో చెప్పు. పోయినసారిలా హోటల్ నుంచి తెప్పించవద్దు" లోపల అంటోంది కమల.**

ఆమెతో పాటే లేచి, పాలపాక్కెట్లు తెచ్చి వంటింట్లో పెట్టి, తల్లి గదిలోకి వెళ్లి అక్కడున్న తండ్రి ఫోటోకి దండం పెట్టుకుని పిల్లల పక్క మధ్యలోకి దూరి హాయిగా మళ్ళీ పడుకున్నాడు.

* * *

ఒక నెల తరువాత......

"అమ్మా, చెల్లాయి, బావ వచ్చేవారం ఆస్ట్రేలియా నుంచి వస్తున్నారు" మహేంద్ర టిఫిన్ తింటూ తల్లితో అన్నాడు.

"నాకు కూడా ఫోన్ చేసిందిరా. ఉన్న నాలుగు రోజులు అత్తగారితోనే సమయాన్ని గడపమని, ఎవరిళ్ళకి రాలేకపోయినా ఫర్వాలేదు. మొహ మాటానికి పోవద్దని నేను దానికి చెప్పాను. వీసా దొరికితే వదినగారిని ఆస్ట్రేలియా తీసుకువెళ్ళమని కూడా గట్టిగానే చెప్పాను" లంచ్ బాక్స్ సర్దుతూ అంది కమల.

"అత్తమ్మ, ఒకసారి మనం వెళ్లి ఆవిడ్ని చూసి వద్దాం" బత్తాయిరసం పిండి, గ్లాసులో పోసి అత్తగారి చేతికి అందిస్తూ శిరీష అంది.

"సుధ వచ్చాక వెళదాం. ఒక్కసారే కలిసి రావచ్చు" కళ్ళముందు వృద్ధాశ్రమం కదలాడుతుండగా చికాకుగా తలతిప్పు కుంటూ అందావిడ.

"అమ్మ, లాండ్రీ వాడు పోయిందనుకున్న కొత్త నీలం ప్యాంటు దొరికిందని మళ్ళి తెచ్చి ఇచ్చాడుట కదా" అన్నాడతను.

"ఆ గట్టిగా దబాయిస్తే తెచ్చి ఇచ్చాడు, లేకపోతే ఊరుకుంటానా. అన్నట్టు శిరీష, మర్చిపోయాను. ఈసారి చిట్టి పాట నీకే వచ్చిందిట. ఇందాక నువ్వు పిల్లలని స్కూల్లో దింపడానికి కిందకు వెళ్ళినపుడు నువ్వు ఫోన్ ఎత్త లేదని నాలుగో ఫ్లోర్ ఆవిడ వచ్చి చెప్పి మరీ వెళ్ళింది" అంది.

"అత్తమ్మ, సుధ కూడా వస్తుందిగా, ఆ చిట్టి డబ్బులతో మనం ముగ్గరం పట్టు చీరలు కొనుక్కుందాం" శిరీష చిరునవ్వుతో అంది.

"అంతా మీ ఆడవాళ్లకేనా. డబ్బులు కట్టిన మాకు ఏమి లేవా" అలకగా ముఖం పెట్టి అతను కావాలనే అన్నాడు.

కొడుకు కేసిచూసి నవ్వేస్తూ "అంతేగా మరి. సరదాలు అన్ని ఆడవాళ్ళకేరా" వంటింట్లోకి వెళుతూ అంది.

అతని చేతిలో లంచ్ కారియర్ పెట్టి, నిశబ్దంగా బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టి అత్తగారి వెనుకే లోపలికి తుర్రుమంది శిరీష.

అతని ముఖంలో ఆనందపు దీపావళి మెరుపులు మెరిశాయి.

"నీకు చిట్టి వచ్చినందుకు కిట్టి పార్టీ మనింట్లోనేట, అందుకే ఎంత మంది వస్తారో కనుక్కో, ఏం వంటలు చేయాలో చెప్పు. పోయినసారిలా హోటల్ నుంచి తెప్పించవద్దు" లోపల అంటోంది కమల.

"ఎందుకు శ్రమ పడటం అత్తమ్మా. ఆర్డర్ చేసేద్దాం'.

"ఇందులో శ్రమేమి ఉంది. నా వంటలు వాళ్ళకి రుచి చూపించాలి. మన భోజనాన్ని మళ్ళీమళ్ళీ వాళ్ళంతా గుర్తుపెట్టుకోవాలి. ఒకసారి లిస్టు వ్రాసు కుందాం. సరుకులు తెప్పించుకోవాలి కదా" కమల చేయి తుడుచుకుంటూ హాలులోకి వస్తూ ఉత్సాహంగా అంది.

అత్తా, కోడళ్ళు మెనూ మాట్లాడు కుంటూ ఎంతమంది అవుతారో, వంటలు ఏమి చేయాలో సోఫాలో కూర్చుని వ్రాసుకుంటున్నారు.

మహేంద్ర బూట్లు తొడుక్కుని, క్యారియర్ తీసుకోని ఆఫీసుకి కారులో బయలుదేరాడు. అఖండ సామ్రాజ్యాలు జయించిన చక్రవర్తుల ఆనందపు వెలుగు కాంతులన్ని ఇప్పుడతని ముఖంలో విరజిమ్ముతున్నాయి. అతనిప్పుడు సంసార మహాయుద్ధాన్ని గెలిచి సుస్థిర శాంతిని సాధించుకుని ఉత్తమ గృహస్థు జీవితాన్ని గడపబోతున్న మహాయోధ.

ముఖాముఖి

# బాలసాహిత్యమే జెండా.. అజెండా...

ప్రముఖ బాలసాహితీవేత్త
డా॥ పత్తిపాక మోహన్‌తో ఈ పక్షం ముఖాముఖి..



డా॥ సిరి
90006 46728

బాల సాహితీవేత్త, కవి, రచయిత, విమర్శకులు, సభా వ్యాఖ్యాత డా॥ పత్తిపాక మోహన్ 14 నవంబర్ 2021 రోజున విజయనగరం జిల్లా పార్వతీపురంలో 'శ్రీమతి మంచిపల్లి సత్యవతి స్మారక బాల సాహిత్య పురస్కారం' స్వీకరించిన సందర్భంగా... బాల సాహిత్య వికాస యాత్రలోని అనుభవాలను, జ్ఞాపకాలను మన కోసం 'బాలల దినోత్సవం' సందర్భంగా డా॥ పత్తిపాక మోహతో, మరో బాల సాహితీ వేత్త, కవయిత్రి, రచయిత్రి, దంత వైద్యులు డా॥ సిరి మాట ముచ్చట....

**సాహిత్యం వైపు మీ ప్రయాణం ఎలా జరిగింది, మీకు స్ఫూర్తి నిచ్చిన వ్యక్తుల గురించి చెప్పండి.**

నేను పుట్టి పెరిగింది నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సిరిసిల్లలో. మాది చేనేత వృత్తి వ్యాపార కుటుంబం. మా అమ్మ గంగాబాయి, బాపు పత్తిపాక లక్ష్మిరాజం. నా చిన్నప్పటి నుండి మాది పవర్‌లూమ్ బట్టల ఉత్పత్తి వ్యాపారం. ఇవ్వాళ్ళ తెలంగాణలో సిరిసిల్ల మరమగ్గాలకు ప్రధాన కేంద్రం. ఈ మరమగ్గాలను సిరిసిల్లలో తొలిసారిగా నెలకొల్పింది మా పెద్దతాత పత్తిపాక విశ్వనాథం. మాది ఇదే వ్యాపారం, మా బాపు రెండుసార్లు పురపాలక సంఘం కౌన్సిలర్‌గా ఉన్నారు. వివిధ నామినేటెడ్



పదవుల్లో పనిచేశారు. నా బాల్యం నుండి డిగ్రీ వరకు సిరిసిల్లలో గడిచింది. కాన్వెంట్ బడి నుండి బి.కాం వరకు మా ఊర్లోనే చదివిన. నాకు మా ఊరన్నా, మా ఊరి నుండి పారే మానేరన్న బాగా ఇష్టం. మా సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి జూకంటి జగన్నాథంగారన్నట్లు 'మానేరు మాకు జీవధారే కాదు, సాహిత్య జీవధాతువు కూడా', ఆ నీటి చైతన్యమే నన్ను తొలుత మనిషిగా, కవిగా నిలిపింది.

నా బాల్యంలోని మా ఇంటి వాతావరణమే నన్ను సాహిత్యం చదివేలా చేసింది. మా తాత, తాతమ్మల (తాత తల్లి) సాహచర్యం నాకు భూమిక నిచ్చింది. మా తాతమ్మ నన్ను ఒడిలో కూసుండబెట్టుకుని పాడిన 'ఏమిజూసి నేర్చినాడో ఎడ్డి రాజన్న.. బాగిర్థి శిరియాలా పానమే గంగో.. పానమే గంగో..' గేయం ఇప్పటికీ నాకు అర్థం దొరకని ఫజిల్. ఎనిమిదవ తరగతి వరకు నా బాల్యమంతా మా తాతతో గడిచింది. 'ఓనమాలకు ముందు కబీరును, అఆలకు ముందు అంబంబ జాంజాం.. జగదంబంబ జాంజాం అంటూ నేర్పారు మా తాత బ్రహ్మశ్రీ పత్తిపాక శంకరయ్య. చేనేత, పవర్‌లూమ్ వ్యాపారంతో పాటు పౌరోహిత్యం చేసారు, ఆనాడు సిరిసిల్లలో ఆయన ప్రముఖ సిద్ధాంతి కూడా, అచలయోగి కూడా. హైదరాబాద్ దళిత త్రయంలో ఒకరు ఆనాటి మంత్రి శ్రీ అరిగె రామస్వామికి మా తాత శిష్యులు, అచలబోధ వారి నుండి స్వీకరించారు. ఇదంతా చెప్పడానికి కారణం నేను పుట్టే నాటికే మా ఇంట్లో కులమతాతీమైన ఒక గొప్ప సంస్కృతి ఉంది. ముఖ్యంగా ప్రతి గురుపౌర్ణమి రోజున జరిగే గురుపూజ నన్ను చిన్నప్పటి నుండి బాగా ప్రభావితం చేసింది. ఎందరో ముస్లింలు మా తాత శిష్యులు. కులమతాల కతీతంగా గురుపూజ చేసే ఆ దృశ్యం యాదికొస్తే ఇప్పటికీ సంతోషంతో పాటు, ఆశ్చర్యం కలుగుతది.

మా బడికి విశాలాంధ్ర వ్యాన్ యాడాదికి రెండు మూడుసార్లు వచ్చేది.

అందులో రష్యన్ పుస్తకాలు అత్యంత తక్కువ ధరకు దొరికేవి. ముఖ్యంగా రష్యన్ బాల సాహిత్యం కొని చదివేవాళ్ళం. మా సిరిసిల్ల గ్రంథాలయంలో వేలాది పుస్తకాలు ఉండేవి. నా దగ్గర రెండు మూడు లైబ్రరీ కార్డులు ఉండేవి. సంగీతం రంగదాస్ పాన్‌షాప్ లైబ్రరితో పాటు మా సిరిసిల్లలో పుస్తకాలు కిరాయికి ఇచ్చే లైబ్రరీలు అనేకం ఉండేవి. డిటెక్టివ్ షాడో నుండి మల్లాది వెంకటకృష్ణమూర్తి వరకు అక్కడ కిరాయికి తీసుకుని చదివేవాణ్ణి.

ఇంటర్, డిగ్రీలో సినారె, కనపర్తి, జి.రాములు, మామిడిపల్లి సాంబకవి రచనలు చదివాను. జక్కని వెంకటరాజం, డా.వడ్డేపల్లి కృష్ణ, డా.తిరుమల శ్రీనివాసాచార్య, డా.జె.బాపురెడ్డి ఐ.ఎ.ఎస్ వంటి కవులు అప్పటికే మాకు పరిచయమైన మా ప్రాంత కవులు. డిగ్రీకి వచ్చాక నా ఆలోచనాలోచనాల్ని ప్రభావితం చేసిన కవులు జూకంటి జగన్నాథం, డా.నలిమెల భాస్కర్, డా.ఎన్.గోపి, అలిశెట్టి ప్రభాకర్‌లు, గూడూరి సీతారాం మొదలగువారు.

**సభా వ్యాఖ్యాత, కవి, వ్యాసకర్త, బాల సాహితీవేత్త, సాహిత్య సంస్థల నిర్వహణ ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి?**

తొలి కవిత ఏడవ తరగతి చదివేప్పుడు రాసిన. అది మా తెలుగుసార్ టంకసాల దేవదాస్‌రావు సార్ ప్రోత్సాహంతో. ఏడవ తరగతిలోనే అప్పటి మా ఉపాధ్యాయులు బోయిని లక్ష్మణ్ సార్, పోతుగంటి బాల్‌రెడ్డి సార్లు రంగస్థలంపై అవకాశాన్ని ఇచ్చారు. బడి వార్షికోత్సవంలో రికార్డింగు డాన్సులకు కూడా చేసేవాళ్ళం. ఇక వ్యాఖ్యానం విషయంలో నన్ను ఎదిగేలా చేసింది మా నవీన యువజన సంఘం గణపతి ఉత్సవాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికలు. 1984-85 ప్రాంతం నుండే వివిధ కార్యక్రమాల్లో మాట్లాడేవాణ్ణి. అప్పటికి వ్యాఖ్యానం ఒక రంగంగా స్థిరపడలేదు. ప్రతిరోజు పాఠశాల ప్రార్థనా సమావేశాన్ని నిర్వహించే దగ్గర నుండి, జిల్లాలో జరిగే సాహిత్య




సాంస్కృతికోత్సవాల నిర్వహణ వరకు, మా సిరిసిల్ల గల్లీ నుండి రవీంద్ర భారతి వేదికకు, అక్కడి నుండి ఢిల్లీ వరకు వ్యాఖ్యాన ప్రస్థానం సాగింది. డా. సినారె 64వ జన్మదినోత్సవం 'అరవై నాలుగు వసంతాల సినారె' కార్యక్రమ వ్యాఖ్యానం రాష్ట్రస్థాయిలో గుర్తింపు నివ్వగా, 'వ్యాఖ్యాదక్షుడు' అంటూ సినారె ఇచ్చిన కితాబు మరింత ముందుకు వెళ్ళేలా చేసింది. 'సాక్షి' దినపత్రిక తొంభయ్యవ దశకంలో 'వ్యాఖ్యానం కళా రంగంగా స్థిరపడేందుకు కృషిచేసినవారిలో ఒకరు' అని రాసింది. ఇప్పటికీ అవకాశం కలిగినప్పుడల్లా వ్యాఖ్యానం చూస్తూనే ఉంటాను.

ఏడవ తరగతిలో 'ఓటు'పై రాసిన తొలి కవితతో మొదలైన సాహితీ ప్రస్థానం తరువాత వ్యాసాలు, ఇతర ప్రక్రియలు, వివిధ సాహిత్యరూపాల్లో రచనలు చేయించింది. ముఖ్యంగా ఆనాటి పత్రికలు కొత్తగా రాస్తున్న నాలాంటి వారిని ప్రోత్సహిస్తూ వ్యాసాలు ప్రచురించేవి. నా వ్యాసరచనా ప్రస్థానంలో తొలుత వెన్నుతట్టింది రుద్ర రవి, నలిమెల, జూకంటిలైతే, సాహిత్య వ్యాసాలు అచ్చువేసింది డా.అప్సర్, చల్లా శ్రీనివాస్, ప్రసేన్, డా. వాసిలి వసంత్ కుమార్‌లు. సినిమా వ్యాసాలు రాయించింది అబ్దుల్ బాయ్. తరువాత అనేక పత్రికలు వ్యాసాలు ప్రచురించాయి.

ఇక బాల సాహిత్యం విషయంలో నేను తొలుత ఇద్దరిని జ్ఞాపకం చేసుకోవాలి. మొదట ఆనాడు నేను పనిచేసిన ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ టౌన్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు. వాళ్ళకోసం 'మన కవులు' పేరుతో తెలుగు కవుల సంక్షిప్త పరిచయాలు రాసాను. ఇక రెండవవారు ఆ పరిచయాలను 'పిల్లల కోసం మన కవులు' పేరుతో దాదాపు మూడేండ్లు 'మొగ్గ'లో అచ్చువేసిన తిరుగనరి వేదాంతసూరి. తరువాత ఇదే పేరుతో పుస్తకంగా తెచ్చాను. అందుకు కారణం పెద్దలు సదాశివ సారు. అప్పటికే సిరిసిల్లలో ప్రసిద్ధులైన ఎర్రోజు సత్యం, జి.రాములు, గర్శకుర్తి రాజేంద్ర, ఎర్రోజు ఆదినారాయణ, రేగులపాటి కిషన్‌రావు వంటివారి బాల సాహిత్యాన్ని బాగా చదువుకున్నాం. ముఖ్యంగా బడి ప్రార్థనలో జి.రాములు సార్ బాలనీతి పద్యం ప్రతీరోజు తప్పనిసరిగా ఉండేది. పిల్లల వ్యాసాలు అచ్చుకావడం, బడి పిల్లలు, సదాశివ మొదలు ఎందరో ప్రముఖులు ఉత్తరాలు, ఫోన్ల ద్వారా ప్రోత్సహించడం అప్పటి వరకు చదివి, విని, ఆనందించిన బాల సాహిత్యం వైపు మరలేలా చేసింది. తొలి నుండి మా ఇందిరక్క ప్రభావం బలంగా ఉంది. మా మారసం ఉపాధ్యక్షులు కందేపి రాణీప్రసాద్ అప్పటికే బాల సాహిత్యాన్ని విరివిగా రాస్తోంది. మన కవులతో ప్రారంభమైన బాల సాహిత్య రచన ఇవ్వాళ్ళ నలభైకి పైగా పిల్లల పుస్తకాల అనువాదం, డజను పుస్తకాల రచనకు ప్రోత్సహించింది.

**1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'తొలి యువ విశిష్ట సాహిత్య పురస్కారం' అందుకున్నారు కదా, ఆ స్ఫూర్తి ఎలాంటిది..?**

1994లో తొలి కవితా సంకలనం 'ఖడ్గధార' నలుగురు మిత్రులం నేను, ఎలగొండ రవి, సామల మహేశ్, కనపర్తి ప్రదీప్ కలిసి తెచ్చాం. తరువాత అయిదుగురు మిత్రులం 'సముద్రం'

తీసుకు వచ్చాం. ఉస్మానియా తెలుగుశాఖ విద్యార్థిగా మిత్రులతో కలిసి మరో రెండు కవితా సంకలనాలు తెచ్చాను. తరువాత 'బంతిపూలు,', 'కౌముది' పుస్తకాలు వచ్చాయి. 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను ప్రోత్సహించడానికి యువ పురస్కారాలు ప్రారంభించింది. తొలి పురస్కారం యువకుల విభాగంలో నాకు లభించగా, యువతుల విభాగంలో చంద్రలతకు లభించింది. అటుతరువాత డా. తిరునగరి శ్రీనివాస్ అందుకున్నాడు. మరో రెండు సంవత్సరాల తరువాత ఆ పురస్కారాలు ఆగిపోయాయి. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రుల చేతుల మీదుగా దేశవ్యాప్తంగా వచ్చిన వేలాది మంది యువతరం సమక్షంలో అందుకున్న తొలి పురస్కారం తాజా తనం ఇప్పటికీ యాదికుంది.

**కవిత్వం నుండి అనువాదం వరకు అన్ని రంగాల్లో అభినివేశమున్నా 'బాల సాహిత్యం' వైపు ప్రధానంగా దృష్టిని పెట్టడానికి కారణం...?**

'ఎల్లలు, కల్లలు ఎరుగనిది పిల్లల లోకం.' ... ఏ దేశం బాలలకు, వారి సాహిత్యానికి ప్రాధాన్యతనిస్తుందో ఆ దేశం అభివృద్ధిన పయనిస్తుంది అన్న ఆంగ్ల బాల సాహితీవేత్త మాటలు, ఖలీల్ జిబ్రాన్ పిల్లల గురించి చెప్పిన విషయాలు ఎప్పుడూ వెంటాడేవి. దీనికి తోడు మా సిరిపూర్ బడి, నాగారం బడి పిల్లల కోసం రాయాలి, పిల్లల కోసం చదవాలి అనిపించేలా చేశాయి. మా పిల్లలు నేను చెప్పే కథలను ఎంతో ఆసక్తిగా వినేవాళ్ళు. గేయాలు, పద్యాలు పాడినప్పుడు ఉత్సాహంగా లయకు అనుగుణంగా అందరూ గంతులువేస్తూ ఆడుతూ, పాడేవారు. ముఖ్యంగా 'అమ్మ మొదటి దైవము', 'బిస్కెట్ల బండి మీద బావచ్చిండు' వంటి గేయాలకు మా పిల్లలు చేసే అభినయాన్ని చూసి 'పావు పావు మంటూ ఎర్ర బస్సు వచ్చింది / బస్సులోన ఎక్కి మా పంతులమ్మ వచ్చింది' గేయం రాశాను. మా పిల్లలకు నచ్చడమే కాక చక్కగా అభినయిస్తూ పాడేవారు. ఆ ఉత్సాహమే 'చందమామ రావే....' బాలల గేయాల సంకలనం. తరువాత సాహిత్య విమర్శ, పిహెచ్.డి పరిశోధనా గ్రంథం, రెండు నానీల సంపుటాలు, 'తెగినపోగు' పేరుతో రాసిన తొలి చేనేత దీర్ఘ కవితలు రాసినా విధిగా ప్రతియేడు బాల సాహిత్యాన్ని రాసి ప్రచురించాను.

దీనికి తోడు 2007లో కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా మంత్రిత్వశాఖ ఆధీనంలోని నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియాలో తెలుగు సంపాదకునిగా చేరేందుకు ఢిల్లీ వెళ్ళడం నా బాల సాహిత్య రచనలో గొప్ప మలుపు. ఎన్.బి.టి ప్రచురించిన బాల సాహిత్యం బడి నుండే చదివేవాణ్ణి. ముఖ్యంగా 'నెహ్రూ బాల పుస్తకాలయం' శీర్షికలో వచ్చిన పిల్లల పుస్తకాలు ఆకర్షణగా ఉండేవి. అటువంటి పిల్లలు పుస్తకాలు ప్రచురించే సంస్థలోనే చేరడంతో బాల సాహిత్యానికి మరింత దగ్గరయ్యాను. వందలాది మంది బాలల రచయితలు, అనువాదకులతో పనిచేసే అవకాశం లభించింది. దీనికి తోడు దేశ విదేశాల్లో జరిగిన పుస్తక మేళాలు, కార్యశాలలు, సదస్సుల్లో పాల్గొన్న సందర్భంగా ఆయా దేశాలు బాలల కోసం, వాళ్ళ సాహిత్యం కోసం చేస్తున్న కృషి బాగా నచ్చింది. మనం రాసింది పిల్లలు చదవడం కాదు, వాళ్ళకు ఏం కావాలో దానిని అందించాలన్న సంకల్పంతో బాల సాహిత్య రచన చేశాను. అటు ఉద్యోగరీత్యా, ఇటు మారసం ఇతర సంస్థలతో కలిపి ఆ దిశగానే పుస్తకాలు పిల్లలకోసం తెచ్చాను.

**తెలుగు రాష్ట్రాల్లో ఇవ్వాళ్ళ బడి పిల్లల సృజనాత్మక రచనా కార్యశాలల సంస్కృతి గొప్పగా వ్యాపించింది.. ఈ దిశగా మీరు వేసిన బాట గురించి చెబుతారా..?**

నిజానికి నేను 2007లో ఉద్యోగరీత్యా ఎన్.బి.టిలో చేరిన తర్వాత ఎక్కువ కార్యశాలలు, ఉద్యోగరీత్యా, వ్యక్తిగతంగా, మిత్రులు, సంస్థలతో కలిపి నిర్వహించాను. కానీ వీటికి తొలి బీజాలు 1996-97 ప్రాంతంలోనివే. బి.ఎస్. రాములు, నిజాం వెంకటేశంలతో మానురు కవులకు వివిధ అంశాలపై ప్రసంగాలు, కార్యశాలలు సిరిసిల్లలో జరిపినం. 1997లో స్వతంత్ర్య భారత స్వర్ణోత్సవాల సందర్భంగా 'స్వర్ణభారతికి బాల భారతి కవితా నీరాజనం' పేరుతో కవి సమ్మేళనం, పుస్తకం తెచ్చాం. ఇవన్నీ బాలల కార్యశాలలకు పూతాన్నిచ్చాయి. దీనికి తోడు గరిపెల్లి అశోక్ ముస్తాబాద్ కేంద్రంగా నిర్వహించిన పిల్లల సృజన కార్యక్రమాలు, డా.వి.ఆర్ శర్మ, డా.సిరి మరి కొందరు మిత్రులు తోడుగా నిలవడం నేను తలపెట్టిన పిల్లల కార్యశాలల సంస్కృతికి పరిపూర్ణతనిచ్చింది. దీనికి తోడు తెలంగాణా ఆవిర్భావం తర్వాత తెలంగాణ సాహిత్య అకాడమి, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, కేంద్ర సాహిత్య అకాడమితో పాటు దాదాపు యాభైకి పైగా ఇతర సాహిత్య సాంస్కృతిక సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు కార్యశాలలను విస్తృత స్థాయిలో జరిపి పిల్లల్లో సృజనను వెలికితేసేందుకు కృషిచేశారు. వీటన్నిటి ఫలితమే ఒక్క దశాబ్ది కాలంలో వందలాది











పిల్లల పుస్తకాలు రావడం. ఇవ్వాళ్ళ తెలుగునాట ప్రతి వారం, పది రోజులకు ఏదో ఒకచోట పిల్లల కోసం ఒక కార్యశాల జరగడం అభినందనీయం. ఒక్క తెలంగాణ సాహిత్య అకాడమీ వారే దాదాపు 50 కార్యశాలలకు ఆర్థిక సహకారం అందించారు. ఇంకా ఎన్.బి.టి., కేంద్ర సాహిత్య అకాడమి, రంగినేని చారిటబుల్ ట్రస్ట్, డా.చింతోజు బ్రహ్మయ్య ట్రస్ట్, వర్ణన, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటి, ఎస్వికె వంటివి కూడా హితోధికంగా తోడ్పడ్డాయి.

మా వంతుగా దాదాపు ప్రతికార్యశాలలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. పిల్లల కోసం సిరిసిల్ల కేంద్రంగా రంగినేని లక్ష్మి పిల్లల పండుగ నేపథ్యంగా రెండు మూడు రోజుల నిడివితో కార్యశాలల కార్యసారిణి రూపొందించి నిర్వహించడం ప్రారంభించాం. తరువాత దాదాపు అందరూ అదే పద్ధతిలో కార్యశాలల నిర్వహణ జరిపారు. ఇంకా జరుగుతున్నాయి. కార్యశాల నిర్వహణ పద్ధతుల గురించి నేను పైన చెప్పిన మిత్రులతో కలిసి విధివిధానాల పుస్తకం రూపొందించినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఇంకా అచ్చులోకి తేలేదు. ఇక్కడ ఇంకొకరి గురించి చెప్పాలి, ఇవ్వాళ్ళ ఈ కార్యశాలలు విరివిగా సాగుతున్నయి, కానీ 16 యేండ్ల క్రితం నుండి హైదరాబాద్ నగరంలో పిల్లల కోసం కార్యశాలలు నిర్వహించి, నగదు బహుమతులు అందించి, పిల్లల్లో గొప్ప స్ఫూర్తిని నింపుతున్నది శ్రీమతి మాడభూషి లలితమ్మ. కోవిడ్ కారణంగా గత సంవత్సరం జరపలేదు కానీ పద్నాలుగు ఏండ్లుగా నిర్విఘ్నంగా వీరి కార్యశాలలు, ఆ కార్యశాలల్లో వచ్చిన కథల పుస్తకాలు అచ్చవుతూనే ఉన్నాయి. ఇటువంటి అజ్ఞాత చైతన్య స్ఫూర్తికిరణాలు అనేక మంది ఉన్నారు.

**తెలుగులో వస్తున్న బాలల సాహిత్యాన్ని, వికాస కార్యక్రమాల్ని చూస్తున్నారు కదా! ఇప్పటి బాల సాహిత్యం ఎలా వస్తోంది.. ఇంకా ఏమేం మార్పులు రావాల్సి ఉంది...**

నా చిన్నప్పటికీ ఇప్పటికీ పోల్చిచూస్తే రాశిలోనూ.. వాసిలోనూ ఎక్కువ బాల సాహిత్యం ఇవ్వాళ్ళ తెలుగులో వస్తోంది. కేవలం వస్తువు, కథా కథనాలు, ఇతివృత్తం వంటివాటి విషయాల్లోనే కాక అచ్చులోనూ అదే స్థాయిలో ఉంటోంది. ముద్రణ, బొమ్మలు, రంగుల చిత్రాలవంటి సాంకేతిక అంశాల్లోనూ గతంలో కంటే కొద్దిగా ఉన్నతంగా వస్తోంది. కారణాలు ఏవైనా వందలాది మంది సృజనకారులు, సాహితీవేత్తలు పిల్లల కోసం రాస్తున్నారు. డెబ్బై ఎనభైయవ దశకంలో ఏవిధంగా ప్రతి రచయిత పిల్లల కోసం తమ బాధ్యతగా రాశారో మళ్ళీ అంతే నిబద్ధతతో పిల్లల కోసం రచనలు చేయడం మంచి శకునం.

మీరు అడిగినట్టు తెలుగు బాల సాహిత్యం ఎలా వస్తోంది.. అన్నప్పుడు కొంత ఇబ్బంది పడక తప్పదు. ఉద్యోగ రీత్యా యాభై భారతీయ భాషల్లో (ఆంగ్లంతో కలిపి) బాల సాహిత్యాన్ని ప్రచురిస్తున్న నేషనల్ బుక్ ట్రస్ట్లో తెలుగు సంపాదకునిగా పనిచేస్తున్నాను. ఈ క్రమంలో ఆయా భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని, వస్తువు మొదలు సాంకేతిక విషయాల వరకు చూస్తే మనం కొంత వెనుకే ఉన్నాం. అయితే నేను పైన పేర్కొన్నట్టు గతంలోకంటే మెరుగే. చందమామ, బాలమిత్రలు మనం చదివినప్పుడు మనకు కనిపించిన రంగాపురం, రామాపురాలు, విజ్ఞాన అంశాల పేరుతో తోటకూరలు, పాలకూరలు ఇంకా కథల్లో చోటుచేసుకోవడం, పాత కథలే మళ్ళీ కొత్త రూపంలో రావడం కొంత ఇబ్బందిని కలిగించేదే. కంప్యూటర్లు, ల్యాప్టాప్లు, సెల్ఫోన్లు, టి.విలు ఇలా సాంకేతికంగా అనేక విధాలుగా అభివృద్ధి చెంది ఆ ఫలితాలను అనుభవిస్తున్నప్పటికీ వస్తువు విషయంలో ఇంకా ముప్పైయేండ్ల వెనకే ఉండడమొక్కటే ఆలోచించాల్సిన విషయం.

ఇక మార్పులు చేర్పులు అంటూ పెద్దగా ఏమీ లేవు కానీ మనం మనకు నచ్చినవి కాక పిల్లల స్థాయికి ఎదిగి వాళ్ళకు అవసరమైనవి రాయగలిగితే తప్పకుండా మన రచనలు పిల్లలను ఆకర్షించడమే కాక ఆనందాన్ని కలిగిస్తాయి. బాల సాహిత్యం అనగానే నీతి చెప్పడం, బుద్ధిని బోధించడం లేదా మంచి, చెడులు వంటి విషయాలు పక్కకు పెట్టి నిజజీవితంలోని సంఘటనలు, పిల్లలకు చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగించే విషయాలు పిల్లలకు చెబితే బాగుంటుందని నా అభిమతం. ఇవేగాక నేటి సాంకేతిక యుగంలో వేలాదిగా వైజ్ఞానిక ఆవిష్కరణలు జరుగుతున్నాయి. వాటిని పరిచయం చేయడం, వాటి ఆవిర్భావ, ఆవిష్కరణల వెనుక ఉన్న కృషిని తెలిపితే బాగుంటుంది. మన బాల్యంలో మనను పంచతంత్రం కథలు, జంతువుల కథలు భలేగా ఆకర్శించాయి. ఆసక్తిని రేకెత్తించడమే కాక మనలను అద్భుతలోకాల్లో విహరింపజేశాయి. నేటి పిల్లలకు కూడా అవే నచ్చుతాయని అనుకుని కేవలం వాటినే రాయడం బాగుండదేమో! పంచతంత్రం కథలను నేటి పిల్లలకు తగినట్టుగా కొత్తగా చెప్పొచ్చు. ఇటీవల గరిపల్లి అశోక్ మనకు తెలిసిన 'ఆవు-పులి కథ' ను కొత్త కోణంలో చెబుతూ అనేక కథలు రాశాడు. ఇలా వస్తువు విషయంలో నవ్యత, భాష విషయంలో పిల్లవాళ్ళకు తెలిసిన భాషను ఉపయోగిస్తే ఇంకా చక్కని బాల

ముఖాముఖి

సాహిత్యం వస్తుంది.. రావడమే కాదు అది పిల్లలకు బాగా నచ్చుతుంది.

**బాల సాహిత్య వికాసం, కార్యశాలలు, బాల సాహిత్య అనువాదాల వంటివి చర్చించినప్పుడు మీరు ముందు వరుసలో కనిపిస్తారు. మరి బాల సాహిత్య రంగంవైపుకు మీ మనసు ఎలా మళ్ళింది? మీ బాల సాహిత్యం.. అనువాదాలు.. ఇతర అంశాల గురించి చెబుతారా..?**

నేను పైన చెప్పినట్టు 'పిల్లల కోసం మన కవులు' పేర రాసిన శీర్షిక నాకు పేరును, ఎందరో పిల్లలు, పెద్దలను పరిచయం చేసింది. మొబైల్ ఫోన్లు లేని ఆ సమయంలో వచ్చిన ఉత్తరాలు, ఫోన్లు ఎంతో ఉత్సాహాన్ని నింపేవి. అన్నింటికి మించి సామల సదాశివ గారు 'పిల్లలకే కాదు నావంటి రాసే వాళ్ళకు కూడా ఉపయోగ పడతాయి' అంటూ ఇచ్చిన కితాబు మరింత ఉత్సాహాన్నిచ్చింది. పత్రికల్లో పిల్లల కోసం రాసినన్ని రోజులు ఎంతోమంది ఫోన్లు ఉత్తరాల ద్వారా స్ఫూర్తిని కలిగించారు. వారిలో డా. ద్వానాశాస్త్రి, రెడ్డి రాఘవయ్య, వెలగా వెంకటప్పయ్య వంటి వాళ్ళున్నారు.

నా రచనల్లో నా ముద్ర విషయానికి వస్తే బాల గేయాల పేర వచన కవితలు వంటివి రావడం చూసాను. పిల్లలను అవి అంతగా ఆకర్శించలేవు. 'శిశుర్వేత్తి పశు ర్వేత్తి వేత్తి గాన రసం ఫణి' అని కదా! పిల్లలను గేయం చక్కగా ఆకర్శిస్తుంది, ఆనంద పరుస్తుంది. అలా నా 'చందమామ రావే' గేయం సంపుటి వచ్చింది. తర్వాత చాలా గేయాలు రాసాను. 2018లో నన్ను మా సిరిసిల్ల పురపాలక సంఘం 'స్వచ్ఛ భారత్ అంబాసిడర్'గా నియమించి గౌరవించారు. బాల సాహిత్యాన్ని ఎక్కువగా సృజిస్తున్న వాడిగా నా 'స్వచ్ఛ సర్వేక్షణ ఉద్యమం'ను బడి నుండి మొదలు పెట్టాలని నిర్ణయించుకుని పిల్లలకోసం తొలి స్వచ్ఛ సర్వేక్షణ గేయ సంకలనాన్ని 'ఆకుపచ్చని పాట'ను తెచ్చాను. నేను, మరో ముగ్గురు పెద్దలు దాదాపు 5000 ప్రతులను ప్రచురించి ఉచితంగా పిల్లలకు అందించాం. మరుగుదొడ్ల ఉపయోగం, వాటి ప్రాముఖ్యతను తెలుపుతూ 'ఆరు బయట' పేరుతో పలు గోడపత్రికలు తెచ్చాం. వీటిని బడి పిల్లలకు అందించాం. నా ముద్రగా వచ్చిన మరో రెండు పుస్తకాలు 'ఒక్కేసి పువ్వేసి చందమామ' బాలల బతుకమ్మ గేయాలు, 'అఆఇఈ' బాల లయలు.

బతుకమ్మ ఆట, పాట తెలంగాణ పిల్లలు ఉగ్గుపాలతో నేర్చుకుంటారు. అది ఇక్కడి సంస్కృతిలోని భాగం. అయితే నా చిన్నప్పటి నుండి చూస్తున్నాను, పిల్లలు పెద్దలు అందరు 'శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ' అంటూ పాడుకోవడం తెలుసు, మా అమ్మ అదే పాడింది, నా భార్య అదే పాట పాడుతూ బతుకమ్మ ఆడింది. మా అమ్మాయి వేద సంహిత కూడా అదే పాటను పాడడం చూసాను. పిల్లల కోసం బతుకమ్మ 'బాలల బతుకమ్మ గేయాలు' ఎందుకు రాయకూడదు? అన్న ఆలోచన కలిగి మూడు రోజుల్లో పూర్తిచేసి పదహారు బాలల బతుకమ్మ గేయాలతో 'ఒక్కేసి పువ్వేసి చందమామ' పుస్తకం బతుకమ్మ కానుకగా 2018లో తెచ్చిన. మరో వయ్యి 'అఆ ఇఈ', ద్విపదల వంటి వీటిని నేను 'బాల లయలు' అన్నాను. ఆంగ్లంలో 'నాన్సెన్స్ రైమ్స్'ను మనకు తెలుసు. ఇవి అలాంటివే. కొన్నింటికి అర్థాలున్నాయి, మరికొన్ని కేవలం లయకోసం పాడుకుని ఆనందించేవి. ఇప్పుడు చాలా మంది బాల సాహిత్యకారులు లయలపేర ఇలాంటివి రాస్తున్నారు. వారిలో ప్రముఖ బాలసాహితీవేత్త స్వరాజ్యం రమణమ్మగారి 'బాలల లయలు', వడ్డేపల్లి సంధ్య గారి 'తారంగం తారంగం' బాల లయలు పుసకరూపంలో త్వరలో రానున్నాయి.




నాలుగు దశాబ్దాలుగా బాల సాహిత్యాన్ని చదువుతున్నాను. దాదాపు గత రెండున్నర దశాబ్దాలుగా పిల్లలకోసం రాస్తున్నాను. వాటిలో కొన్ని పుస్తక రూపంలో వచ్చాయి, మరికొన్ని పత్రికల్లో శీర్శికలుగా వచ్చాయి. 'చందమామ రావే' పేరుతో మొదటి బాలగేయాల సంపుటి, 'వెన్నముద్దలు' పేరుతో రెండవ సంపుటి తెచ్చాను. స్వచ్ఛ సర్వేక్షణ్ అంబాసిడర్‌గా బాలల కోసం రాసిన పాటలు 'ఆకుపచ్చని పాట' పేరుగా తొలి స్వచ్ఛ సర్వేక్షణ బాల గేయాలు తెచ్చాను. 'ఒక్కేసి పువ్వేసి చందమామ' పేరుతో బాలల కోసం తొలి బతుకమ్మ గేయాలు తెచ్చాను. 'అఆఇఈ' బాల లయలు ఆంగ్లంలోని నాన్సెన్స్‌రైమ్ దృష్టిలో పెట్టుకుని రాసాను. మహాకవి సినారె జీవిత కథను 'పిల్లల కోసం సినారె కథ'గా, మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా పిల్లల కోసం 'బాలల తాతా బాపూజీ' గేయ కథ తెచ్చాను. ఇవేకాక 'పిల్లల కోసం మనపాటలు', 'వానా వానా వల్లప్పా' బాలల గేయాలను, 'ఆకుపచ్చని ఆశలతో..' బాలల పర్యావరణ కవితలను సంకలనంచేసి ప్రచురించాను. ఆంగ్లం, హిందీల నుండి ఇతర భారతీయ భాషలకు చెందిన 16 పిల్లల పుస్తకాలను తెలుగులోకి అనువాదం చేసాను.

'జయహొ! బాల సాహిత్యం' పేరుతో బాల సాహిత్య వ్యాసాలు ప్రచురించారు. తెలంగాణా ప్రభుత్వ తొలి ప్రాథమిక తరగతుల పాఠ్య పుస్తకాల సంపాదకవర్గంలో ఉన్నాను. రెండవ తరగతి నుండి అయిదవ తరగతి పుస్తకాల సంపాదకుల్లో ఒకడిని. మహారాష్ట్ర పాఠ్య పుస్తక నిర్మితి సమితి ప్రచురించిన తెలుగు పాఠ్య పుస్తకాలలో నా రచనలకు స్థానం లభించింది.

**బాల సాహిత్యం పిల్లలకు ఎలా ఉపయోగపడుతుంది? బాల సాహిత్య కారుల రచనలను పిల్లలు ఏమేరకు చదువుతున్నారు?**

బాల సాహిత్యం బాలల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుంది. మీరు ఏ రచయితనైనా, వివిధ రంగాల్లో అంచుల్ని ముట్టినవారినైనా అడగండి వాళ్ళ వాళ్ళ బాల్యాల్లో వాళ్ళను ప్రభావితం చేసిన సాహిత్యం గురించి చెబుతారు. అది మౌఖిక సాహిత్యం కావచ్చు, లిఖిత సాహిత్యం కావచ్చు, మరేదైనా రూపంలోనిది కావచ్చు. గాంధీ మహాత్ముని ఆత్మకథ చదివితే ఆయనపైన ప్రభావాన్ని చూపించిన సాహిత్యం గురించి తెలుస్తుంది. ఒక్కరేమిటి మీరు ఎవరినైనా కదిలించండి... బాల్యంలో వాళ్ళపై ఉన్న బాల సాహిత్య ప్రభావాన్ని గురించి చెబుతారు. ఎదుగుతున్న తీగను పారించేందుకు ఆసరాను కల్పిస్తే ఆ తీగ ఎంత బాగా పైకి ఎక్కుతుందో బాలలకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని కలిగించే రంజింపజేసే సాహిత్యాన్ని ఏ రూపంలోనైనా సరే అందించాలి అప్పుడే ఆ తరం ప్రతిభావంతమైన తరంగా ఎదుగుతుంది. ఇక బాల సాహిత్యకారుల రచనలు, వాటిని పిల్లలు ఏ మేరకు చదువుతున్నారు అనేది మాట్లాడుకున్నప్పుడు కొన్ని విషయాలు చర్చించుకోవాలి. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు మా బడిలో, మా సిరిసిల్ల గ్రంథాలయంలో వందలాది పుస్తకాలు ఉండేవి. వాటిని మా సార్లు మాకు ఎంతో ప్రేమతో ఇచ్చేవారు. చింతా దీక్షితులు, కవిరాజు, వెలగా వెంకటప్పయ్య, రెడ్డి రాఘవయ్య, డా.మలయశ్రీ, వేజేండ్ల వంటి వాళ్ళ పుస్తకాలు ఉండేవి. దాశరథి, సినారెల బొమ్మల బాలసాహిత్యం ఉండేవి. ఇవన్నీ చదివాను. వీటికి తోడు రష్యన్ రాదుగ, ప్రగతి ప్రచురణ సంస్థ పుస్తకాలు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా, చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్ పుస్తకాలు చదివేవాళ్ళం.

**బాల సాహిత్యంలో మీరు అందుకున్న పురస్కారాలు.. గౌరవాలు..**

బాల సాహిత్య పురస్కారాలకు ముందు యువ పురస్కారం గురించి చెప్పాలి. 1996లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అన్ని రంగాల్లోని యువతను ప్రోత్సహించేందుకు 'రాష్ట్ర యువ విశిష్ట సాహిత్య పురస్కారం'ను ప్రారంభించగా మొదటి పురస్కారం రాష్ట్ర స్థాయిలో నాకు లభించింది. రవీంద్ర భారతిలో కన్నుల పండుగగా జరిగిన సభలో ముఖ్యమంత్రి చేతులమీదుగా పురస్కారం అందుకున్నాను.

ఇక బాల సాహిత్యం విషయానికి వస్తే వివిధ సంస్థలు పురస్కారాలను అందించి ఆశీర్వదించాయి. 'తెలుగు విశ్వ విద్యాలయం బాలసాహిత్య పురస్కారం'తో పాటు బాల సాహితీ వేత్తలు ప్రతిష్టాత్మకంగా భావించే గుంటూరు శ్రీ వేంకటేశ్వర బాల కుటీరం వారి 'డా. నన్నపనేని మంగాదేవి బాల సాహిత్య పురస్కారం' బాల సాహిత్య వికాస కార్యకర్తగా అందుకున్నాను. సింహప్రసాద్ సాహిత్య సమితి నుండి 'డా. వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం', బాల గోకులం, హైదరాబాద్ వారి 'బాల నేస్తం' అవార్డు, మై గిఫ్ట్ సంస్థ, కరీంనగర్‌వారి 'మై గిఫ్ట్ యువ పురస్కారం', 'డా. చింతోజు బ్రహ్మయ్య-బాలమణి బాల సాహిత్య వికాస పురస్కారం', 'సిరిసిల్ల జిల్లా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పురస్కారం', జైనీ ఇంటర్నేషనల్ వారి 'శ్రీమతి శకుంతలా జైని స్మారక తొలి బాల సాహిత్య పురస్కారం', తెనాలి పౌర గ్రంథాలయం వారిచ్చే మరో ప్రతిష్టాత్మక బాల సాహిత్య పురస్కారం 'సమతారావు బాల సాహిత్య పురస్కారం' అందుకున్నాను. ఇటీవల పార్వతీపురంకు చెందిన మంచిపల్లి ట్రస్టు 'శ్రీమతి మంచిపల్లి సత్యవతి స్మారక బాల సాహిత్య పురస్కారం', తెలంగాణ సాహిత్య కళాపీఠం, సిద్దిపేట 'ప్రజాకవి కాళోజీ బాల సాహిత్య పురస్కారం' ప్రకటించారు వీటిని స్వీకరించాల్సి ఉంది.

కవిత్వం, విమర్శ, పరిశోధనా రంగాల్లో తెలుగు విశ్వవిద్యాలయం వారి 'బెజవాడ పట్టాభిరామిరెడ్డి సృజనాత్మక రచనా కీర్తి పురస్కారం'తో పాటు జానుడి ఒంగోలు వారి 'మధురకవి మల్లవరపు జాన్ కవి స్మారక సాహితీ పురస్కారం', తెలంగాణ సారస్వత పరిషత్ వారి 'డా॥ తిరుమల శ్రీనివాసాచార్య సాహిత్య పురస్కారం', 'సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్ రావు సాహిత్య పురస్కారం', డా. మలయశ్రీ గారిచ్చే 'కాళోజీ సాహిత్య పురస్కారం', కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమి వారి 'గ్రామీణ కళాజ్యోతి పురస్కారం', 'కాళోజీ కర్మయోగి పురస్కారం', చీరాల సమతా సాహితీ వారి 'అంగలకుదుటి సుందరాచారి సాహిత్య పురస్కారం', సాయి అకాడమి వారి 'సినారె సాహిత్య పురస్కారం'తో పాటు మరో పదిహేను పురస్కారాలు లభించాయి. ఈ నవంబర్ పద్నాలుగున మంచిపల్లి సత్యవతి స్మారక పురస్కారం పార్వతీపురంలో అందుకుంటున్నాను.

**పిల్లల మనసు పుస్తకం వైపుకు మళ్ళించడానికి మీరిచ్చే సూచనలు, సలహాలు...**

పిల్లల తల్లితండ్రులందరు పిల్లల పెంపకం బాగా తెలిసినవాళ్ళే. వారిని పెంచి పెద్దచేసే క్రమంలో ఎన్నో విషయాల పట్ల శ్రద్ధను వహిస్తారు. వాళ్ళ ఎదుగుదల, ఉన్నతిని కాంక్షించి అన్ని సమకూరుస్తారు. నేను కూడా అదే చేస్తున్నాను. నేను మీ మాధ్యమంగా తల్లితండ్రులను చిన్న కోరిక కోరుతున్నాను. గతంలో చాలా సందర్భాల్లో మనవి చేసాను. అన్ని ఇచ్చినట్టే సాహిత్యాన్ని, పిల్లల అభిరుచులు, ఆలోచనలకు సంబంధించిన పుస్తకాలను వారికి అన్నివేళలా అందుబాటులో ఉంచే ప్రయత్నం చేయండి. అది వారిని పుస్తకాలవైపు మళ్ళిస్తుంది. మనం చాలాచోట్ల చూస్తుంటాం, పుట్టినరోజు ఫంక్షన్లలో పిల్లల కోసం ఆట వస్తువులు, తినుబండారాలు పెడుతుంటారు. వాటిలాగే ఆయా కార్యక్రమాల్లో పుస్తకాలను అందుబాటులో ఉంచే సంస్కృతిని పెంచాలి. సూపర్ మార్కెట్లు, గుళ్ళు, మసీదులు, చర్చీలు వంటి ధార్మిక ప్రదేశాల్లోనూ, అన్ని స్థలాలలోను బాల సాహిత్యాన్ని ఉంచినట్లయితే బాగుంటుంది.

వ్యాసం

# పెంటమీది దీపాలు

తెలంగాణలోని మరుగున పడ్డ ఆచారాలు...




సుప్పని సత్యనారాయణ
94926 26910


తెలంగాణ నేలమీద ఏ మూలను గమనించినా అస్థిత్వపు భావజాలం ఉట్టి పడుతుంది. ఈ నేలకున్న మహత్తు ఏమిటో తెలియదు కానీ భిన్న రకాల సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలమై సంగీత, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మికతపరంగా ఎటువంటి కోణంలో దర్శించడానికి ప్రయత్నం చేసినా ఒక తెలియని అనుభూతిమయ వాతావరణమేదో మనను కమ్మేస్తుంది. ఇక్కడ జరుపుకునే ప్రతీ పండుగలకు, ఉత్సవాలకు మానవ జీవితంలోని ఏదో ఒక కోణంతో ముడిపెట్టబడి ఉంద నడంలో ఎంతమాత్రమూ అతిశయోక్తి లేదు.

**నేపథ్యం...**

సాధారణంగా ప్రతీయేడు ఆశ్వీయుజ బహుళ అమావాస్య శుభదినమున “దీపావళి పర్వదినము”ను జరుపుకోవడం తెలుగువారి సాంప్రదాయం. ఈ పర్వం వేదకాలం నుండి పరంపరగా వస్తుందని దీనివెనుక గల అనేకానేక వేదకాలం నుండి పరంపరగా వస్తుందని దీని వెనుకగల అనేకానేక పురాణగాథలను కూడా మనం ఎన్నో వింటాము. అయితే మూడు రోజులపాటు జరుపుకునే ఈ పండుగలో మొదటిరోజు ‘భోగి’ సాయంకాలం ఇంట్లో వుండే స్త్రీలు ఆవు పేడతో చేసిన ఐదు పిడకలను తయారుచేసి, వాటికి పసుపు కుంకుమలతో, పూలతో అలంకరించి పెడతారు. రెండవరోజు లక్ష్మీదేవి ఆరాధన. మూడవరోజు బలిపాడ్యమి దినమున నిర్వహించే కార్యక్రమమే ఈ ‘పెంటమీది దీపాలు’. ఈ కార్యక్రమముకు తెలంగాణ ప్రాంతీయులు అధిక ప్రాధాన్య ఇస్తారనే చెప్పాలి.

**పాడ్యమి శుభవేళ...**

దీపావళి అమావాస్య తరువాత వచ్చే పాడ్యమిని ‘బలిపాడ్యమి’ అని కూడా వ్యవహరిస్తారు. అయితే పాడ్యమి వేళ ఉదయం స్నానం, పూజ ముగించుకుని భోజనాంతరం (ముఖ్యంగా వ్యవసాయ దారులు) పొలం వద్దకు లేదా చేలగట్ల వద్దకు వెళ్ళి చీపురు కొయ్యలు (వీటిని కొన్ని ప్రాంతాల్లో దీవెన, దివిసెన కొయ్యలు అని కూడా పిలుస్తారు) తీసుకువచ్చి, వాటిని కుప్పెల మాదిరి చేతులతో అల్లి, వాటిలో ఆవు పేడను పెట్టి ఎండలోగాని, నీడలో గాని ఆరబెడతారు. సాయంత్రం సంధ్యాదీపం వెలిగించిన తర్వాత రెండు పాయలుగా ఉన్నటువంటి కర్ర. దీనినే ‘రిక్కల కర్ర’ అంటారు. ఇటువంటి కర్రకు అల్లినటువంటి వెదురు కుప్పెంను అమర్చి, అందులో రెండింటిలో రెండు చిక్కుడు ఆకులు వేసి, అందులో చమురు (నూనె) పత్తిగింజలతో బట్టలో కట్టిన మూటగానైనా సరే. లేక నవధాన్యాలతో చేసిన రెండు కాగడా వత్తులను నూనెలో కాసేపు నానపెట్టి, ఆనంతరం వాటిని ఆ రెండు దీపపు సిచ్చిలలో పెట్టి, కాసంత నూనె పోసి వెలిగించి, ఆ రిక్కల కర్రకు పూలమాలవేసి, అగరువత్తులు వెలిగించి, కొబ్బరికాయ, శర్కర నైవేద్యములను చూయించి, ముందుగా ఇంటికి యజమాని అయినటువంటి నాన్నగారు



పశువుల పాకలోకి వెళ్ళి పశువులకు ఆ దీపాలను చూయించి (మొక్కిపించి) అక్కడినుండి గ్రామం వెలుపల లేదా ఆరుబయట పశువుల పేడను 'పెంటకుప్ప'గా ఎక్కడైతే పోగుచేస్తారో అక్కడికి వెళ్ళి, ఆ పెంటపైన ఈ దీపపు కర్రను పాతి పాటలు పాడుకుంటూ ఇంటికి వస్తారు.

ఇంట్లో వున్న చిన్నపిల్లలు ఆనందంతో వెంట వెళ్ళి 'సురుసురు బత్తీలు, టపాకాయలు, చిచ్చరబుడ్లు కాలుస్తూ ఆనందంతో కేరింతలు వేస్తారు.

**ప్రకృతి ఆరాధనయే ప్రధానం...**

ఈ బలి పాడ్యమి పర్వదినము వెనుక జరిగే ఈ 'పెంటమీది దీపాలు' వెనుక మానవాళి ప్రకృతి ఆరాధనాతత్వం కూడా కనపడుతుంది. ముఖ్యంగా రైతు జీవనం గాడితప్పకుండా ఉండేందుకు, దినదినాభివృద్ధితో పురోగామిపథం వైపు నడిచేందుకు రైతన్న ముందు ప్రకృతిని దైవంగా పురోగామిపథం వైపు నడిచేందుకు రైతన్న ముందు ప్రకృతిని దైవంగా పురోగామిపథం వైపు నడిచేందుకు రైతన్న ముందు ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించేటువంటి ఒక గొప్పతత్వం మనకిందులో కనపడుతుంది.

పాడి పరిశ్రమ బాగా అభివృద్ధి చెందాలని పంటలు బాగా పండాలని మనసులో తలుచుకుంటూ ఆ దీపాలకు దండం పెట్టుకునే రైతన్న, పెంటను (పశువుల ఎరువును) లక్ష్మీదేవిగా భావించి ఆ దీపాల కాంతులు ప్రసరించిన ఎరువంతా ఒక తేజస్సును, మహత్తును సంతరించుకుంటుందని, ఆ ఎరువును పంటపొలాల యందు చల్లడం వల్ల చీడపీడల బారినుండి రక్షణ కలిగి, పంటలు బాగా పండి 'ధాన్యలక్ష్మి' కరుణిస్తుందనే ప్రగాఢమైన నమ్మకమును కలిగి వుంటారు. వర్షాకాలం పంటలు పండి, ధాన్యలక్ష్మి ఇంట్లో తిష్టవేసిన తరువాత జరుపుకునే ఈ పర్వదినం నేటికీ తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో జరుపబడుతూనే ఉంది. వర్షాకాలం పండిన పంటల మాదిరిగానే ఇకముందు కూడా సంవత్సరం పొడువునా పోగుచేసిన ఎరువును (పెంటలక్ష్మి) ఒక గొప్ప ఔషదంగా జాగ్రత్తపరుచుకుని, దైవంగా భావించే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. వ్యవసాయ ఆధారితమైన జీవన విధానమువే ప్రాథమిక స్థాయినుండి అలవర్చుకున్న రైతన్న నాటి కాలంలో కేవలం పశువుల ఎరువును మాత్రమే వాడి పంటలను పండించేవాడు. అందువల్ల ఆ ఆరాధన విధానం, ఆ పరంపర ఆచార సంప్రదాయాలలో భాగంగా నేటికీ కొనసాగడమనేది గొప్ప విషయం.

అయితే నేడు యాంత్రిక జీవన విధానముకు అలవాటు పడ్డటువంటి మనిషి అస్థిత్వ మూలాలను కనుగొనే విషయంలో మాత్రం విఫలుడౌతున్నాడనే చెప్పాలి. దీనివలన మన చరిత్రను మనమే గుర్తించలేని స్థితి ఏర్పడుతుందనడంలో ఎంతమాత్రమూ సంశయం లేదు.

---

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# పునాదుల్ని పెకలించే సుంకిరెడ్డి 'వినిర్మాణం'

మూలాల వరకు వెళ్ళిన రచన...



సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

సుంకిరెడ్డి సార్ ఏది రాసినా పర్‌ఫెక్షన్ కోసం వందకు వంద శాతం ట్రై చేస్తడు. అట్లా చేసే సమయంలో తాను శిష్యుల దగ్గరి నుంచి కూడా నేర్చుకోవ డానికి సిద్ధంగా ఉంటడు. ట్రై చెయ్యడమంటే ఏదో మొక్కుబడిగా కాకుండా శాయశక్తులా ప్రయత్నిస్తడు. ఆ ప్రయత్నం ఆయన రచనలన్నింటిలోనూ ఒక కాగడాలాగా వెలుగుతూ ఉంటది. అది కొత్తవాళ్లకు దారులు వేస్తది. తన నిక్కచ్చి రచనల మూలంగా ఆయన మీద చాలా మంది కక్ష పెంచుకున్నరు. అందుకు చాలా సార్లు హర్ట్ అయ్యిండు. అయినా 'తోవ' తప్పలేదు. షార్ట్ కట్స్ వెతకలేదు. అందలం కోసం అడ్డదార్లు తొక్కలేదు. నిజానికి సుంకిరెడ్డి కేవలం ఒక కవిగానే ఉండి ఉంటే ఆయన ప్రతిభకు కేంద్ర సాహిత్య అకాడెమీ లాంటి అవార్డులు దక్కేవి. అయితే తెలంగాణ ఉద్యమం ఆయన్ని ఒక్క కవిగానే గాకుండా సంస్థల నిర్మాతగా, భాషా సేవకుడిగా, ఉద్యమకారుడిగా, ఉపన్యాసకుడిగా, వక్తగా, పరిశోధకుడిగా, చరిత్రకారుడిగా, రచయితగా, ఇంటలెక్చువల్‌గా, ప్రచురణకర్తగా, పత్రిక, పుస్తకాల సంపాదకుడిగా, ప్రచారకుడిగా, ఇట్లా బహుముఖాలుగా పనిచేయించింది. సంవత్సరాల తరబడి కలకత్తా, మద్రాసు, హైదరాబాద్, వైజాగ్, కడప లైబ్రరీల



చుట్టూ తిప్పింది. నిజానికి ఇది తెలంగాణ అవసరం. ఈ అవసరానికి తగ్గట్టుగా బహుజనులతో కలిసి డికాస్టిపై అయి 'బహువచనం' తీసుకొచ్చిన నాటి నుంచి ఆయన అస్తిత్వ ఉద్యమాలతో మమేకమయిండు.

ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిగానే 'దశాబ్ది' కవితా సంపుటాలకు తెలుగునాట నాలుగు దశాబ్దాల కిందటే శ్రీకారం చుట్టిండు. చేతిల చిల్లి గవ్వలేకున్నా అష్టకష్టాలు పడి 'ఈ తరం యుద్ధ కవిత'ను తీసుకొచ్చిండు. అదే సమయంలో కొంత అతివాద వామపక్ష వాదులతో మమేకమయిండు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా శ్రీకాకుళంలో లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడు 'జముకు' బులిటెన్‌ని వెలువరించిండు. 'విపశ్యన కవిత్వం' (ఇతరులతో కలిసి) అల్లిండు. 'తోవ ఎక్కడ' అని ప్రశ్నించిండు. అయితే ఆయన తబాదలా పై సొంతం ప్రాంతం తెలంగాణకు వచ్చిన తర్వాత శ్రీకాకుళ అనుభవంతో ఇక్కడి ఉద్యమావసరాల్ని గుర్తించిండు. అందులో భాగంగానే మొదట సాహితీ రంగాన్ని ఎంచుకొని నల్లగొండ నుంచి మిత్రులు/శిష్యులను కలుపుకొని 'నీలగిరి సాహితి'ని ఏర్పాటు చేసిండు. తెలంగాణ స్పృహతో 'తెలంగాణ సాంస్కృతిక వేదిక'ను ఇతర మిత్రులతో కలిసి 1998లో నిర్మించిండు. ఇది మొదలు తెలంగాణపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేసిండు. 'సింగిడి'లో భాగస్వామి అయ్యిండు. 'ముంగిలి', తెలంగాణ చరిత్ర, గనుమ, దాలి, నల్లవలస (ఇతరులతో కలిసి), తావు రచనలను వెలువరించిండు. అన్నీ తెలంగాణ ముద్రను బలంగా ప్రతిఫలింప జేశాయి. అంబటి సురేంద్రరాజుతో కలిసి తెలంగాణ ఆధునిక కవిత్వాన్ని 'మత్తడి' దుంకించిండు. మేమిద్దరం కలిసి '1969-73' ఉద్యమ కవిత్వాన్ని ఒక్కదగ్గరికి తెచ్చినం. ఆయన రాసిన ఏ అక్షరం బట్టుకున్నా పీడితుల స్వరం వినిపిస్తది. ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తది. కవులు/ రచయితలు నిరంతరం ప్రతిపక్షంగా ఉండాలని బలంగా నమ్ముతాడు,

ఆచరిస్తాడు. నిరంతర పరిశోధన ద్వారానే కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని, మరుగున పడేసిన విషయాలు పునాదుల నుంచి తవ్వుకుంటూ వస్తే గానీ చరిత్రకెక్కవు అని నమ్మిన తెలంగాణ సాహితీ సిద్ధాంతకర్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి. ఇప్పుడు మూలాల్లోకి వెళ్లి సాహిత్య చరిత్రను 'వినిర్మాణం' చేసిండు. అట్లా చేసిండు కాబట్టే ఆయన తెలంగాణ సాహిత్యాన్ని 'పీఠాధిపతులు', 'పండితుల' గుత్తాధిపత్యం నుంచి తప్పించగలిగిండు. అందుకు నిలువెత్తు నిదర్శనం ఆయన 'తెలంగాణ అస్తిత్వ నిర్మాణ వ్యాసాలు' సంపుటి 'వినిర్మాణం'.

ఈ పుస్తకాన్ని 'నలు పార్శ్వాల నుంచి తెలంగాణ ఐడెంటిటీని నిలబెట్టిన నలుగురు మాన్యులు ఆదిరాజు వీరభద్రరావు, దేవులపల్లి రామానుజరావు, బిరుదురాజు రామరాజు, పాకాల యశోదారెడ్డి గార్లకు వినమ్రంగా' సమర్పించిండు. తెలంగాణ సాహితీ మూలాలు తెలిసిన వాడు కాబట్టే వీళ్లను మతిల ఉంచుకున్నడు. గౌరవంగా స్మరించుకున్నడు. సుంకిరెడ్డిని 'సాహిత్య సిద్ధాంతకర్త'గా ఎందుకు గుర్తించాలంటే ఎక్కడా కూడా మొహమాటానికి బోకుండా, ఇంకా చెప్పాలంటే సొంత ప్రయోజనాలు పణంగా పెట్టి సైతం నికార్సైన వాస్తవాలను లెక్కలోకి తీసుకొని, లౌక్యం లేకుండా వాక్యాన్ని, వాచ్యాన్ని లోచూపుతో పరిశీలించి అక్షరాలుగా మలిచిండు. గుర్తించిన వాస్తవాలను, పరిశోధనలతో మెరుగుపరుచుకొని, అన్ని పార్శ్వాలను ఆకలింపు చేసుకొని తనకు మాత్రమే సొంతమైన జ్ఞాన/తాత్త్విక ముద్రతో సాహిత్యాన్ని సిద్ధాంతీకరించాడు. 'తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం: సిద్ధాంతాలు -పద్ధతులు', 'తెలంగాణ సాహిత్య విమర్శ దశ-దిశ', 'తొలి దళిత కవి దున్న ఇద్దాసు', 'తెలంగాణలో వచన కవిత్వం ఎప్పుడు పుట్టింది ఎట్లా నడిచింది', 'తొలి ఆధునిక, సమగ్ర విమర్శకుడు సురవరం', 'తెలంగాణ తొలి వైతాళికుడు రాజబహద్దూర్ వేంకటరామారెడ్డి', 'సబాల్టర్న్ ఆర్తి, ఆక్రోశం 'అజా'', 'దేవులపల్లి రామానుజరావు - బుద్ధి సమైక్య వాదం -దిల్ తెలంగాణ', 'కోస్తాంధ్ర ఆక్రమణను తెలంగాణ కథ పట్టుకున్నదా?', 'భావ కవిత్వం సీమాంధ్ర సొత్తా' అంటూ ఆయన విశ్లేషించిన వ్యాసాలు, అందులో సుంకిరెడ్డి నారాయణరెడ్డి స్థిరీకరించిన అభిప్రాయాలు కచ్చితంగా ఆయన్ని 'సిద్ధాంతకర్తగా' గట్టి పునాదుల మీద నిలబెడతాయి. మొత్తం **482** (**59** పేజీల ముందుమాటతో సహా) పేజీల ఈ పుస్తకంలో కథ, నవల, విమర్శ, కవిత్వం, వ్యక్తిత్వం, జ్ఞాపకాలపై రచనలున్నాయి. అన్నీ కూడా సాధికారతతో ఉన్నాయి.

సాహితీవేత్తల కేంద్రంగా రచనలను విశ్లేషించడం అందులోని సారాన్ని కాలమాన పరిస్థితులకు అన్వయించి, విషయాన్ని పొల్లుపోకుండా విడమర్చి చెప్పడంలో సుంకిరెడ్డి విజయం సాధించిండు. ఆళ్వారుస్వామి, దాశరథి తదితరుల రచనల్లోనూ పొసగని విషయాల్ని తేల్చి చెప్పిండు. దున్న ఇద్దాసు, సురవరం, గంగుల శాయిరెడ్డి, దైదవేములపల్లి దేవేందర్, ఆళ్వారు, దాశరథి, కాళోజీ, సినారె, సామల సదాశివ, యశోదారెడ్డి, దేవులపల్లి, పొట్లపల్లి, గవ్వా మురహరి రెడ్డి, రవ్వా శ్రీహరి, గద్దర్, బి.నరసింగరావు, ఎన్.గోపి, నోముల సత్యనారాయణ, సిధారెడ్డి, గుడిహాళం, ఎస్వీ, జ్వలిత, దోరవేటి, బివిఎన్ స్వామి, వనపట్ల సుబ్బయ్య, కాంచనపల్లి, జిలుకర, ఏనుగు నరసింహారెడ్డి, గఫార్ ఇట్లా తెలంగాణ తొవ్వల అక్షరాయుధాలై నిలబడ్డ సాహితీ యోధుల కృషికి సలామ్ జేసిండు. మంచి చెడ్డలు విచారించి ఎవరి స్థానం ఏమిటీ అని ఖరారు చేసిండు. అట్లా చేయడంలో ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాలేదు. డొంకతిరుగుడూ లేదు. ఇది ఆయన నిబద్ధతకు నిదర్శనం.




ప్రవేశిక పేరిట విపులంగా రాసిన 'వినిర్మాణ వాదం -ఒక పరిచయం'లో పద చర్చ దగ్గరి నుంచి డెరిడా,నీశ్చే, హైడెగ్గర్‌ల సిద్ధాంతాల వెలుగులో తెలుగు సాహిత్యంపై చర్చ చేసిండు. "ప్రతి వాచకానికి బహుళ అర్థాలు ఉంటాయనడం, అన్ని స్థిర నిర్మాణాల్ని నిరాకరించడం వినిర్మాణం పని, అంత మాత్రాన 'వినిర్మాణం' అంటే విధ్వంసం కాదు. వినిర్మాణంలో నిర్మాణం ఉంది' అంటాడు. 'చాలా మంది వినిర్మాణవాదం కేవలం మార్క్సిజానికి వ్యతిరేకం అని అనుకుంటారు. కాని అది అన్ని సిద్ధాంతాలను ప్రశ్నించింది' అని చెప్పిండు. అంబేద్కరిజం వెలుగులో "వినిర్మాణ వాదం అప్పుడు లేకపోయినప్పటికీ నిర్ణాయకత ఒక వైపు నుండే ఉండదని, ఒక సమస్యకు అనేక మూలాలుంటాయని భావించే

పుస్తక పరిచయం

అంబేడ్కర్ కుల సమస్యను చర్చకు పెట్టిండు. ఇటీవలి అస్తిత్వవాదాలు బహుళ మూలాలను, బహుళ పరిష్కారాలను చర్చకు పెట్టిన విషయం తెలిసిందే” అని సిద్ధాంతీకరించిండు.

ఈ పుస్తకంలోనే ‘చర్చ’ పేరిట జోడించిన వ్యాసాల్లో తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రావారి వివిధ వాదనలకు, ప్రశ్నలకు జవాబుగా రాసిన విషయాలున్నాయి. తెలంగాణ వట్టిగ రాలేదు, పెద్ద ఎత్తున సాగిన సాంస్కృతిక యుద్ధం ద్వారా సాధ్యమయింది. ఆ యుద్ధంలో స్వయంగా పాల్గొనడమే గాకుండా తోటి వారికి ప్రశ్నల కొడవళ్ళను నూరి ఇచ్చిండు. పత్రికల్లో చర్చల ద్వారా ఆధిపత్య ఆంధ్రుల డొల్లతనాన్ని కళ్లముందర వుంచిండు.

రాచపాళెం, గుడిపాటి ముందుమాటలతో వెలువడిన ఈ పుస్తకంలోని ఒక్క విషయం పట్ల నాకు భిన్నాభిప్రాయమున్నది. తొలి స్మృతి కావ్యం ఏది పేరిట రాసిన వ్యాసంలో 1910లో రావిచెట్టు రంగారావు చనిపోయినప్పుడు రాసిన స్మృతి గీతాలను తొలి వాటిగా పేర్కొన్నాడు. అయితే అంతకు ముందే 1904లో భండారు అచ్చమాంబ చనిపోయినప్పుడు ఆంధ్రా ప్రాంతంలోని ‘సావిత్రి’, ‘హిందూసుందరి’ పత్రికల్లో స్మృతి గీతాలు వెలువడ్డాయి. బహుశా ఇవే తెలుగు సాహిత్యంలో తొలి స్మృతి గీతాలేమో అనేది నిర్ధారించాల్సి ఉన్నది.

ఈ పుస్తకంలోని ఎక్కువ వ్యాసాలు ‘దక్కన్ ల్యాండ్’ పత్రికలో ప్రచురిత మయ్యాయి. ప్రచురిత సమయంలోనే గుంభనంగా చర్చలు జరిగాయి. కానీ ఎవ్వరూ ప్రతి విమర్శ చేయలేదు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఈ పుస్తకానికి పర్ఫెక్షన్ తీసుకు రావడానికి దాదాపు నాలుగేండ్ల సమయం తీసుకున్నడు. ఎందుకంటే ఇందులో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ముందుమాట 2017లో, గుడిపాటి ముందుమాట 2020లో రాసింద్రు. సుంకిరెడ్డి తన మాటలు కూడా 2020లోనే రాసుకున్నడు. అయినప్పటికీ పుస్తక ప్రచురణకు నాలుగేండ్ల సమయం తీసుకున్నడు. దీని వల్ల ఆ తర్వాత రాసిన వ్యాసాలు ఇందులో చోటు చేసుకోలేదు. ప్రధానంగా తెలంగాణ విమర్శకులపై రాసిన విలువైన వ్యాసాలు, వివిధ సందర్భాల్లో కీలక ప్రసంగ కర్తగా చేసిన ఉపన్యాసాలు ఇంకా అచ్చులోకి రావాల్సి ఉన్నది. ఆ పనిని త్వరగా చేయాలని కోరుకుంటున్నాను. ‘కవిలె’ను సమర్థవంతంగా నడిపించడంలో ముందుంటున్నందుకు ధన్యవాదాలు కూడా!

కవిత

# నీవు ఎదుగుతున్న క్రమంలో

**జయంతి వాసరచెట్ల, 99855 25355**



నడకలు నేర్పుతున్న నాటి నుండే
నీ భవిష్యత్తుకు ప్రణాళికలు గీస్తూ వస్తున్నాను
నేను కన్న కలల్ని ఎగురవేయాలని
నీవు తపనపడుతూనే ఉన్నావు!

సాకారం చేసుకోవాలనుకునేందుకు
దిశానిర్దేశం చేస్తున్నప్పుడే
నీదారిని చెరిపేయాలని చూసారు!

నీవు ఎక్కుతున్న ఒక్కో మెట్టు వెనుక
నలిగిపోయిన నామనసు దాగివుంది

నిస్సహాయ స్థితి లోనూ ఆశలవీచికలా మారి
నీవు నానుండి జారిపోకుండా కాపాడుకుంటాను
అమ్మా అనే నీపిలుపుకోసం
ఎప్పటికీ ఎదురుచూస్తూ
నాకోసం నీవు సృష్టించిన కొత్తపదంలా
భావన చెందుతుంటాను!

నీకు ఎగరడం నేర్పిన తల్లిపక్షినేకదానేన!
అయినా నీవు ఎగిరిపోతుంటే
నా ప్రాణం ఎవరో లాక్కెళ్ళిపోతున్నట్లు అనిపించింది

నీ అభివృద్ధి కోసం..
తపో దీక్షలో కూర్చున్నట్లు
జీవన సమరం లో నేను!
గతించిపోయిన కాలాన్ని తొవ్వకూడదంటారుకానీ.
ఆకాలంలోనే మన బ్రతుకుల మలుపులో
పడిన వేదనలు రాసిపెట్టి ఉన్నాయి..

డబ్బేలోకమా అన్న ప్రశ్నకు.
ప్రపంచం డబ్బు వెంటే నడుస్తుందనే సమాధానం వస్తుంది!

మనం పచ్చగా కనిపిస్తేనే తోడబుట్టిన తోడైనా సరే
చిన్నపిందెనైనా దొరక్కపోదా
అని వద్దన్నా వస్తారు!!

మనం చేయిచాస్తే మెటికలు విరిచినవాళ్ళే
లేని బంధాలన్నీకలుపుకుని
జోలె పట్టుకొని కూర్చుంటారు..!!

## కాంచనపల్లికి తన సొంతవూరిలో మిత్ర సన్మానం...



జూలపల్లి గ్రామ నివాసి, ప్రముఖ కవి కాంచనపల్లి గోవర్ధన్ రాజుకి తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం పెద్దపల్లి ఆధ్వర్యంలో స్థానిక జూపిటర్ హైస్కూల్ ఆవరణలో ఘనంగా శాలువా, మెమోంటో పులమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచలానంద పరిపూర్ణ ఆశ్రమ పీఠాధిపతి గురూజీ కన్నం సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ జూలపల్లి గ్రామంలో జన్మించి సాహిత్య రంగంలో ఎన్నో పుస్తకాలు రచించి, అమెరికాలోని హాల్ ఆఫ్ ఫేమ్ వారిచే బెస్ట్ పోయట్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం వారిచే సాహిత్య పురస్కారంతో బాటు అనేక అవార్డులు పొంది పలు సాహితీ సంస్థలకు అధ్యక్షులుగా వ్యవహరిస్తూ ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ సాహిత్య సేవలో ఉండటం గొప్ప విషయం అని కొనియాడారు. అంతే కాకుండా తమ మాతృమూర్తి పేరుతో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న కాంచనపల్లి గోవర్ధనరాజు అభినందనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఠాకూర్ సంగ్రామ్ సింగ్, జాడి శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ అందె కుమారస్వామి, జాగృతి నియోజకవర్గ కన్వీనర్ కోడూరి మహేశ్, జిల్లా సాహిత్య విభాగం కన్వీనర్ నూమల్లన్న, బొల్లం భూమేశ్, కోడూరి రవి, సాంబయ్య, వొడ్నాల ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాహితి సవ్యసాచి... "జలజం సత్యనారాయణ"

**- మంత్రి శ్రీనివాస్ గౌడ్**



విద్యావేత్తగా, సాహిత్యవేత్తగా, అనువాదకుడిగా ప్రఖ్యాత గాంచిన జలజం సత్యనారాయణ సాహితి సవ్యసాచి అని వక్తలు కొనియాడారు. నవంబర్14న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని జె.జె.ఆర్. ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రసిద్ధ కవి, రచయిత, అనువాదకులు జలజం సత్యనారాయణ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, యువజన సర్వీసులు, పురావస్తు, పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జలజం సాహిత్యవేత్తగా గొప్పపేరు తెచ్చుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో విద్యాసంస్థను స్థాపించి ఎందరో విద్యార్థులకు మార్గదర్శనం చేశారన్నారు. ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అటు విద్యారంగంలో ఇటు సాహిత్యరంగంలో రాణించాడన్నారు. బుర్రి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ ఎవరితోనైనా కల్మషం లేకుండా మెలిగే వ్యక్తిత్వం జలజానిదన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ జలజం లిటిల్ స్కాలర్స్ పాఠశాలను స్థాపించి ఎందరికో ఉత్తమమైన విద్యను అందించారన్నారు. లుంబిని పాఠశాల అధినేత కె.లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నో ఇతరేతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువాదించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్,డాక్టర్ గుంటి గోపి, జగపతిరావు, రావూరి సూర్యనారాయణ, ఎస్.విజయకుమార్, జయరాములు, జలజం కళాశాల కరస్పాండెంట్ రమేష్ గౌడ్, జలజం కుటుంబసభ్యులు సుషుమ్నరాయ్, వైశుషిరాయ్, విదుషీరాయ్, నాతి రవిచందర్, దామోదర్, లిటిల్ స్కాలర్స్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి ఆధ్వర్యంలో కవితా రచన శిక్షణ

నిజామాబాద్ జిల్లా తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఇప్పటివరకు 99 విద్యాసంస్థల్లో కార్యశాలలు నిర్వహించింది. తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం జిల్లా కన్వీనర్ తిరుమల శ్రీనివాసార్య ఆధ్వర్యంలో నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాలలో నెల నెలా కవితా యజ్ఞం పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్నారు. నవంబర్ 13వ తేదీన నవీపేట్ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ లో సృజనాత్మకత కవిత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ కవిత్వం, వచన కవిత్వం మినీకథలు రచన, తదితర అంశాలలో తిరుమల శ్రీనివాసార్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ ప్రగతిలో సాహిత్యం సాహిత్యకారుల పాత్రను వివరించారు. డాక్టర్ వెంకన్నగారి జ్యోతి పద్య రచన మెళుకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవీపేట్ తెలంగాణ జాగృతి కన్వీనర్ శ్రీకాంత్ నాయక్, రవీందర్, ప్రవీణ్, హాస్టల్ ఇన్చార్జ్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వీకారం




## కరోనా నానీలు

చలపాక ప్రకాష్
ఫోన్ : 92474 75975

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
విజయవాడ
వెల : రూ. 40/-




## ఫిరంగిదళం (మొగ్గలు)

డా॥ భీంపల్లి శ్రీకాంత్
సెల్ : 90328 44017

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
వెల : రూ.30/-




## కొత్త వేకువ

పద్మావతి రాంభక్త
ఫోన్ : 99663 07777

**పాలపిట్ట బుక్స్**
హైదరాబాద్
వెల : రూ. 100/-




## తెలంగాణ అక్షరాలు

నమిలికొండ బాలకిషన్ రావు
సెల్ : 98493 82399
నల్లగొండ

**ప్రసారిక**
వెల : రూ. 100/-




## మా కనపర్తి ముషాయిరా

రమేశ్ చెప్యాల
ఫోన్ : 98490 73163

**రూపసి ప్రచురణ**
హైదరాబాద్
వెల : రూ. 200/-




## స్వేచ్ఛాగానం

కరిపె రాజ్‌కుమార్
ఫోన్ : 8125144729

**పాలపిట్ట బుక్స్**
హైదరాబాద్
వెల : రూ. 150/-




## నేత మొగ్గలు

పులి జమున
సెల్ : 8500169682

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
వెల : రూ.30/-




## నీలో నేను

పులి జమున
సెల్ : 8500169682

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్




## రెండొకట్ల పదకొండు

సుభాషిణి తోట
ఖమ్మం
సెల్ : 9502818774
వెల : రూ.120/-




## పద్మశాలి మొగ్గలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్
సెల్ : 90328 44017

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
వెల : రూ.30/-

